

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



సారథ్యం.. సందిగ్ధం!

కొలిక్కిరాని రాష్ట్ర బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎన్నిక

ఇద్దరు కీలక ఆశావహుల పరస్పర ఫిర్యాదులు!

జిల్లా అధ్యక్షుల ఎన్నిక వివాదాస్పదం కావడంతో మరింత జాప్యం?

3

శుక్రవారం | 7-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) :310 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: దశమి రా. 9.26 తదుపరి ఏకాదశి; నక్షత్రం: రోహిణి రా.6.40 తదుపరి మృగశిర; వర్జ్యం: ఉ.10.56-12.29, రా.12.08-1.42, దుర్ముహూర్తం: ఉ.9.05-9.50, మ.12.52-1.37; అమృతఘడియలు: మ.3.34-5.07; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.48, సూర్యాస్తమయం: 6.09 | వరంగల్

Warangal |Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రూ. 10 వేల కోట్లు

ఏజెంట్ల పాలు!

అడ్డదారుల్లో అమెరికాకు 18 వేల మంది

ఒక్కొక్కరి నుంచి సగటున రూ.50 లక్షల వరకు వసూలు చేసిన ఏజెంట్లు

ఐరోపా మీదుగా మెక్సికోకు.. అడవుల్లో రోజుల తరబడి నడక.. దారిలో శవాలు, అస్థిపంజరాలు

విమానం ఎక్కించి కాళ్లు, చేతులకు సంకెళ్లేశారు

దిగేవరకు తెలియదు.. భారత్‌కు వచ్చామని..

తిరిగి వచ్చిన భారతీయుల కన్నీటి గాథలు



అమృత్‌సర్‌కు తిరిగి వచ్చిన వారితో కుటుంబీకులు, పోలీసులు

(సెంట్రల్ డెస్క్)

'అమెరికాలో ఫామ్‌హౌస్‌లలో కొలువులు'.. 'ఏటా లక్షలు ఆర్జించొచ్చు! రెండుమూడేళ్లలో పేదరికం నుంచి బయటపడొచ్చు!'.. అంటూ ఏజెంట్లు చెప్పిన మాయమాటలు నమ్మిన యువకులు ఆస్తులమ్ముకుని, అప్పులు చేసి రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల దాకా వారి చేతుల్లో పెట్టారు. ఏజెంట్ల డంకీ మార్గాల్లో(అడ్డదారుల్లో) అమెరికాకు వెళ్లి చిక్కుల్లో పడ్డారు. అమెరికా సైనికులకు పట్టుబడి, రోజుల తరబడి చీకటి

మిగతా 2వ పేజీలో...

అక్రమ వలసదారుల తరలింపు

కొత్తదేమీ కాదు!

2

గత 16 ఏళ్లలో 15,756 మందిని పంపారు: జైశంకర్

మోదీ, ట్రంప్ మిత్రులే కదా.. మన వాళ్లకు సంకెళ్లు ఏల?: ప్రియాంక

వలసదార్ల భద్రతకు కొత్త చట్టం!

పరిశీలిస్తున్న కేంద్ర ప్రభుత్వం



కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, దీపాదాస్ మున్షి, మహేశ్‌కుమార్ గౌడ్

పడవకు చిల్లు పడితే.. అందరమూ

మునుగుతాం

పార్టీ లైన్ దాటొద్దు.. ఐక్యంగా ఉంటేనే బలం

ఏవైనా సమస్యలుంటే నా దృష్టికి తీసుకురండి

కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణ చరిత్రాత్మకం

ఈ విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి

నిధుల కొరత ఉన్నా చాలా సాధించాం

చేసింది ప్రజలకు చెప్పుకోలేక పోతున్నాం

మండలాల వారీగా కార్యక్రమాలు చేపట్టాలి

పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీఎం నిర్దేశం

కుల గణనపై సూర్యాపేటలో బహిరంగ సభ

వర్గీకరణపై గజ్వేల్ లేదా నర్సాపూర్‌లో!

రాహుల్, ఖర్గేను పిలిచేందుకు ఢిల్లీకి సీఎం

మరో 3 రోజుల్లో పీసీసీ కార్యవర్గం: మహేశ్

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): "పడవకు రంధ్రం పడితే దాన్ని నడిపేవాడే కాదు.. ఆ పడవలో కూర్చున్న అందరూ మునుగుతారు. అలాగే పార్టీ బలంగా ఉంటేనే ప్రభుత్వమూ బలంగా ఉంటుంది. అందరం కలిసికట్టుగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుంది" అని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎవరూ పార్టీ లైన్ దాటొద్దని, క్రమశిక్షణతో మెలగాలని.. గురువారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో గురువారం జరిగిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో హెచ్చరించారు. "రాజకీయాల్లో నమ్మకమే ప్రధానం. నమ్మకంతో పనిచేస్తేనే ప్రజలు విశ్వసిస్తారు. ఫలితమూ దక్కుతుంది" అని ఆయన పేర్కొన్నారు. ఎప్పుడూ నాయకుని ఆలోచనా విధానం గురించి తెలుసుకుని పనిచేయాలని.. రాహుల్‌గాంధీ ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకునే రాష్ట్రంలో కులగణన, ఎస్సీ వర్గీకరణ నిర్ణయాలను తీసుకున్నామని రేవంత్ గుర్తుచేశారు. ఈ నిర్ణయాలతో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇక మీదట తరచుగా కలుస్తూ ఉందామని, సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వారికి సూచించారు. అలాగే ప్రభుత్వం తీసుకునే విధానపరమైన

మిగతా 13వ పేజీలో...

ప్రజా ప్రతినిధుల సిఫారసు

బిల్లులకు ప్రాధాన్యం

మంత్రుల్లో ఎక్కువ క్లియరైంది జూపల్లి బిల్లులే

తక్కువ సిఫారసు చేసింది ఉత్తమ్, పొంగులేటి

సీఎల్పీ భేటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

13

బీసీలు భళా!

రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో కోటాకు మించి ప్రాతినిధ్యం

పంచాయతీ, ఎంపీటీసీల్లో 33%, జడ్పీటీసీల్లో 38.4%

ఎస్టీ తండాలు, పెసా గ్రామాలను తీసేస్తే ఇంకా ఎక్కువ

గత పంచాయతీ ఎన్నికల్లో 41.5% సీట్లలో విజయం

కొన్ని జిల్లాల్లో 40%.. మరికొన్నిచోట్ల 50% పైగా..

42% అమలైతే మరింత పెరగనున్న బీసీల ప్రాతినిధ్యం

నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 34%.. ఏపీ నిర్ణయం



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో 263 గ్రామ పంచాయతీలున్నాయి. రిజర్వేషన్ ప్రకారం బీసీలకు 70 సీట్లు కేటాయించారు. జనరల్ స్థానాల్లో మరో 74 మంది బీసీ అభ్యర్థులు గెలుపొందారు. దాంతో, ఇక్కడ బీసీ సర్పంచుల సంఖ్య 144. అంటే.. గ్రామ పంచాయతీల్లో బీసీ ప్రజా ప్రతినిధులు 54.75 శాతం. ఇదే జిల్లాలో ఎంపీటీసీ స్థానాలు 138 ఉండగా.. వాటిలో బీసీలకు 37 కేటాయించారు. మరో 39 జనరల్ స్థానాల్లోనూ బీసీలు విజయం సాధించారు. వెరసి, బీసీ ఎంపీటీసీల సంఖ్య 76కు.. వారి శాతం 55కు చేరింది. జడ్పీటీసీ సీట్లు 13 ఉండగా.. వాటిలో 4 రిజర్వ్ చేశారు. మరో రెండు జనరల్ సీట్లలో విజయం సాధించారు. జిల్లాలో జడ్పీటీసీల సంఖ్య ఆరుకు.. మొత్తం సీట్లలో వారి శాతం 46.15 శాతానికి చేరింది. ఈ జిల్లాలో అన్ని ఎన్నికల్లో బీసీల ప్రాతినిధ్యం ఎక్కువే.

సంగారెడ్డి జిల్లాలో మొత్తం 647 గ్రామ పంచాయతీలు ఉండగా 175 బీసీలకు రిజర్వ్ అయ్యాయి. మరో 107 జనరల్ స్థానాల్లోనూ వారు విజయం సాధించారు. ఇక్కడ మొత్తం బీసీ సర్పంచుల సంఖ్య 282. అంటే, పంచాయతీల్లో బీసీ సర్పంచుల ప్రాతినిధ్యం 43.58%. ఎంపీటీసీ స్థానాలు 295 ఉంటే.. వాటిలో బీసీలకు 61 కేటాయించారు. మరో 71 జనరల్ స్థానాల్లో గెలవడంతో వారి సంఖ్య 132కి చేరింది. అంటే, ఎంపీటీసీల్లో బీసీల ప్రాతినిధ్యం 44.74 శాతానికి పెరిగింది. ఇక, జిల్లాలోని 25 జడ్పీటీసీలకు 5 బీసీలకు కేటాయించగా.. మరో 3 జనరల్ స్థానాల్లో విజయం సాధించారు. జడ్పీటీసీల్లో వారి ప్రాతినిధ్యం 32 శాతానికి చేరింది.

...కొన్ని జిల్లాల్లో బీసీల ప్రాతినిధ్యం ఎక్కువ! మరికొన్ని జిల్లాల్లో తక్కువ! మొత్తంగా మాత్రం రిజర్వేషన్ కంటే అధికమే! సర్పంచి నుంచి జడ్పీటీసీ వరకూ

మిగతా 12వ పేజీలో...

తీన్మార్ మల్లన్నకు షోకాజ్ నోటీస్

బీసీ కులగణన నివేదికపై వ్యాఖ్యల మీద 12లోగా వివరణ ఇవ్వాలి: కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన నివేదికపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ సీహెచ్.నవీన్ (తీన్మార్ మల్లన్న)కు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. కులగణన పూర్తి చేసి చరిత్ర సృష్టించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు పొందిన సమయంలో పార్టీ నిబంధనలు ఉల్లంఘించి విమర్శలు చేయడాన్ని టీపీసీసీ తీవ్రంగా పరిగణించింది. రాహుల్ గాంధీ ఆదేశాలు, పార్టీ అధినాయకత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా పరుష పదజాలంతో చేసిన వ్యాఖ్యలపై ఈ నెల 12లోగా వివరణ ఇవ్వాలని తీన్మార్ మల్లన్నను

మిగతా 14వ పేజీలో...



కేంద్రమంత్రి గడ్కరీతో కేటీఆర్

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు తప్పదు

ఉప ఎన్నికలు రావాలని ప్రజలు కోరుకుంటున్నారు

యూజీసీ నూతన నిబంధనలు సమాఖ్య స్ఫూర్తికి విఘాతం

రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని, హక్కులను హరిస్తే ఊరుకోం

ఢిల్లీలో మీడియాతో కేటీఆర్

ధర్మేంద్ర ప్రధాన్, గడ్కరీతో భేటీ

12

జూన్ 1న ఎడ్‌సెట్.. 11న పీఈసెట్

షెడ్యూళ్లు విడుదల చేసిన ఉన్నత విద్యామండలి

14

నాగయ్య మరణం ప్రభుత్వ హత్యే

మాజీ మంత్రి హరీశ్ రావు

రూ.25 లక్షల పరిహారం ప్రకటించాలని డిమాండ్

12

ఇందిరమ్మ ఇల్లు రాలేదన్న బాధతో నాగయ్య ఆత్మహత్య

ఆ 20 వేల మంది ఎక్కడ?!

- కెనడా వెళ్లి.. అక్కడ కాలేజీల్లో చేరని వేలాది మంది భారతీయ విద్యార్థులు
- జాబితాలో ఏపీ, తెలంగాణ వారూ..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఉన్నత విద్య కోసమని కెనడా వెళ్లిన దాదాపు 20 వేల మంది భారతీయ విద్యార్థులు అక్కడ కళాశాలల్లో చేరలేదని ఇటీవల ఓ నివేదిక వెల్లడించింది. వారంతా ఎక్కడున్నారనే దానిపై ప్రభుత్వం వద్ద కూడా సమాచారం లేదు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై విస్తృత చర్చ జరుగుతోంది. ఆ విద్యార్థుల్లో చాలా మంది వరకు కెనడా నివాసంలో ఉండేందుకు, డబ్బు సంపాదించుకునేందుకు పలు రకాల పార్ట్‌టైమ్, ఫుల్‌టైమ్ ఉద్యోగాలు చేసుకుంటున్నారని టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం పేర్కొంది. కొంత మంది విద్యార్థులు నకిలీ కళాశాలల చేతుల్లో మోసపోగా.. మరికొంత మంది ఉద్దేశపూర్వకంగానే కెనడాలో ఉద్యోగాలు చేసుకొనేందుకు స్టూడెంట్ వీసాను దుర్వినియోగం చేసినట్లు తెలిసింది. అమెరికా, ఆస్ట్రేలియా మాదిరిగా కెనడా విధానంలో అంతర్జాతీయ విద్యార్థులు ముందుగా ట్యూషన్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. దీన్ని చాలా మంది విద్యార్థులు ఆసరాగా



చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు గుజరాత్, పంజాబ్, హరియాణా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి చాలా మంది విద్యార్థులు ఈ విధంగానే కెనడా వెళ్లారు. కాలేజీల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు తరగతులకు మాత్రం హాజరు కావడం లేదు. దీనికి బదులుగా డబ్బులు సంపాదించుకొనేందుకు మొబైల్ షాపుల్లో, గ్యాస్ స్టేషన్లలో, డెలివరీ ఏజెంట్లుగా ఉద్యోగాలు చేస్తున్నారు. కొంతమంది విద్యార్థులకు వాస్తవంగా చదువుకోవాలనే ఉద్దేశం ఉన్నప్పటికీ, మంచి యూనివర్సిటీల్లో అడ్మిషన్లు దొరకక.. చిన్న కాలేజీల అఫర్లను అంగీకరిస్తున్నారు. చివరకు అక్కడకు చేరుకున్న తర్వాత ఆ కాలేజీలు నకిలీవని తేలడమో లేదా తగిన సదుపాయాలు లేకపోవడం వంటివి చోటుచేసుకున్నాయి. తెలంగాణలోని ఖమ్మంకు చెందిన ఓ 26 ఏళ్ల విద్యార్థి సర్రేలోని ఓ కాలేజీలో అడ్మిషన్ తీసుకున్నాడు. అయితే అతను తరగతులకు హాజరు కాకుండా ఒక మొబైల్ షాపులో ఫుల్ టైమ్ ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడ అతనికి ఒక గంటకు ఏడు డాలర్ల వరకు ఇస్తారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలుకు చెందిన 25 ఏళ్ల మరో విద్యార్థి టోరంటోలో డెలివరీ ఏజెంట్‌గా చేస్తున్నారు. కెనడాలో కనిపించకుండా పోయారన్న చాలా మంది విద్యార్థులు సరిహద్దు దాటలేదని, కెనడాలోనే పని చేసుకుంటూ.. శాశ్వత నివాసం కోరుతున్నారని వలస నిపుణులు హెన్రీ లోటిన్ పేర్కొన్నారు.

లోకం తీరు





అక్రమ వలసదారుల పట్ల అమెరికా వ్యవహరించిన తీరుపై పార్లమెంట్ హౌస్ వద్ద నిరసన తెలుపుతున్న రాహుల్, ఖర్గే, ప్రియాంక, అఖిలేశ్ తదితరులు

అక్రమ వలసదారుల తరలింపు కొత్తదేమీ కాదు

- వలసదారుల పట్ల దురుసుగా ప్రవర్తించకుండా అమెరికాతో సంప్రదింపులు జరుపుతాం: జైశంకర్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: అక్రమ వలసదారులను వెనక్కి పంపే ప్రక్రియ కొత్తదేమీ కాదని విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. అయితే అక్రమ వలసదారుల పట్ల అనుచితంగా వ్యవహరించకుండా చూసేందుకు అమెరికాతో భారత ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోందని గురువారం రాజ్యసభలో వెల్లడించారు. టెక్సాస్ నుంచి 104 మంది అక్రమ వలసదారులను పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు తరలించిన సంగతి తెలిసిందే. అక్రమ వలసదారుల పట్ల అమెరికా దారుణంగా వ్యవహరించిందని, వారికి సంకెళ్లు వేసి అవమానించిందంటూ విపక్ష సభ్యులు నిరసనకు దిగారు. దీనిపై కేంద్రం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి జైశంకర్ స్పందించారు. ఏ దేశమైనా అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపడంపై దృష్టి పెట్టాలని, అలాగే చట్టబద్ధంగా వచ్చే వారికి వీసాలు సులభతరం చేయడానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇక అమెరికా నుంచి అక్రమ వలసదారులను తరలించే ప్రక్రియ 2009 నుంచి కొనసాగుతోందన్నారు. చాలామంది వలసదారులకు అమెరికాలో ఆస్తులు ఉన్నాయన్న అంశంపై స్పందిస్తూ.. ఈ సమస్యను పరిష్కరించేందుకు అమెరికా అధికారులతో సంప్రదింపులు జరుపుతామని జైశంకర్ చెప్పారు. కాగా, భారతీయుల పట్ల అమెరికా వ్యవహరించిన తీరును నిరసిస్తూ విపక్షాలు.. గురువారం లోక్‌సభ, రాజ్యసభల్లో ఆందోళనకు దిగాయి. విపక్ష సభ్యులు పదేపదే వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేయడంతో లోక్‌సభ నాలుగుసార్లు వాయిదా పడింది. కాగా ,మోదీ, ట్రంప్ మంచి మిత్రులు అయినప్పటికీ భారతీయులకు ఇలా జరగడమేంటని ఎంపీ ప్రియాంక ప్రశ్నించారు. వలసదారులను రప్పించడానికి మోదీ ఎందుకు విమానాన్ని పంపలేదని నిలదీశారు. జైశంకర్ ప్రకటన అనంతరం విపక్ష ఎంపీలు పార్లమెంటు ఆవరణలో నిరసన ప్రదర్శన చేపట్టారు.

రూ.10 వేల కోట్లు ఏజెంట్ల పాలు!

(మొదటి పేజీ తరువాయి)

గదుల్లో మగ్గి.. కాళ్ల, చేతులకు సంకెళ్లతో డీపోర్ట్‌కు గురయ్యారు. ఇలా 18 వేల మంది వరకు భారతీయులను వెనక్కి తిప్పిపంపేందుకు అమెరికా సిద్ధమవ్వగా.. వీరి ద్వారా ఏజెంట్లు రూ.10 వేల కోట్లకు పైగా జేబులు నింపుకొన్నట్లు అంచనా..! ఒక్క పంజాబ్‌లోనే.. 8 వేల మంది యువకులు రూ.4 వేల కోట్లను పోగొట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇవి అధికారిక లెక్కలు మాత్రమే..! అమెరికాలోకి చొరబడి, గుట్టుచప్పుడు కాకుండా పనిచేస్తున్న వారు.. మెక్సికో సరిహద్దుల్లోనే చనిపోయిన వారి సంఖ్యకు అంచనాల్లేవు..!

ఇలా తరలిస్తారు..

అమెరికా తిప్పిపంపిన 104 మంది భారతీయుల్లో ఒకరైన హర్విందర్‌సింగ్.. ఏజెంట్ల నేరశైలిని మీడియాకు వివరించారు. హర్విందర్ స్వస్థలం పంజాబ్‌లోని తహ్లీ గ్రామం. కడుపేద కుటుంబం కావడంతో.. అమెరికా వెళ్లి, బాగా సంపాదించాలని హర్విందర్ అనుకున్నారు. పొరుగింటి కుర్రాడు ఐదేళ్ల క్రితం 10 పాసవ్వగానే.. ఏజెంట్ల ద్వారా అమెరికాకు వెళ్లి.. అక్కడ వ్యవసాయ క్షేత్రాల్లో పనికి కుదిరాడు. మూడేళ్లలో ఆ కుటుంబాన్ని పేదరికం నుంచి బయటపడేసేలా సంపాదించాడు. దాంతో.. హర్విందర్ కూడా 8 నెలల క్రితం ఆస్తులమ్మి, అప్పులు చేసి, అమెరికా వెళ్లేందుకు రూ.42 లక్షలను ఏజెంట్ చేతుల్లో పెట్టారు. గత నెల 15న అమెరికాలోకి అడుగుపెట్టారు. ఆ వెంటనే అమెరికా సైనికులు అరెస్టు చేశారు. బుధవారం అమృత్‌సర్ తిరిగి వచ్చిన హర్విందర్.. ఏజెంట్ల మోసాలను గురించి మీడియాకు వివరించారు. "ఏజెంట్లు ఇటలీ, ఇతర చిన్న దేశాల్లో వర్క్ పర్మిట్లు ఇప్పించి, దుబాయ్ మీదుగా అక్కడికి తీసుకెళ్తారు. ఆ తర్వాత ఐరోపాకు.. అక్కడి నుంచి మెక్సికోకు తరలిస్తారు. మెక్సికో నుంచి డంకీ మార్గాల్లో అమెరికా సరిహద్దులను దాటిస్తారు. ఈ మార్గాలు భయంకరంగా ఉంటాయి. రోజుకు ఒక రొట్టె ముక్క, రెండు బిస్కట్లతోనే సరిపెట్టుకోవాలి. మధ్యలో అనారోగ్యానికి గురైతే.. అంతేసంగతులు. అడవుల్లో రోజుల తరబడి ఉన్నాం. ఆ మార్గంలో ఎన్నో శవాలు కనిపించాయి. మెక్సికో-అమెరికా సరిహద్దుల్లోని 45 కిలోమీటర్ల కొండ మార్గాల్లోనూ అస్థిపంజరాలు కనిపించాయి" అని చెప్పుకొచ్చారు. తాను గత నెల 15న అమెరికాలో అడుగుపెట్టానని, ఆ తర్వాత మిలటరీ అరెస్టు చేసిందని చెప్పారు. చీకటి గదుల్లో మగ్గిపోయామని, అక్కడి జైళ్లలో అంతా అక్రమంగా అమెరికాలోకి చొరబడ్డ వారేనని పేర్కొన్నారు. జైళ్లలో కాళ్లు, చేతులను సంకెళ్లతో కట్టేస్తారని, అమృత్‌సర్ విమానాశ్రయానికి వచ్చేవరకు కూడా తనకు సంకెళ్లు ఉన్నాయని చెప్పారు.



డేరియన్ గ్యాప్ అడవుల్లో..

ఏజెంట్లు దుబాయ్ లేదా ఇటలీ వంటి దేశాలకు వర్క్ పర్మిట్లు తీసుకున్నాక.. అక్కడి నుంచి టూరిస్ట్ వీసా తేలిగ్గా వచ్చే పనామా, కోస్టారికా, ఎల్-సాల్వడార్, గ్వాటిమాల వంటి దేశాలకు తీసుకెళ్తారు. కొలంబియా-పనామా మధ్య ఉన్న దట్టమైన అటవీ ప్రాంతం (సుమారు 100 కిలోమీటర్లు) మీదుగా ఉండే డేరియన్ గ్యాప్ నుంచి మెక్సికోకు తరలిస్తారు. డేరియన్ గ్యాప్ సాంతం చిత్తడి నేలలతో నిండి ఉండే దట్టమైన అడవి. క్రూరమృగాలు, విషసర్పాలకు నిలయం. ఈ 100 కిలోమీటర్లను కాలినడకన పూర్తిచేయడం ఓ సాహసమే. ఇందుకు 15 రోజుల సమయం పడుతుంది. ఈ అడవిని దాటాక.. మెక్సికోకు తరలిస్తారు. అక్కడి నుంచి అడవులు, గుట్టల మీదుగా 45 కిలోమీటర్ల కాలినడక తర్వాత.. అమెరికా సరిహద్దులకు చేరుకుంటారు. డేరియన్ గ్యాప్, మెక్సికో-అమెరికా సరిహద్దుల్లోని అటవీ ప్రాంతాల్లో డ్రగ్స్ ముఠాలు, దోపిడీ ముఠాలు అక్కడికి వచ్చినవారిని వచ్చినట్లు దోచుకునేందుకు కాచుక్కూర్చుంటాయి. ఈ ముఠాలకు ఎదురు తిరిగితే.. చంపేందుకూ వెనకాడవు. ఇంతటి ప్రతికూల వాతావరణం ఉన్నా.. ఏటా సుమారు 5 లక్షల మంది అక్రమంగా అమెరికాలోకి చొరబడుతుంటారు. ఇలా వెళ్లే వారిలో భారత్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, హైతీ, ఈక్వెడార్, వెనెజువెలా దేశాలకు చెందిన యువకులే ఎక్కువగా ఉంటారు. ఇప్పటి వరకు 18 వేల మంది భారతీయులు అక్రమంగా తమదేశంలోకి చొరబడ్డట్లు అమెరికా ప్రకటించగా.. వారిలో 8 వేల మందికి పైగా పంజాబీలు ఉండడం గమనార్హం..!

ఆస్తులు, డబ్బు అంతా పోగొట్టుకున్నాం



మాది డేరాబస్సీ బ్లాక్‌లోని జజోత్ గ్రామం. మా అబ్బాయి ప్రదీప్ 12వ తరగతి పాసవ్వగానే అమెరికా పంపేందుకు భూములు అమ్మి రూ.42 లక్షలను ఏజెంట్ల చేతుల్లో పెట్టాను. మాది పేద కుటుంబం. పెళ్లి కావాల్సిన కూతురు ఉంది. ప్రదీప్ అమెరికాలో సంపాదించి, మా కష్టాలు తీరుస్తాడనుకున్నాం. ఆర్నెల్ల క్రితం ఏజెంట్లతో వెళ్లిన ప్రదీప్‌ను అమెరికా ప్రభుత్వం తిప్పి పంపింది. ఇప్పుడు మేమేం చేయాలి? భూముల్లేవు, డబ్బుల్లేవు.

\- నరీందర్ కౌర్, పంజాబ్

కాళ్లు చేతులకు సంకెళ్లు

భారత్‌కు తిప్పి పంపిన యువకులకు సంకెళ్లు వేశారంటూ.. కాదుకాదు.. అదంతా ఫేక్ అని విపక్షాలు, అధికార ఎన్డీయే మధ్య మాటల యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో.. అమృత్‌సర్ తిరిగి వచ్చిన బాధితులు అసలు విషయం వెల్లడించారు. అమెరికాలో సైనిక విమానంలోకి ఎక్కించింది మొదలు.. తమ కాళ్లు, చేతులను గొలుసులతో బంధించారని పేర్కొన్నారు. అమెరికా కస్టమ్స్-బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం చీఫ్ మైఖేల్.డబ్ల్యూ.బ్యాంక్స్ కూడా అమృత్‌సర్‌కు బయలుదేరిన విమానంలో సంకెళ్లు వేసిన అక్రమ వలసదారులంటూ.. ఎక్స్‌లో ఫొటోలను షేర్ చేశారు.

విమానం ఎక్కించి కాళ్లు చేతులకు సంకెళ్లు వేశారు



నా అమెరికా కల చెదిరిపోయింది. ఏజెంట్లు నిండా మోసం చేశారు. రూ.40 లక్షలు తీసుకుని, అమెరికాకు పంపిస్తున్నామంటే.. అంతా సక్రమంగా ఉంటుందనుకున్నా. అప్పుచేసి, డబ్బులిచ్చా. ఐరోపాకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి బ్రెజిల్‌కు.. ఆ తర్వాత కాలినడకన అమెరికా సరిహద్దులకు చేర్చారు. 2024 జూలైలో ఐరోపాకు వెళ్తే.. ఆర్నెల్లపాటు వేర్వేరు దేశాల్లోని డంకీ మార్గాల్లో తిప్పారు. పనామా అడవుల్లోనూ గడిపాను. అమెరికా సరిహద్దు దాటగానే.. సైనికులు అరెస్టు చేశారు. చీకటి గదుల్లో ఉంచారు. ఎక్కడికి తీసుకెళ్తున్నారో చెప్పరు. చివరకు అమృత్‌సర్ వచ్చేప్పుడు కూడా విమానం ఎక్కించి, కాళ్లు, చేతులకు గొలుసులతో సంకెళ్లు వేశారు. కిందకు దిగేవరకు కూడా నాకు తెలియదు.. నేను భారత్‌కు వచ్చానని..!

\- జస్పాల్ సింగ్, గురుదాస్‌పూర్

జైలులోనే సుఖ్‌పాల్!

రూ.45 లక్షలు చెల్లించి, నా కొడుకు సుఖ్‌పాల్‌ను 8 నెలల క్రితం అమెరికా పంపాను. ఏజెంట్లు తొలుత ఇటలీ వర్క్ పర్మిట్‌తో తీసుకెళ్లారు. నెల క్రితం అక్కడి నుంచి అమెరికాకు డంకీ మార్గాల్లో తరలించారు. 22 రోజుల క్రితం అమెరికాకు చేరుకున్నట్లు సుఖ్‌పాల్ ఫోన్ చేసి చెప్పాడు. ఆ తర్వాత సమాచారం లేదు. బహుశా.. అక్కడి పోలీసులు జైలులో పెట్టారేమో..! మా అబ్బాయిని వెంటనే భారత్‌కు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

\- ప్రేమ్‌కుమార్, ధారాపూర్ తండా(పంజాబ్)

ఇజ్రాయెలే మాకు అప్పగిస్తుంది

- గాజా స్వాధీనంలో మా సైన్యం ప్రమేయం ఉండదు
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టీకరణ



వాషింగ్టన్, ఫిబ్రవరి 6: యుద్ధం ముగిసిన అనంతరం గాజా స్ట్రిప్‌ను ఇజ్రాయెల్ తమకు స్వాధీనం చేస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. దీంట్లో అమెరికా దళాల ప్రమేయం ఏమీ ఉండదని ఆయన తేల్చిచెప్పారు. గాజా పునర్నిర్మాణం జరిగే వరకూ సుమారు 2 లక్షల మంది పాలస్తీనీయులను శరణార్థులుగా స్వీకరించాలంటూ ఇటీవల ఈజిప్ట్, జోర్డాన్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, అరబ్‌లీగ్, పాలస్తీనా అథారిటీని ట్రంప్ కోరగా.. ఆయా దేశాలు ఆ ప్రతిపాదనను తిరస్కరించిన సంగతి తెలిసిందే. దీంతో గాజాను అమెరికా స్వాధీనం చేసుకుంటుందని మంగళవారం ఆయన ప్రకటించారు. ఆ ప్రకటనపైనా అరబ్ దేశాలు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో.. గాజా విషయంలో తమ సైన్యం ప్రమేయం ఉండదంటూ గురువారం ఆయన స్పష్టత ఇచ్చారు. నిజానికి అసలు పాలస్తీనియన్లు ఇప్పటికే అత్యంత అధునాతనమైన, ఆధునిక నివాసాల్లో, అందమైన కమ్యూనిటీల్లో పునరావాసం ఏర్పరచుకుని ఉండాల్సిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్.. డెమొక్రాట్ పార్టీకి చెందిన పాలస్తీనా సంతతి మైనారిటీ నేత, సెనేటర్ చక్ షుమర్ పేరును సైతం ప్రస్తావించడం గమనార్హం. గాజా ప్రాంతంలోని పాలస్తీనియన్లు ఆయన లాగా వేరే ప్రాంతాల్లో/దేశాల్లో స్థిరపడి ఉండాలన్న భావనను పరోక్షంగా వ్యక్తం చేశారు. తాము ప్రతిపాదిస్తున్న బలవంతంపు తరలింపు ప్రక్రియను.. పాలస్తీనియన్లకు ఆనందంగా, సురక్షితంగా, స్వేచ్ఛగా జీవించే అవకాశంగా ట్రంప్ అభివర్ణించారు. గాజా ప్రాంత అభివృద్ధికి ప్రపంచం నలుమూలల నుంచీ బృందాలను రప్పిస్తామని.. అక్కడ నిదానంగా, జాగ్రత్తగా నిర్మాణ పనులు చేపట్టి దాన్నొక భూతలస్వర్గంగా మారుస్తామని ఆయన పేర్కొన్నారు.

'అన్న యోజన'లో అనర్హుల ఏరివేతకు ఐటీ డేటా

- పన్ను చెల్లించే వారికి పథకం నిలిపివేత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: పేద కుటుంబాలకు ఉచితంగా రేషన్ అందించే ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) పథకంలోని లబ్ధిదారుల్లో అనర్హులైన వారిని ఏరి వేసేందుకు కేంద్రం చర్యలు ప్రారంభించింది. దీనికోసం పన్ను చెల్లించే వారి వివరాలను ఆదాయ పన్ను శాఖ నుంచి ఆహార మంత్రిత్వ శాఖ తీసుకోనుంది. ఆదాయ పన్ను చెల్లించని పేదలకు మాత్రమే పీఎంజీకేఏవై పథకం వర్తిస్తుంది. ఇటీవల ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో రూ. 2.03 లక్షల కోట్లను పీఎంజీకేఏవై పథకం కోసం కేంద్రం కేటాయించింది. ఈ నిధులు అర్హులకు మాత్రమే చేరాలని కేంద్రం భావిస్తోంది. ఆధార్, పాన్‌తో లింక్ అయిన పన్ను చెల్లింపుదారుల డేటాను ఆహారం, పౌర సరఫరాల శాఖ (డీఎఫ్‌పీడీ)కు ఇవ్వనున్నామని సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) తెలిపింది.

బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా తండ్రి ఇంటికి నిప్పు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: బంగ్లాదేశ్‌లో మళ్లీ హింస చెలరేగింది. ఆందోళనకారులు బుధవారం రాత్రి మాజీ ప్రధాని షేక్ హసీనా తండ్రి, బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు షేక్ ముజిబుర్ రెహమాన్(బంగబంధు) చారిత్రక ఇంటికి నిప్పు అంటించారు. బంగ్లాదేశ్ స్వాతంత్ర్య పోరాటానికి చిహ్నమైన ఆ ఇంటిని హసీనా.. మ్యూజియంగా మార్చారు. హసీనా దివంగత భర్త నివాసాన్ని, మరికొందరు అవామీ లీగ్ నాయకుల ఇళ్లను కూడా నిరసనకారులు తగలబెట్టారు. బంగ్లాదేశ్‌లో యూనస్ ఆధ్వర్యంలోని తాత్కాలిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలపాలని భారత్‌లో తలదాచుకుంటున్న షేక్ హసీనా అవామీ లీగ్ మద్దతుదారులకు బుధవారం రాత్రి సామాజిక మాధ్యమాల ద్వారా విజ్ఞప్తి చేస్తూ ప్రసంగిస్తున్న సమయంలోనే హింస చెలరేగింది. విధ్వంసం ఘటనపై హసీనా స్పందిస్తూ.. "నాకు, నా సోదరికి ఉన్న ఒక్కగానొక్క జ్ఞాపకాన్ని నాశనం చేశారు. వారు భవనాన్ని కూల్చివేయవచ్చు. కానీ చరిత్రను చెరిపేయలేరు. ఆ చరిత్ర పగ తీర్చుకుంటుందని వారు గుర్తుంచుకోవాలి" అని ఆమె పేర్కొన్నారు.

వలసదారుల భద్రతకు కొత్త చట్టం!

- పరిశీలిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- విదేశాల్లో ఉపాధికి సురక్షిత వలసలను ప్రోత్సహించేలా చట్టంలో విధివిధానాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఉపాధి కోసం విదేశాలకు వెళ్లే భారతీయుల భద్రత కోసం కొత్త చట్టం తీసుకురావాలని కేంద్రం యోచిస్తోంది. విదేశాల్లో ఉపాధి కోసం సురక్షితమైన, క్రమబద్ధమైన వలసలను ప్రోత్సహించేలా చట్టంలో విధివిధానాలు రూపొందించాలని పరిశీలిస్తోంది. తాజాగా భారత్‌కు చెందిన 104 మంది అక్రమ వలసదారులను అమెరికా వెనక్కి పంపడంతో ఈ ప్రతిపాదన వచ్చింది. 1983 నాటి వలస చట్టం స్థానంలో కొత్త ప్రతిపాదిత చట్టం (ఓవర్సీస్ మొబిలిటీ బిల్లు-2024)తీసుకొచ్చే అంశం పరిశీలనలో ఉంది. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ సారథ్యంలోని విదేశీ వ్యవహారాల కమిటీ దీనిపై పార్లమెంటులో నివేదిక సమర్పించింది. వలసదారుల భద్రతను పర్యవేక్షించే(పీవోఈ) ఆఫీసులు లేని రాష్ట్రాల్లో కొత్తగా ఏర్పాటు చేయాలని ఈ కమిటీ సూచించింది. ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, చండీగఢ్, కొచ్చి, తిరువనంతపురం, జైపూర్, పట్నా, రాయబరేలి, రాంచీ, గువహటిలలో 14 కార్యాలయాలు ఉన్నాయని వెల్లడించింది. వలసలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో అదనపు కార్యాలయాలు ఏర్పాటు చేయాలని సూచించింది. వీసా నిబంధనలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరముందని పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా వలసలు పెరుగుతున్న నేపథ్యంలో భారత పౌరుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 1983 వలస చట్టం స్థానంలో సమగ్ర శాసన సవరణ అవసరమని కొన్నేళ్లుగా ప్రభుత్వానికి సూచిస్తున్నట్టు కమిటీ పేర్కొంది. ప్రతిపాదిత ముసాయిదాపై సంబంధిత శాఖలతో చర్చించిన తర్వాత ప్రజాభిప్రాయం కోసం అందుబాటులో ఉంచనున్నట్టు విదేశీ వ్యవహారాల శాఖ తెలియజేసిందని కమిటీ వెల్లడించింది.

ఓవర్సీస్ బిల్లుతో లాభాలు

- మెరుగైన నిబంధనలు తేవడం ద్వారా అక్రమ నియామకాలు, దోపిడీ, మోసాల నుంచి వలసదారులకు రక్షణ
- వలసలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వలసదారుల భద్రతా కార్యాలయాల విస్తరణ. తద్వారా సులభంగా చట్టపరమైన మార్గదర్శకత్వం, మద్దతు
- పౌరసమాజం, మీడియా భాగస్వామ్యంతో వలసదారులకు హక్కులు, చట్టపరమైన విధానాలు, అక్రమ వలసలతో ఇబ్బందులపై అవగాహన
- ఆధునికీకరణ వ్యవస్థ ద్వారా అధికారిక అడ్డంకుల్ని తొలగించి, పద్ధతిప్రకారం వలస ప్రక్రియను పూర్తి చేయడం
- ప్రపంచ వలస ధోరణులు, భారత పౌరుల అవసరాలకు అనుగుణంగా విస్తృతంగా చర్చించి బిల్లు రూపకల్పన

మరో రెండు ఎగ్జిట్ పోల్స్ బీజేపీ వైపే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీనే అధికారంలోకి రానున్నదని టుడేస్ చాణక్య యాక్సిస్ మై ఇండియా సర్వే సంస్థలు వెల్లడించాయి. గురువారం తమ అంచనాలను ప్రకటించాయి. ఎన్నికల్లో బీజేపీకి 51, ఆమ్ ఆద్మీకి 19 సీట్లు లభిస్తాయని టుడేస్ చాణక్య అంచనా వేసింది. అదేవిధంగా బీజేపీకి 45 నుంచి 55 సీట్లు, ఆమ్ ఆద్మీకి 15-20 సీట్లు, కాంగ్రెస్‌కు 0-1, ఇతరులకు 0-1 సీట్లు వస్తాయని యాక్సిస్ మై ఇండియా సంస్థ తెలిపింది.

అందరితో.. అందరి కోసం

ప్రభుత్వాన్ని నడుపుతున్న విధానం ఇదే.. కాంగ్రెస్ హయాంలో అన్నీ బుజ్జగింపు నిర్ణయాలే

- అన్ని వర్గాల సంతృప్తే మా లక్ష్యం
- అంబేడ్కర్ అంటే కాంగ్రెస్‌కు గౌరవం లేదు: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ (అందరితో కలిసి.. అందరి అభివృద్ధి కోసం) సిద్ధాంతమే తమ ప్రభుత్వాన్ని నడిపిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. పేదలు, మధ్యతరగతి, కొత్తగా మధ్యతరగతిలో చేరుతున్న వారి సంక్షేమం కోసం సర్కారు పని చేస్తోందన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు బదులిస్తూ మోదీ గురువారం రాజ్యసభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌పై విమర్శలు కురిపించారు. 'దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆరు దశాబ్దాలపాటు కాంగ్రెస్ పాలనలో బుజ్జగింపు విధానాలే నడిచాయి. కొందరికి మాత్రమే ఇవ్వటం.. మిగిలినవారికి నిరాకరించటం అనే విధంగా పాలన నడిచింది. 2014 తర్వాత ఈ పద్ధతి మారింది. బుజ్జగింపు విధానాల మీద కాకుండా.. అందరి సంతృప్తే లక్ష్యంగా పాలన మొదలైంది. వనరులను సమర్థంగా ఉపయోగించుకోవటం, ఏ ఒక్కరినీ వదిలిపెట్టకుండా అందరికీ పథకాలను చేరువ చేయటంపైనే దృష్టి పెట్టాం. ఈ విధంగా ప్రతీ స్థాయిలో సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ విధానాన్ని అమలుపరిచాం. దాని ఫలితాలు ప్రస్తుతం చూస్తున్నాం. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చాం' అని మోదీ తెలిపారు.

ఓబీసీ ఎంపీల డిమాండ్‌ను పట్టించుకోలేదు

ఓబీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని పార్టీలకు అతీతంగా ఓబీసీ ఎంపీలు 3 దశాబ్దాలపాటు డిమాండ్ చేసినా.. నాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు అంగీకరించలేదని ప్రధాని గుర్తు చేశారు. కానీ, తాము ఓబీసీ కమిషన్‌ను ఏరాటు చేయటమేగాక రాజ్యాంగబద్ధతను కల్పించామన్నారు. దేశంలో రిజర్వేషన్ సమస్య ఎప్పుడు ముందుకొచ్చినా సమాజంలో అశాంతికి కారణమయ్యేదని, కానీ, తాము ఎవరి కోటానూ తగ్గించకుండా ఆర్థికంగా వెనుకబడిన (ఈబీసీ) వర్గాలకు 10% రిజర్వేషన్ కల్పించామని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సామాజికవర్గాలు కూడా స్వాగతించాయని మోదీ చెప్పారు. అంబేడ్కర్‌ను కాంగ్రెస్ గౌరవించలేదని, వారి పాలనలో ఆయనకు భారతరత్న ఇవ్వలేదని, ఇప్పుడు మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో జైభీం అని నినదిస్తోందన్నారు.

మజ్రూ సుల్తాన్‌పురిని అరెస్టు చేయించారు

ఎమర్జెన్సీకి అనుకూలంగా మాట్లాడనందుకు బాలీవుడ్ హీరో దేవానంద్ సినిమాలను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దూరదర్శన్‌లో ప్రదర్శించకుండా నిషేధించిందని, గాయకుడు కిశోర్‌కుమార్ పాటలపైనా ఇలాగే ఆంక్షలు విధించిందని మోదీ పేర్కొన్నారు. నిరసనల్లో పాల్గొన్నందుకు ప్రముఖ కవి మజ్రూ సుల్తాన్‌పురి, నటుడు బల్‌రాజ్ సాహ్నిలను కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టు చేయించిందని తెలిపారు.

చరిత్రను తుడిచేసే యత్నం

- భాషపై ఆర్ఎస్ఎస్ దాడి
- రాహుల్‌గాంధీ, అఖిలేశ్ ధ్వజం
- యూజీసీ ముసాయిదా నిబంధనలపై ఆగ్రహం
- జంతర్‌మంతర్ వద్ద డీఎంకే నిరసనకు హాజరు



నిరసనలో పాల్గొన్న రాహుల్, కనిమొళి, అఖిలేశ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: చరిత్రను తుడిచిపెట్టేందుకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) నిరంతరం ప్రయత్నిస్తోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. నియామక, పదోన్నతులకు సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) రూపొందించిన ముసాయిదా నిబంధనలకు వ్యతిరేకంగా డీఎంకే విద్యార్థి విభాగం గురువారమిక్కడ జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన నిరసనలో వారిద్దరూ పాల్గొన్నారు. 'ఈ దేశంలోని అన్ని చరిత్రలు, సంస్కృతులు, సంప్రదాయాలను నిర్మూలించడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని కొద్దికాలంగా నేను చెబుతూ వస్తున్నాను. రాజ్యాంగంపై వారు దాడిచేస్తున్నారు. దేశం మీద ఒకటే చరిత్ర, ఒకటే సంప్రదాయం, ఒకే భాష, ఆలోచనను రుద్దాలని అనుకుంటున్నారు. తమ ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి విద్యావ్యవస్థ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. తమిళ ప్రజలకు నిర్దిష్ట చరిత్ర, భాష, సంప్రదాయాలు ఉన్నాయి. పోరాటాల చరిత్ర కూడా ఉంది. యూజీసీ నిబంధనలు మార్చడం ద్వారా ఆర్ఎస్ఎస్ తన ఆధిపత్యాన్ని రుద్దాలనుకోవడం.. వారిని, ఇతర రాష్ట్రాలను అవమానించడమే' అని అన్నారు. జాతీయ విద్యావిధానాని(ఎన్ఈపీ)కి తాను వ్యతిరేకమని అఖిలేశ్ స్పష్టంచేశారు. రాష్ట్రప్రభుత్వాల అధికారాలన్నీ లాక్కోవాలని మోదీ ప్రభుత్వం చూస్తోందని ధ్వజమెత్తారు. కాగా, ప్రగతిశీల విద్యానిబంధనలను ప్రతిపక్షాలు వక్రీకరించి.. లేనిపోని ముప్పును ఊహిస్తున్నాయని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విమర్శించారు. యూజీసీ ముసాయిదా నిబంధనలు,హద్దులను విస్తృతం చేయడానికే తప్ప కుదించడానికి కాదన్నారు.

మార్చి 7 నుంచి హెచ్-1బీ వీసా రిజిస్ట్రేషన్లు

- అదే నెల 24 వరకూ కొనసాగనున్న నమోదు ప్రక్రియ
- 31న లబ్ధిదారుల ప్రకటన

వాషింగ్టన్, ఫిబ్రవరి 6: హెచ్-1బీ వీసా రిజిస్ట్రేషన్లను త్వరలో ప్రారంభించనున్నట్లు అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ (యూఎస్‌సీఐఎస్) ప్రకటించింది. మార్చి 7 నుంచి 24 వరకూ ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపింది. 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కోటా కింద జారీచేసే ఈ వీసాల కోసం ఆయా సంస్థలు, ప్రతినిధులు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని వెల్లడించింది. హెచ్-1బీ వీసా కోసం ఫీజు కింద 215 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. హెచ్-1బీ వీసాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మోసాలను అరికట్టేందుకు యూఎస్‌సీఐఎస్ ప్రవేశపెట్టిన కేంద్రీకృత ఎంపిక ప్రక్రియను ఈ సంవత్సరం కొనసాగించనున్నారు. దీనిప్రకారం ఒక లబ్ధిదారు బహుళ దరఖాస్తులు చేసుకున్నా వాటి సంఖ్యతో సంబంధం లేకుండా ఒకరికి ఒక దరఖాస్తును మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. మార్చి 24 నాటికి పరిమితిని మించి అప్లికేషన్లు వస్తే ర్యాండమ్ పద్ధతిలో ఎంపిక చేస్తారు. పరిమితికి మించకపోతే వచ్చిన అన్ని రిజిస్ట్రేషన్లను ఆమోదిస్తారు. వీసా లబ్ధిదారుల సమాచారాన్ని సంస్థల యజమానులు మార్చి 7 నుంచి నమోదు చేయడం ప్రారంభించాలి. ఎంపికైన వారి వివరాలను మార్చి 31లోగా ఖాతాలకు పంపిస్తారు.

అర్హులైన అర్చక, ఉద్యోగులందరికీ గ్రాంట్ ఇన్ ఎయిడ్ వేతనాలు

» శైలజా రామయ్యర్

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అర్హులైన అర్చక, ఉద్యోగులందరికీ త్వరలో గ్రాంట్ ఇన్ ఎయిడ్ వేతనాలు అందిస్తామని దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ అన్నారు. గురువారం చేనేత భవన్‌లోని కార్యాలయంలో అర్చక, ఉద్యోగుల వేతనాలు, ఇతర సమస్యలపై అధికారులు, జేఏసీ నాయకులతో జరిగిన సమావేశంలో ఆమె చర్చించారు. గత ప్రభుత్వంలో జీవో నెంబరు 577 ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 5,625 మంది అర్చక, ఉద్యోగులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ వేతనాలు చెల్లించాల్సి ఉన్నా.. కేవలం 3 వేల మందికి మాత్రమే చెల్లిస్తున్నారని ఈ సందర్భంగా జేఏసీ నేతలు ముఖ్య కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా వేతన చెల్లింపుల్లోను తీవ్ర జాప్యం జరుగుతోందని, కొన్ని సార్లు నెలల తరబడి వేతనాలు అందడం లేదని వివరించారు. పదవీ విరమణ చేసిన అర్చకులకు అర్చక వెల్ఫేర్ బోర్డు నుంచి రూ. 10 లక్షలు గ్రాట్యూటీ, పెన్షన్ సౌకర్యం, అర్చక, ఉద్యోగులకు హెల్త్ కార్డుల జారీతోపాటు జేఏసీ లేవనెత్తిన సమస్యల పట్ల శైలజా రామయ్యర్ సానుకూలంగా స్పందించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంబంధిత అధికారులతో మాట్లాడి గ్రాంట్ ఇన్ ఎయిడ్ వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, మఠైక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మూర్తి సత్యనారాయణ శర్మ, జేఏసీ అధ్యక్షుడు రవీంద్ర చారి ఇతరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సారథ్యం... సందిగ్ధం...!

కొలిక్కిరాని రాష్ట్ర బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ

» ఇద్దరు కీలక ఆశావహుల పరస్పర ఫిర్యాదులు!

» జిల్లా అధ్యక్షుల ఎన్నిక వివాదాస్పదం కావడంతో మరింత జాప్యం?



హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి ఎన్నిక మరింత జాప్యమయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలంటున్నాయి. సంస్థాగతంగా అర్హత సాధించినా, ప్రస్తుత పరిస్థితుల్లో ఆలస్యమయ్యే అవకాశం ఉందని పార్టీ ముఖ్యనేతలు అభిప్రాయపడుతున్నారు. సంస్థాగతంగా మొదటి నుంచీ ఉన్నవారికి రాష్ట్ర పార్టీ సారథ్య బాధ్యతలు కట్టబెట్టాలా? లేక కొత్తవారికి అవకాశం ఇవ్వాలా? అనే విషయంపై ఇప్పటికే రెండుసార్లు అంతర్గతంగా అభిప్రాయాలు తీసుకున్నారు. అయినా ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు పలువురు సీనియర్ నాయకులు పోటీపడుతున్న సందర్భంలో, ఎవరికి బాధ్యతలు కట్టబెట్టాలనేది అధినాయకత్వానికి సవాల్‌గా మారిందన్న అభిప్రాయం పార్టీవర్గాల్లో వ్యక్తమైంది. దీనికి తోడు ఆశావహుల్లో ఇద్దరు, ముగ్గురు కీలక నేతలు పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడం జాతీయ నాయకత్వానికి కొత్త తలనొప్పి తెచ్చిపెట్టిందని ప్రచారం జరుగుతోంది. నాయకుల పరస్పర ఫిర్యాదులపై జాతీయ నాయకత్వం ఆరా తీస్తోందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో ఎన్నిక ప్రక్రియ మరి కొన్ని రోజులు పట్టే అవకాశం ఉందని అని పార్టీ నేతల ద్వారా తెలిసింది.

జాప్యానికి ఇవి కూడా కారణాలే!

జిల్లా అధ్యక్షుల ఎన్నిక వ్యవహారం వివాదాస్పదం కావడం కూడా రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక జాప్యానికి కారణమయ్యే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే ప్రకటించిన 19 జిల్లా అధ్యక్షుల ఎన్నికల సందర్భంగా నవ, యువ తరానికి పట్టం కట్టినా, సామాజిక న్యాయం పాటించలేదన్న విమర్శలు వచ్చాయి. దీంతో 11 జిల్లాలను పెండింగ్‌లో పెట్టారు. స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో మరో 8 జిల్లాలను కూడా పెండింగ్‌లో పెట్టారు. రాష్ట్రంలో కీలకంగా ఉన్న తమకు ఒక్క జిల్లా అధ్యక్ష పదవి కూడా కేటాయించలేదంటూ యాదవ సామాజికవర్గం నాయకులు ఏకంగా రాష్ట్ర పార్టీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఇప్పటికే ప్రకటించిన 19 జిల్లా అధ్యక్ష పదవుల్లో మహిళలకు ఒక్కటీ దక్కలేదు. దీంతో మిగతా 19 జిల్లా అధ్యక్ష పదవుల్లో మహిళలకు ఎన్ని దక్కుతాయనేది కూడా ఉత్కంఠ రేపుతోంది.

ఖమ్మం మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి

» ఈ సీజన్‌లో తొలిసారి 80వేల బస్తాల రాక

ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఎర్రబంగారం (తేజా రకం కొత్త మిర్చి) పోటెత్తింది. గురువారం సుమారు 80 వేల మిరప బస్తాలు అమ్మకానికి వచ్చాయి. కొత్త మిర్చి సీజన్ ప్రారంభమైన తర్వాత తొలిసారిగా పంట ఇంత భారీగా రావడం ఇదే ప్రథమం. మార్కెట్‌కు మూడు రోజుల క్రితం 60 వేల బస్తాలు రాగా, తాజాగా 80 వేల బస్తాల వరకు వచ్చాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు మహబూబాద్, సూర్యాపేట, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాల రైతులు పంటను అమ్మకానికి తీసుకొస్తున్నారు. ఇక మార్కెట్లో క్వింటాలు మిర్చి జెండాపాట ధర రూ.14,025 నిర్ణయించారు. మిర్చి నాణ్యతను బట్టి క్వింటాలుకు కనిష్ఠంగా రూ.6,000, గరిష్ఠంగా రూ.13,700 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. అలాగే మార్కెట్‌కు కోల్డ్‌స్టోరేజీలలో నిల్వ ఉంచిన సుమారు 184 శాంపిల్ ఏసీ మిర్చి బస్తాలు రాగా అత్యధిక ధర క్వింటాలుకు రూ.13,300 పలికింది. నాణ్యతను బట్టి వ్యాపారులు క్వింటాలు ఏసీ మిర్చిని రూ.6,000 నుంచి రూ. 12,100 వరకు కొన్నారు. మిర్చి కొనుగోళ్లను మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్ సమీక్షించారు.

కుటుంబ కలహాలతో ఏఆర్ ఎస్సై ఆత్మహత్య!


లక్ష్మీనర్సు (ఫైల్)

పినపాక, గోవిందరావుపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని ఏడూళ్లబయ్యారం సర్కిల్ పోలీస్ స్టేషన్ టీజీ స్పెషల్ పార్టీ ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్) ఎస్సై సువర్ణపాక లక్ష్మీనర్సు(38) ఆత్మహత్య చేసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం మాణిక్యవరం గ్రామానికి చెందిన లక్ష్మీనర్సు 2007లో ఏఆర్ ఎస్సైగా ఉద్యోగంలో చేరారు. ఆయన భార్య వినోద ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. దాంతో తన ఇద్దరు పిల్లలు, భార్యతో కలిసి లక్ష్మీనర్సు గోవిందరావుపేట మండలంలోని పస్రా గ్రామంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. గురువారం తెల్లవారుజామున ఆ ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకున్నారు. కుటుంబ కలహాల కారణంగానే ఆయన బలవన్మరణానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన 8 మంది ఆదివాసీలే: మావోయిస్టు పార్టీ

చర్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా గంగలూరు అడవుల్లో కొన్ని రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన 8 మంది ఆదివాసీలేనని మావోయిస్టు పార్టీ ఆరోపించింది. ఈ మేరకు గురువారం పార్టీ సౌత్ సబ్‌జోనల్ బ్యూరో సమత పేరుతో లేఖ విడుదలైంది. ఫిబ్రవరి 1న గంగలూరులోని తోడ్కా గ్రామంతో పాటు ఇతర గ్రామాల గిరిజనులు గాదె పండుగను జరపడం కోసం అడవిలోకి వచ్చారని తెలిపారు. ఈ క్రమంలో గ్రామాన్ని చుట్టుముట్టిన సీఆర్పీఎఫ్, కోబ్రా, ఎస్టీఎఫ్, డీఆర్జీ బలగాలు కొంత మంది గ్రామస్థుల చేతులు వెనక్కు కట్టేసి కాల్పులు జరిపారని ఆరోపించారు. 24 మందిని గాయపరిచి, 67 మందిని వెంట తీసుకుని వెళ్లారని, తరువాత తప్పుడు కథనం అల్లారని పేర్కొన్నారు.

గ్రామసభలో పురుగుల మందు తాగి.. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటాం: మంత్రి సీతక్క.. ఆయనది ప్రభుత్వ హత్యే: బీఆర్ఎస్


నాగేశ్వర్‌రావు(ఫైల్)

ములుగు/కన్నాయిగూడెం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెంలో జనవరి 23న జరిగిన ప్రజాపాలన గ్రామసభలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన కుమ్మరి నాగేశ్వర్‌రావు(42) బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఘటన జరిగిన రోజు నుంచి హనుమకొండ జిల్లా ఆరెపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను బుధవారం రాత్రి కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలోనే ఆయన ఆరోగ్యం విషమించి అర్ధరాత్రి సమయంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వేణుగోపాల్ గురువారం ఎంజీఎంకు వెళ్లారు. అంత్యక్రియల నిమిత్తం రూ.50 వేలను కుటుంబ సభ్యులకు అందించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించిన కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. నాగేశ్వర్‌రావుకు భార్య శాంతి, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. వైద్యానికి ఇప్పటి వరకు రూ.8లక్షల 50వేల వరకు ఖర్చయ్యిందని, తాము సొంతంగా రూ.3లక్షల 50వేలు సమకూర్చుకోగా మిగతా మొత్తాన్ని రాజకీయ నాయకులు, సన్నిహితులు సాయంగా అందించారని నాగేశ్వర్‌రావు పెద్దకుమార్తె శాలిని తెలిపింది. వైద్య ఖర్చులకు డబ్బులు లేకపోవడంతోనే ఎంజీఎంకు తరలించాల్సి వచ్చిందని చెప్పింది. తాము పెద్దదిక్కును కోల్పోయామని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతోపాటు ఇల్లును మంజూరు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరింది. కాగా, నాగేశ్వర్‌రావు మృతి పట్ల మంత్రి సీతక్క ఓ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. నాగేశ్వర్‌రావుకు మెరుగైన వైద్యం అందించేలా చొరవ తీసుకుంటూనే ఉన్నామని తెలిపారు. కానీ, ఉన్నపళంగా ఎంజీఎం ఆస్పత్రికి ఎందుకు తీసుకెళ్లాల్సి వచ్చిందని కాంగ్రెస్ నేతలను మంత్రి ప్రశ్నించారు. మరోవైపు.. నాగేశ్వనరావుది ప్రభుత్వ హత్యేనని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు ఆరోపించారు. రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియాతోపాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆ రోజు ఏం జరిగిందంటే..

నాలుగు ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపికలో భాగంగా జనవరి 23న బుట్టాయిగూడెంలో అధికారులు గ్రామసభను నిర్వహించారు. ఈ పంచాయతీ పరిధి కొత్తూరుకు చెందిన కుమ్మరి నాగేశ్వర్‌రావు అప్పటికే ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. గ్రామ సభకు హాజరైన ఆయన లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేకపోవడంతో అధికారులను నిలదీశాడు. మళ్లీ దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామని అధికారులు వివరణ ఇస్తుండగానే తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

గురుకులంలో ఉరేసుకొని టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య

» పాలమూరు జిల్లా బాలానగర్ జనరల్ బాలికల హాస్టల్‌లో ఘటన

» విద్యార్థి సంఘాల ఆందోళన..

» బాధిత కుటుంబానికి జిల్లా కలెక్టర్ పరామర్శ



ఆరాధ్య (ఫైల్), బాలిక తల్లిని ఓదారుస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

బాలానగర్/మహబూబ్‌నగర్/షాద్‌నగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది.. ఎవరూ లేని తరగతి గదిలో ఉరేసుకొని ప్రాణాలు తీసుకుంది.. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ జనరల్ గురుకులంలో గురువారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. విద్యార్థులు ప్రార్థన కోసం సిద్ధమవుతున్న సందర్భంలో ఆరాధ్య (15) ఎవరూ లేని ఏడో తరగతి గదిలోకి వెళ్లి ఉరేసుకుంది. అది గమనించిన విద్యార్థినులు, ఉపాధ్యాయులు.. ఆమెను వైద్యం కోసం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలిక నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని చొక్కన్నపల్లికి చెందిన కొమ్ము రమేశ్-రజిత దంపతుల కూతురు.. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. అయితే విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పాఠశాల ఎదుట ధర్నా చేపట్టాయి. దీంతో పాఠశాల వద్ద జడ్చర్ల ఎస్సై ఆదిరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టర్ విజయేంద్ర బోయి పాఠశాలను పరిశీలించి విద్యార్థిని మృతికి గల కారణాలను పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాలిక తల్లి దండ్రులను ఓదార్చారు. విద్యార్థిని కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగాన్ని కల్పిస్తామని, విద్యార్థిని మృతికి కారణమైన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ నిచ్చారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నేతల ద్వారా రూ.50 వేల ఆర్థిక సహాయం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. పాఠశాలను పరిశీలించిన వారిలో జిల్లా ఎస్పీ డి.జానకి, జనరల్ గురుకుల పాఠశాల, కళాశాల డిప్యూటీ సెక్రటరీ ప్రసాద్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులున్నారు.

విద్యార్థులు చనిపోతున్నా పట్టదా..?: డీకే అరుణ

పాఠశాలల్లో విద్యార్థుల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా అని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ సర్కారును నిలదీశారు. నిన్న షాద్‌నగర్‌లో నీరజ్ పాఠశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకోగా, తాజాగా బాలానగర్‌లో గురుకుల పాఠశాలలో ఆరాధ్య ప్రాణం తీసుకోవడం బాధాకరమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వరుసగా విద్యార్థుల మరణాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఆయా ఘటనలపై విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లును సన్మానిస్తున్న ఎన్వీ రమణ

కార్పొరేట్ సంస్థల్లా రాజకీయ పార్టీలు

» ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం: ఎన్వీ రమణ

రవీంద్రభారతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలు కార్పొరేట్ సంస్థల్లా మరిపోయాయని, ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ అన్నారు. గురువారం రాత్రి రవీంద్రభారతిలో అవే సంస్థ 15వ జాతీయ సదస్సును జరిగింది. అవే సంస్థ వ్యవస్థాపకుడు మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఎన్వీ రమణ మాట్లాడుతూ.. నేటి రాజకీయ పార్టీలకు మేనిఫెస్టో ఉండటం లేదని, పార్టీలకు ప్రజల కష్టాలపైనా అవగాహన లేకుండా పోయిందని అన్నారు. సమాజంలో సేవ చేయడానికి అవకాశం వచ్చిన అధికారులు, రాజకీయ నాయకులు అవినీతిలో కురుకుపోయారన్నారు. సమాజానికి సేవ చేసిన పలువురిని ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఏపీ మాజీ మంత్రి మండలి బుద్ధ ప్రసాద్, పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాది కృష్ణారావు, ఈనాడు ఏపీ ఎడిటర్ నాగేశ్వరరావు, ప్రముఖ గాయకుడు కాసర్ల శ్యామ్, అవే డైరెక్టర్ ప్రీత హరిత్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ మౌనాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

» మూడేళ్లకు పైగా బిల్లులు ఎందుకు నిలిపివేశారు.. సమాధానం చెప్పాలి: సుప్రీం

చెన్నై, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ తనకు నచ్చిన విధంగా స్వీయ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని, అయితే తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి శాసనసభలో ఆమోదించిన బిల్లులను మూడేళ్లగా ఆమోదించక ఎలా మౌనంగా గడిపారంటూ అంటూ సుప్రీంకోర్టు ప్రశ్నించింది. తమిళనాడు శాసనసభలో బిల్లులు ఆమోదించి గవర్నర్‌కు పంపినా, వాటిని ఆమోదించకుండా బుట్టదాఖలు చేస్తున్నారని, విశ్వవిద్యాలయాల వైస్‌చాన్సలర్ల నియామకంలో గవర్నర్ రవి తనకు సంపూర్ణ అధికారాలు ఉన్నాయనే ధోరణితో వ్యవహరిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం ఆరోపిస్తూ.. బిల్లులను ఆమోదించేలా గవర్నర్‌కు ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేసింది. ఈ పిటిషన్ గత మంగళవారం విచారణకు రాగా గవర్నర్ సంజాయిషీ కోరుతూ ధర్మాసనం నోటీసు జారీచేసింది. అనంతరం ఈ పిటిషన్ గురువారం విచారణకు రాగా, గవర్నర్ తరఫు న్యాయవాదులపై ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది. ఎందు కు మూడేళ్లకు పైగా బిల్లులు నిలిపివేశారో గవర్నర్ సమాధానాలు చెప్పాల్సిందేనని పేర్కొన్న ధర్మాసనం, తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదావేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మాటలు.. మంటలు

నన్ను క్షమించండి, గతాన్ని వదిలేసి, ఈ కొత్తసంవత్సరంలో అన్ని జాతులవారూ ఒక్కటిగా కలిసిమెలసి నడవండి అంటూ నెలక్రితం ఓ అద్భుతమైన ఉపన్యాసం దంచిన మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ ఇంతలోనే అడ్డంగా దొరికిపోయారు. రాష్ట్రంలో నెలల తరబడిసాగిన హత్యాకాండను ప్రేరేపిస్తున్నది ఆయనేనంటూ మీతీయేతరులు ఆనాదిగా చేస్తూవచ్చిన ఆరోపణలకు ఈ ఆడియోటేపుల వ్యవహారం ఊతాన్నిస్తున్నది. మీతీలను తుపాకులు దోచుకోనివ్వండి, ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఆయుధాలను లూటీచేసేందుకు అవకాశమివ్వండి అంటూ ఆయన అధికారులను ఆదేశించినట్టుగా ప్రచారంలో ఉన్న సదరు ఆడియోక్లిప్‌తో బీరేన్‌సింగ్ గొంతు 93శాతం మేరకు సరిపోలిందని ఫోరెన్సిక్ పరీక్ష తేల్చింది. బీరేన్‌తో పాటు ఆయనను ఇంతకాలం వెనకేసుకొస్తున్న బీజేపీ పెద్దలకు కూడా ఈ పరిణామం పెద్ద ఎదురుదెబ్బ.

ట్రూత్‌ల్యాబ్స్ నివేదికను సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సుప్రీంకోర్టుకు సమర్పించినప్పుడు, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సెంట్రల్ ఫోరెన్సిక్ ల్యాబరేటరీలో పరీక్షలు జరగాలంటూ అభ్యంతరం వెలిబుచ్చడంతో తదుపరి విచారణ మార్చి 24కు వాయిదాపడింది. కుకీ హ్యూమన్ రైట్స్ సంస్థ దాఖలు చేసిన ఈ కేసు చంద్రచూడ్ కాలంనుంచీ సాగుతోంది. నవంబరు 14న జరిగిన విచారణలో సుప్రీంకోర్టు అనుమతించినమేరకే ఈ ప్రైవేట్ ఫోరెన్సిక్ ల్యాబరేటరీలో టేపుల పరీక్ష జరిగింది. అత్యంత సంక్లిష్టమైన కేసులను పరిష్కరించడానికి సీబీఐ, ఎన్ఐఏ ఇత్యాది కేంద్ర దర్యాప్తుసంస్థలు ఇదే ప్రైవేటు ఫోరెన్సిక్ సంస్థమీద ఆధారపడిన విషయం డబుల్ ఇంజన్ సర్కార్ తరఫున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్‌కు తెలియనిదేమీ కాదు. నిజనిర్ధారణ జరిగిన తరువాత ఇప్పుడు ఆయనకు అసలు ఈ కేసు విచారణ అర్హత సుప్రీంకోర్టుకు లేదని అనుమానం వచ్చింది. మణిపూర్ హైకోర్టుకు దీనిని బదలాయించాలన్న ఆయన విజ్ఞప్తి మీద తదుపరి విచారణలో నిర్ణయం తీసుకుంటామని ప్రస్తుత చీఫ్‌జస్టిస్ అంటున్నారు. కేసు స్వరాష్ట్రానికి తరలిపోయి, వ్యవహారం మళ్ళీ మొదటికి వచ్చినా రావచ్చు. న్యాయప్రక్రియ ఎలా సాగబోతున్నదో, సీల్డుకవర్‌లో సెంట్రల్ ఫోరెన్సిక్ ల్యాబరేటరీ సమర్పించబోతున్న నివేదికలో ఏ గుట్టు ఉంటుందో తెలియదు కానీ, నిజం ఇప్పటికే నిర్ధారణ అయిపోయింది. ముఖ్యమంత్రి కుర్చీలో ఉన్న మీతీ బీరేన్ రాజ్యాంగబద్ధంగా నడుచుకోలేదని, తన పదవీ ప్రమాణానికి పూర్తిభిన్నంగా వ్యవహరించారని దాదాపుగా తేలిపోయింది. మూలవాసులను తరిమేసి మణిపూర్‌ను మీతీల రాజ్యంగా మార్చేయాలన్న ఆయన లక్ష్యం మేరకే అగ్గిరాజుకుందన్నది వాస్తవం.

మణిపూర్ హింసాకాండపై విచారణకోసం హోంమంత్రిత్వశాఖ నియమించిన జుడీషియల్ కమిషన్‌కు 'కోహుర్' ఈ ఆడియోటేపులను తొలుత అందించింది. ఆ తరువాత నేరుగా సుప్రీంకోర్టుకు సమర్పించినందువల్ల ఈ మాత్రం కదలికైనా వచ్చింది. తరతమభేదాలు లేకుండా ప్రజలను రక్షిస్తానని రాజ్యాంగంమీద ప్రమాణం చేసిన ఓ ముఖ్యమంత్రి తద్భిన్నంగా తనవారిని ఉద్ధరించడానికి మిగతావారిని ఊచకోతకు గురిచేయడం దుర్మార్గం. 21 నెలలుగా మణిపూర్ మండిపోతూంటే, అందుకు కారకుడైన వ్యక్తిని ప్రధాని, హోంమంత్రి వెనకేసుకురావడం ఆశ్చర్యకరం. గ్రామాలకు గ్రామాలు తగలబడిపోతూ, ఊచకోతలు, అఘాయిత్యాలు యథేచ్ఛగా సాగిపోతున్న తరుణంలో నరేంద్రమోదీ స్వయంగా ఆ రాష్ట్రంలో పర్యటించి, అనుమానాలు, అవిశ్వాసాలతో నిలువుగా చీలి ఉన్న ఆ సమాజంలో శాంతినెలకొల్పే ప్రయత్నం చేస్తారని దేశం ఆశించింది. ఇది జరగకపోగా, మణిపూర్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా బీజేపీ అధినాయకులు విపక్షంమీద విరుచుకుపడుతూ వచ్చారు.

మీతీలు మినహా మణిపూర్‌లోని మిగతా అందరి నమ్మకాన్ని పూర్తిగా కోల్పోయిన బీరేన్‌సింగ్ అధికారంలో ఉన్నంతకాలం సమాజంలో సయోధ్య సాధ్యపడదని ఈ ఆడియోటేపులు తేల్చేశాయి. సంఖ్యాబలం ఉన్నప్పటికీ, ఆయనపట్ల పార్టీలో అసంతృప్తి తీవ్రంగా ఉన్నమాట వాస్తవం. ఆయన స్థానంలో కొత్తవ్యక్తిని కూచోబెడితేనే మద్దతు ఉంటుందని మిత్రపక్షాలు కూడా తేల్చేశాయి. ఆడియోటేపుల్లో గుట్టు రట్టయిన తరువాత కూడా బీరేన్‌ను తప్పించకపోతే పార్టీ పెద్దలకు మరింత అప్రదిష్ట తప్పదు.

కొత్త సీఈసీపై సుప్రీం నిర్ణయమేమిటి?

భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) తన విధులు రాజ్యాంగ నిష్ఠతో నిర్వహిస్తుందా? లేదు. అసంబద్ధంగా వ్యవహరిస్తూ అవహేళనకు గురవుతోంది. ఎంత బాధాకరం! అమిత ఆవేదనతో నేను ఈసీఐ పనితీరును ఆక్షేపిస్తున్నాను. ఎందుకు ఈ వ్యాకులత? ఒకప్పుడు ఈసీఐ కర్తవ్య పాలనను నిర్లజ్జగా అభిమానించేవాణ్ణి, గౌరవించేవాణ్ణి. నా వైఖరిని ఎవరు తప్పుపట్టినా లెక్కచేసేవాణ్ణి కాదు. భారతదేశ ఎన్నికల ప్రజాస్వామ్య ఆదర్శప్రాయ విజయాలను ప్రపంచానికి తెలియజేసేందుకు సమస్త దేశాల ఎన్నికల కమిషనర్ల సదస్సును నిర్వహించమని కూడా మన ఈసీఐకి నేను ఒకప్పుడు విజ్ఞప్తి చేశాను. నా సూచన ఈసీఐకి ఒక సామాన్య పౌరుని కితాబుగా భావించాను. అయ్యో! ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. మౌనంగా ఉండలేను. అలా ఉండడమంటే మన గొప్ప రాజ్యాంగ సంస్థ భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో నిర్వహించిన ఘనతర పాత్రను అగౌరవించడమే అవుతుంది. అంతకంటే ముఖ్యంగా మన ప్రజాస్వామ్య పురోగమనానికి ఎదురవుతున్న సవాళ్లు, సమస్యలను ఉపేక్షించడమే అవుతుంది.

రాజీవ్ కుమార్ (భారత ఎన్నికల సంఘం 25వ ప్రధానాధికారి – సీఈసీ) ఈ మాసాంతంలో పదవీ విరమణ చేయనున్న తరుణాన మన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థ ఒక కఠిన ప్రత్యామ్నాయాన్ని ఎదుర్కొంటున్నది: రాజ్యాంగ నిబద్ధత, లేదంటే రాజకీయ సంక్షోభం. మరింత స్పష్టంగా చెప్పాలంటే నిష్పాక్షికత, తటస్థత, పారదర్శకత ప్రస్ఫుటంగా ఉన్న న్యాయబద్ధమైన పద్ధతి ద్వారా కొత్త సీఈసీ ఎంపిక జరగాలి. లేనిపక్షంలో మనం ఒక ఎడతెగని రాజకీయ సంక్షోభంలో చిక్కుకోవడం అనివార్యమవుతుంది. మన ఇరుగు పొరుగు దేశాలలో వలే ఎన్నికల ఫలితాలు సదా వివాదాస్పదమవుతాయి ఇటువంటి పరిస్థితి మనకు మేలుచేస్తుందా? నిస్సందేహంగా సిగ్గుచేటు అవుతుంది.

ఈ శోచనీయ పరిస్థితికి రాజీవ్ కుమారే పూర్తిగా కారకుడు కాదు. ఒకప్పుడు తన విధ్యుక్త ధర్మాన్ని విలక్షణంగా నిర్వర్తించిన భారత ఎన్నికల సంఘం ప్రస్తుత అవనతికి ఆయన వ్యక్తిగతంగా బాధ్యుడు కానే కాదు. ఒక సుదీర్ఘ పతన క్రమం పరాకాష్ఠ దశలో ఆయన నిర్వాచన్ సదన్ (ఈసీఐ కార్యాలయం)కు సీఈసీగా వచ్చారు. తొలి నాలుగు దశాబ్దాల ప్రస్థానంలో ఈసీఐ ఏకసభ్య సంఘంగా ఉండేది. అయితే భారత ప్రభుత్వ విస్తరణ వ్యవస్థగా మాత్రమే వ్యవహరించేది. భారత రాజ్యాంగం తనకు సంక్రమింపచేసిన అధికారాలను చాలా చాలా అరుదుగా మాత్రమే వినియోగించింది. ఎన్నికలలో అక్రమాలపైన, అధికార భారత జాతీయ కాంగ్రెస్ పట్ల ఎన్నికల సిబ్బంది పక్షపాత వైఖరిపైన ఫిర్యాదులు వెల్లువెత్తుతూనే ఉండేవి. అయితే 1972లో పశ్చిమ బెంగాల్ శాసనసభా ఎన్నికలలో పెద్ద ఎత్తున చోటుచేసుకున్న అవకతవకల పైన, 1987 జమ్మూ–కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ స్వేచ్ఛగా, సక్రమంగా లేక పోవడంపైన ఆరోపణలు తీవ్ర స్థాయిలో వచ్చాయి. ఈ రెండు సందర్భాలలో మినహా మరెప్పుడూ ఎలాంటి వివాదాలు ఈసీఐకి చిక్కులు కల్పించలేదు. ఉపేక్షా భావంతో వాటిని అధిగమించగలిగింది. పాలనా పరంగా ప్రభుత్వానికి లోబడి ఈసీఐ వ్యవహరించింది. అయితే ఏనాడూ పాలకపక్షానికి లోబడి, దానికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోలేదు, వ్యవహరించలేదు.


akbar

ప్రస్తుత పరిస్థితుల్లో మరొక రాజీవ్ కుమార్ ఎన్నికల సంఘం ప్రధానాధికారి కావడం మన ప్రజాస్వామ్యానికి శ్రేయస్కరం కాదు. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని సర్వోన్నత న్యాయస్థానం తదుపరి సీఈసీని ప్రభుత్వ ప్రాబల్యమున్న కమిటీ నిర్ణయం ద్వారా నియమించేందుకు మోదీ సర్కార్‌ను అనుమతించడమో లేక గతంలో తాను జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం ఒక స్వతంత్ర ప్రక్రియ ద్వారా నియమించి తీరాలని నిర్దేశించడమో చేయాలి.

అప్పుడు తిరునెళ్లై నారాయణ అయ్యర్ శేషన్ (టిఎన్ శేషన్‌గా సుప్రసిద్ధుడు) రంగప్రవేశం చేశారు. భారత ఎన్నికల సంఘంకు ఆయన 10వ ప్రధానాధికారి (1990–96). ఎన్నికల సంఘంకు భారత రాజ్యాంగం కల్పించిన అధికారాలు అన్నిటినీ ఆయన సంపూర్ణంగా చెలాయించారు. శేషన్ ప్రజాస్వామ్యవాది కాదు. నిరంకుశుడు. జగడాలమారి. తెంపరితనంతో వ్యవహరించడం ఆయన స్వాభావిక లక్షణం. పాత ఆనవాయితీలకు స్వస్తి చెప్పారు. ఈసీఐలో భారీ సంస్కరణలు తెచ్చారు. ఎన్నికల సంఘానికి ఒక కొత్త గుర్తింపునిచ్చారు. కర్తవ్య పరాయణతలో కొత్త పుంతలు తొక్కారు. దేశ ప్రజలలో ఒక అపూర్వ ప్రజాస్వామిక చైతన్యాన్ని రగుల్కొలిపారు. అయితే రాజ్యాంగ అవధులు మీరుతున్నారా అన్న భావనకు కూడా శేషన్ ఆస్కారం కల్పించారు. సర్వోన్నత న్యాయస్థానం ఆక్షేపించింది. ఎన్నికల సంఘంలో మరో ఇద్దరు కమిషనర్‌లను నియమించాలని ఆదేశించింది. ఈ చర్యలతో శేషన్ దూకుడుకు కళ్లెం పడింది. ఆయన తెంపరితనాన్ని సంయమనపరిచింది. ఏతావాతా మేల్కొన్న సింహంలా భారత ఎన్నికల సంఘం నికార్సయిన స్వతంత్రతతో పనిచేయడం ప్రారంభించింది. ఈ చైతన్యశీలత 2004 వరకు కొనసాగింది. శేషన్ అనంతరం సీఈసీలు అయిన ఎమ్ఎస్ గిల్, జెఎమ్ లింగ్డోలు తమ పూర్వీకుని నాటకీయతలకు పోకుండా తమ విధ్యుక్త ధర్మాన్ని రాజ్యాంగ నిష్ఠతో నిర్వర్తించారు. ఈసీఐ స్వతంత్రతను నిలబెట్టారు. విధి నిర్వహణలో కచ్చితమైన తటస్థత పాటించారు. ఎన్నికల నిబంధనలను పాటించని రాజకీయవేత్తలను చట్టంతో జడిపించారు, అదుపు చేశారు. 2002 గుజరాత్ శాసనసభ ఎన్నికల సందర్భంగా ఇది బాగా ప్రస్ఫుటమయింది. ఈసీఐ చరిత్రలో శేషన్ నుంచి లింగ్డో హయాం దాకా స్వర్ణయుగం. ఈ కాలంలోనే అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పరాజయాల పాలు కావడం, సంకీర్ణ ప్రభుత్వాలు అధికారంలోకి రావడం అధికమయింది.

2004 నుంచి 2018 దాకా ఈసీఐ వివాదాలకు తావివ్వకుండా మామూలు రీతిలో ప్రస్థానించింది. శేషన్, ఆయన తరువాయి సీఈసీలు సాధించిన మార్పులను మరింత ముందుకు తీసుకువెళ్లి, ఎన్నికల క్రీడలో రాజకీయ ఆటగాళ్లు అందరికీ సమాన అవకాశాలు కల్పించడంపై పెద్దగా శ్రద్ధ పెట్టకుండా భద్రంగా వ్యవహరించింది. అయితే సరైన మార్గంలోనే సాగింది. ప్రస్తావిత కాలంలో సీఈసీలు పాలకులు, పాలకపక్షంతో ఘర్షణ పడకుండా వ్యవహరించారు. అయితే ఈసీఐ స్వతంత్రత ఒక ప్రమాణంగా స్థిరపడింది. స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరించడం ఒక అలవాటు అయింది. అయితే ఆనవాయితీలను పాటించడం మాటున విలువలు క్షీణ ముఖం పట్టడం ప్రారంభమయింది. రాజకీయ తటస్థతనుంచి ఈసీఐ పక్కదారులకు వెళ్లింది. క్షీణపతనాలు కనిపించక పోయినా ఆరంభమయ్యాయి.

డిసెంబర్ 2018లో సీఈసీగా సునీల్ అరోరా నియామకంతో, సంస్థాగత స్వతంత్రత కోల్పోయిన, రాజకీయ తటస్థతకు తిలోదకాలు ఇచ్చిన ప్రస్తుత దశలోకి సీఈసీ ప్రవేశించింది. ఆ తరువాత అశోక్ లావాసా, అరుణ్ గోయెల్ ఉదంతాలతో ఎన్నికల సంఘంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు ఏ మాత్రం ఆస్కారం లేనటువంటి పరిస్థితి నెలకొన్నది. ఈ శోచనీయ స్థితిని రాజీవ్ కుమార్ మరింత ముందుకు తీసుకువెళ్లారు. భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేయకపోవడం నుంచి పాలకులతో కుమ్మక్కయ్యే దశకు ఆయన చేరుకున్నారు! ప్రస్తుత సీఈసీ నిర్ణయాలు రాజ్యాంగ నిబద్ధతతో తీసుకున్నవేనా? నిశితంగా పరిశీలించడం అవశ్యం. ఈశాన్య భారత రాష్ట్రమైన అసోంలో పార్లమెంటరీ, శాసనసభా నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో ఆయన నిష్పాక్షికంగా ప్రవర్తించలేదు. పూర్తిగా భారతీయ జనతా పార్టీకి అనుకూలంగా వ్యవహరించారు. ఒక అరుదైన, వివాదాస్పద 'పోటీ రహిత' పార్లమెంటరీ ఎన్నికలను పర్యవేక్షించారు (గత సార్వత్రిక ఎన్నికలలో సూరత్ నియోజకవర్గంలో ఏమి జరిగిందో గుర్తు చేసుకోండి). తద్వారా ఆయన నేతృత్వంలో మన ఎన్నికల సంఘం అపారదర్శకతను కొత్త ఎత్తులకు తీసుకువెళ్లింది. ఎంత మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు, పోలయిన ఓట్లు, లెక్కించిన ఓట్ల సంఖ్య మధ్య అంతరం... సంబంధిత విషయాలపై సమాచారాన్ని సకాలంలో వెల్లడించలేదు. వెల్లడింపులో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేశారు.


■ యోగేంద్ర యాదవ్

మరింత ఘోరమైన విషయమేమిటంటే జమిలి ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాల పరిశీలనకు ఏర్పాటైన ఉన్నతస్థాయి కమిటీ ముందు లోక్‌సభకు, అన్ని శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీఐ తన సంసిద్ధత ఉద్ఘాటించింది. మరి మీ ఆధ్వర్యంలో ఉన్న ఈసీఐ, గత ఏడాది నాలుగు రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడంలో ఎందుకు విఫలమయింది రాజీవ్ కుమార్ గారూ? మొత్తం మీద రాజీవ్ కుమార్ నేతృత్వంలో ఈసీఐ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. లోక్‌నీతి-సిఎస్‌డిఎస్ సర్వేలు ఈ వాస్తవాన్ని ధ్రువీకరించాయి.

మరి భారత ఎన్నికల సంఘం పూర్తిగా దిగజారిపోయిందా? విచక్షణారహితంగా పాలకపక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తోందా? అదృష్టవశాత్తు అటువంటి దుర్దశ ఇంకా దాపురించలేదు. 2007–16 సంవత్సరాల మధ్య వ్లాదిమిర్ వై చురోవ్ సారథ్యంలో రష్యా కేంద్ర ఎన్నికల సంఘం దిగజారినస్థితికి మన ఎన్నికల సంఘం ఇంకా పతనమవలేదు. పుతిన్‌కు చురోవ్ బహిరంగంగా విధేయత ప్రదర్శించిన తీరులో మన సీఈసీ ఇంకా భారత ప్రధానమంత్రికి బహిరంగంగా తన విధేయతను చాటుకోలేదు. రష్యాలో వలే మన దేశంలో ప్రతిపక్షాలు, వాటి అభ్యర్థులను ఎన్నికలలో పోటీ చేసేందుకు అనర్హులుగా ప్రకటించడం జరగడం లేదు. పాకిస్థాన్‌లో వలే ఓట్ల లెక్కింపును నిలిపివేయడం జరగడం లేదు. ఫలితాలను తారుమారు చేయడం జరగడం లేదు. పాలక పక్షానికి అనుకూలంగా నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ ఒక మినహాయింపుగా మాత్రమే ఉందిగానీ ఒక సాధారణ ఆచరణ కాలేదు. ఎన్నికలలో మోసాలను ప్రజలు సహించరనే ఎరుక బాగా ఉన్నందున నిబంధనలను తప్పనిసరిగా పాటించడం ఎన్నికల అధికారులకు అనివార్యమవుతోంది.

మన ప్రజాస్వామ్యం ప్రస్తుతం అనేక సమస్యలతో సతమతమవుతోంది. ఈ పరిస్థితుల్లో మరొక రాజీవ్ కుమార్ ఎన్నికల సంఘం ప్రధానాధికారి కావడం శ్రేయస్కరం కాదు. అటువంటి సీఈసీతో మన ప్రజాస్వామ్యానికి ఎంత చేటు జరగాలో అంత చేటు సంభవిస్తుంది. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని సర్వోన్నత న్యాయస్థానం తదుపరి సీఈసీని ప్రభుత్వ ప్రాబల్యమున్న కమిటీ నిర్ణయం ద్వారా నియమించేందుకు మోదీ సర్కార్‌ను అనుమతించడమో లేక గతంలో తాను జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం ఒక స్వతంత్ర ప్రక్రియ ద్వారా నియమించి తీరాలని నిర్దేశించడమో చేయాలి. సుప్రీంకోర్టు నిర్ణయంపైనే మన రాజ్యాంగ బద్ధ ప్రజాస్వామ్యం భవిష్యత్తు ఆధారపడి ఉన్నది.


(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

హిందుత్వంపై కాంగ్రెస్‌కు ఎందుకంత ద్వేషం?

కౌరవవంశం వినాశనానికి ధృతరాష్ట్ర, దుర్యోధనులు కారణమన్నట్లు ప్రస్తుత కాంగ్రెస్ వినాశనానికి రాహుల్ గాంధీతోపాటు అతని సహచరులు కారణమవుతున్నారని అనిపిస్తోంది. రాహుల్, సోనియా మెప్పు పొందడానికా అన్నట్లుగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఇటీవల హిందూ వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు. గంగలో మునిగితే పేదరికం పోతుందా అని విమర్శించడం హిందువుల మనోభావాలను దెబ్బతీయడమే. ఇఫ్తార్ విందులిస్తే, పాస్టర్లూ మౌల్వీలకు జీతాలు ఇస్తే పేదరికం పోతుందా అని మల్లికార్జున ఖర్గే ఎందుకు ప్రశ్నించలేదు? ఇదేనా కాంగ్రెస్ చెప్పే సెక్యులరిజం?

దేశంలో మెజారిటీ ప్రజలైన హిందువులు ఒకటవుతున్న తరుణంలో కూడా రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ హిందూ వ్యతిరేకమైన విధానాలు అనుసరిస్తున్నారు. హిందుత్వం గురించి మాట్లాడేవారంతా హింసను ప్రేరేపిస్తారని, ఈ హిందుత్వవాదులందరినీ తరిమికొట్టాలని, ఆరెస్సెస్ బీజేపీలను వ్యతిరేకించాలని చెబుతూ మైనార్టీల పేరుతో ముస్లింలను వెనకేసుకు వస్తున్నారు రాహుల్‌గాంధీ. కాంగ్రెస్ పార్టీ ఆది నుంచి ముస్లిం సంతుష్టీకరణ విధానాలే అనుసరిస్తున్నా రాహుల్‌గాంధీ, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ లాగా ఎప్పుడూ మాత్రం బహిరంగంగా హిందుత్వాన్ని వ్యతిరేకించలేదు, దూషించలేదు. అందుకే ఇంతకాలం దాకా ఆ పార్టీ బతికి బట్టకట్టకలిగింది.

ఇటీవల రాహుల్‌గాంధీ తమ పార్టీ ఆరెస్సెస్-బీజేపీలతోపాటు భారత రాజ్య వ్యవస్థతో పోరాడుతున్నాం అన్నారు. ఇది చాలా తీవ్రమైన విషయం. ఒక రాజకీయ పార్టీగా ఇతర పార్టీలతో, సంస్థలతో పోరాడటంలో తప్పు లేదు కానీ ఏకంగా రాజ్యవ్యవస్థతోనే పోరాడుతామనడం క్షమార్హం కాని నేరం. ఏ ఉద్దేశంతో ఆయన ఆ మాటలన్నారో కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ వివరణ ఇవ్వలేదు.



దేశంలో మెజారిటీ ప్రజలైన హిందువులు ఒకటవుతున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ హిందూ వ్యతిరేక విధానాలు అనుసరిస్తోంది. హిందుత్వం గురించి మాట్లాడేవారంతా హింసను ప్రేరేపిస్తారని, ఆరెస్సెస్ బీజేపీలను వ్యతిరేకించాలని చెబుతూ ముస్లింలను వెనకేసుకువస్తున్నారు రాహుల్‌గాంధీ.

గతంలో కూడా పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులపై భారత సైనికులు ప్రాణాలకు తెగించి సర్జికల్ స్ట్రయిక్స్, ఎయిర్ స్ట్రయిక్స్ లాంటివి చేస్తే రాహుల్‌గాంధీ 'వీటికి సాక్ష్యాలున్నాయా? వీడియోలు, ఫోటోలు తీశారా?' అని ప్రశ్నించడంతో అంతవరకు ఈ స్ట్రయిక్స్‌తో బిక్కచచ్చిపోయిన పాకిస్థాన్‌కు బలం చేకూర్చినట్లయింది. రాహుల్‌గాంధీ వేసిన ప్రశ్నలనే వేసి పాకిస్థాన్ మన సైనికుల మనోధైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేసింది. అలాగే ఒకవైపు మన సైనికులు భారత సరిహద్దుల్లో డోక్లాం రక్షణ కోసం చైనాతో పోరాడుతుంటే చైనా రాయబారితో రాహుల్ రహస్యంగా సమావేశం కావడమేంటి? అంతేగాక భారత్‌కు బద్ధ వ్యతిరేకిగా భావించే జార్జ్ సోరెస్ లాంటి వారితో స్నేహం చేయడం, విదేశాలకు వెళ్లినప్పుడల్లా భారత వ్యతిరేక వ్యాఖ్యలు చేయడం, భారత వ్యతిరేకులతో సమావేశమవడం ఎంతవరకు సమంజసం? భారత్ జోడో యాత్రలో కూడా పలువురు దేశ వ్యతిరేకులు, తీవ్రవాద గ్రూపుల నాయకులు పాల్గొనడం కూడా తీవ్ర విమర్శలకు దారి తీసింది. ముఖ్యంగా మణిపూర్‌కు చెందిన ఒక తీవ్రవాద గ్రూపు నాయకుడు భారత్ జోడో యాత్రలో పాల్గొన్న చిత్రాలు మీడియాలో చక్కర్లు కొట్టాయి.

సెక్యులరిజం ముసుగులో హిందువులను అణచివేసే ప్రయత్నం జరుగుతోంది. హిందువులంతా ఏకం కాకుండా కాంగ్రెస్ పార్టీ ఎత్తుకున్న కొత్త అస్త్రం కుల గణన. రాహుల్‌గాంధీ ఇటీవల తామే రాజ్యాంగ పరిరక్షకులమంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవానికి అదే రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన నిర్ణయాలు కోకొల్లలు. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం జారీ చేసిన జీవో కాపీలను స్వయంగా రాహుల్‌గాంధీ మీడియా ముందే చించేయడం ఎలా రాజ్యాంగ పరిరక్షణ అవుతుంది? ఎన్నోసార్లు రాష్ట్రాలలోని ప్రభుత్వాలను ఉన్నపళంగా తీసేయడం ఎంతవరకు సమంజసం?

దేశంలోని హిందువులంతా చిరస్మరణీయంగా గుర్తుంచుకునే అయోధ్య రామమందిర నిర్మాణం, ప్రారంభోత్సవాన్ని కూడా రాజకీయాలతో ముడిపెట్టింది కాంగ్రెస్ పార్టీ. అయోధ్యలో రామమందిర నిర్మాణానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ న్యాయవాదులు వాదించినా సుప్రీం తీర్పుతో భవ్య మందిరాన్ని హిందువులు తమ స్వంత ఖర్చులతో నిర్మించుకుంటే కూడా సహించలేదు కాంగ్రెస్ పార్టీ. ఆ మందిర ప్రారంభోత్సవానికి అందిన ఆహ్వానాన్ని సోనియా, రాహుల్‌గాంధీలు తిరస్కరించడమే కాకుండా కాంగ్రెస్ నాయకులు ఎవరు అయోధ్య వెళ్లకూడదంటూ నిషేధం విధించడంతో స్వాభిమానమున్న కాంగ్రెస్ నాయకులు ఎందరో పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి మందిర ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. కొందరు రాజీనామా కూడా చేశారు. ఇలా అడుగడుగునా హిందుత్వ, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీని జాతీయవాదులు, హిందువులు ఎలా సమర్థిస్తూ ఓట్లు వేస్తారు? ఎన్నికలప్పుడు మాత్రమే హిందువుల మాదిరిగా రాహుల్, ప్రియాంకగాంధీలు గుళ్ళు గోపురాలకు దండాలు పెడితే గ్రహించలేనంత అమాయకులా ప్రజలు? ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ తన తప్పులను తెలుసుకొని మసలుకోకపోతే కౌరవవంశంలాగానే కాలగర్భంలో కలిసిపోకతప్పదు.

• శ్యామ్‌సుందర్ వరయోగి

విరసం సాహిత్య పాఠశాల!

ఇటీవలే మనకు దూరమైన ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా తన జీవితంతో, మరణంతో రగిలించిన ఉత్తేజమూ, సమాజంపైకి సంధించిన చురుకైన ప్రశ్నలూ ఒక కొత్త సందర్భాన్ని మన ముందుకు తీసుకొచ్చాయి. సంకెళ్లలోనే స్వేచ్ఛాగానం చేయడం, చీకటిలో వెలుగును కలగనడం, అణచివేస్తే విముక్తిని ప్రకటించుకోవడం, అంతిమంగా మృత్యువులో కూడా చావును నిరాకరించడం అనేవి ఇంకెంత మాత్రం రొమాంటిక్ వ్యక్తీకరణలు కావని ఆయన నిరూపించారు.

సాయిబాబా సందర్భంలో సాహిత్యకారుల పాత్ర గురించి మాట్లాడుకోవడమంటే ఇదేదో విప్లవ సాహిత్యోద్యమం సొంత గొడవ వెళ్లబోసుకోవడం కాదు. సాహిత్యం నిర్వహించే పాత్రను, సాహిత్యకారుల సామాజిక ఆచరణను మరోసారి మాట్లాడుకోవడమే. ఫాసిజం సాహిత్య కళా మేధో రంగాల ముందుకు తీసుకొచ్చిన అనేక సంక్లిష్ట సవాళ్లను చూడాలి. ఫాసిస్టు వ్యతిరేక పోరాటాన్ని ముందుకు తీసుకుపోవడానికి వాటితో సవ్యంగా వ్యవహరించాలి.

సమస్త కళా సాహిత్యాల ప్రాథమిక షరతు మనుషుల్నీ, సమాజాన్నీ సెన్సిటైజ్ చేయడమే. దానితో పాటు రచయితలు, బుద్ధిజీవులు వ్యక్తులుగా, ఒక సమూహంగా ప్రజా జీవితంలో ఎక్కడ నిలబడతారు? తమ విలువలతో, ఆచరణతో సంక్షుభిత సమాజంలో ఏ వైఖరులు తీసుకుంటారు? అనేవి అంతకంటే ముఖ్యం. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజం బలపడుతున్న ఈ సంక్షోభ కాలంలో రచయితలు, కళాకారులు, బుద్ధిజీవులు తమ సామాజిక, రాజకీయ ఆచరణను తాజాగా పునర్నిర్వచించుకోవాలి. రాజకీయార్థిక, సాంస్కృతిక, సైనిక, నైతిక తలాల్లో కార్పొరేట్ల కోసం, హిందుత్వ రాష్ట్ర కోసం ఫాసిస్టులు చేస్తున్న విధ్వంసానికి వ్యతిరేకంగా సాహిత్య కళా మేధో రంగాల నుంచి ప్రజలను కూడగట్టవలసి ఉన్నది. ముఖ్యంగా మెజారిటీ మత ప్రజలపై ఫాసిస్టు భావజాల ప్రభావం తీవ్రమవుతున్న సమయంలో గెలుచుకోవాల్సిన ప్రజా సమూహాలు పెరిగిపోతున్నాయి. హేతుబద్ధ వాదనతో గతాన్ని సరికొత్తగా చూసి, ప్రగతిదాయకమైన భవిష్యత్తు మీద ఆశ పెంచవలసి ఉన్నది. దీనికి రచన, పరిశోధన అనే ముఖ్యమైన ఆచరణ రూపాలతోపాటు రాజకీయ, సామాజిక ఆచరణను రచయితలు నిర్భీతిగా, మరింత నిబద్ధతతో ఎంచుకోవాల్సి ఉన్నది. రచన వ్యక్తిగత అనుభవాలను దాటి సంక్షుభిత సామాజిక అనుభవంలోకి, గతాన్ని అధిగమించి భవిష్యత్ దార్శనికతలోకి, సకల మానవ ఉద్వేగాల సారమైన చారిత్రక వాస్తవికతలోకి చేరుకోడానికి రచయితలు, బుద్ధిజీవులు వీలైనన్ని ఆచరణ రూపాలను ఎన్నుకోవలసి ఉన్నది. సామాజిక చైతన్య ప్రతిఫలనంగానేగాక ఈ సంక్షోభ మూలాలను ఎత్తిచూపుతూ, పరిష్కారానికి ఉన్న అవకాశాలను సాహిత్యంలోకి తీసుకరావాలి. రచన చేయడంతో పాటు సమాజాన్ని కాపు కాయాల్సిన బాధ్యత సాహిత్యకారులదే.

ఫాదర్ స్టాన్‌స్వామి, నర్మద, ప్రొ. సాయిబాబ ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో అద్భుతమైన నమూనాలను అందించి వెళ్లిపోయారు. ఇంకా వేల మంది ప్రజలు హిందుత్వ ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో ప్రాణత్యాగాలు చేశారు. జైళ్లలో మగ్గుతున్నారు. అక్రమ కేసులను ఎదుర్కొంటున్నారు. ఫాసిస్టు వ్యతిరేకంగా రచన, ప్రసంగం, ప్రచురణ, ప్రచారం చేసి ఎందరో నిత్యం బెదిరింపులను అనుభవిస్తున్నారు. ఈ ఫాసిస్టు అణచివేతకు, దోపిడీకి, కుట్రలకు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తెలుగు సాహిత్య, మేధోరంగాలను మరింత సమాయత్తం చేయమని, మిలిటెన్సీ పెంచమని సాయిబాబ స్ఫూర్తి మనందరినీ ప్రేరేపిస్తున్నది. అందులో భాగంగానే విరసం నిర్వహిస్తున్న సాహిత్య పాఠశాల ఫిబ్రవరి 8, 9 తేదీల్లో కర్నూలులో జరుగుతున్నది.

– అరసవిల్లి కృష్ణ

వారిని కాదనుకుంటే కష్టమే!

కల్తీ లేని పాలు కావాలనుకునేవాళ్లు గేదెలను పెంచేవారి నుంచి నేరుగా కొంటూ ఉంటారు. అమెరికాలోనూ గేదెలను పెంచే డెయిరీ ఫార్మ్ వద్దకు వెళ్లి తెచ్చుకోవచ్చు. ఇక్కడ మొన్నమొన్నటిదాకా ఒక గ్యాలను (మూడున్నర లీటర్లకంటె కాస్త ఎక్కువ) పాల ధర 8–9 డాలర్లు ఉండేది. తరువాత, అది 15 డాలర్లు అయింది. మరువారానికి 18 డాలర్లకు చేరుకుంది. హఠాత్తుగా ధర రెట్టింపు అయిందేమిటని కుతూహలం కొద్దీ అతడిని అడిగాను. 'ఇప్పుడు వాళ్లు పనికి రావడం లేదు. స్థానికులతోనే చేయించాల్సి వస్తోంది' అన్నాడు. 'వాళ్లు' అంటే– ట్రంప్ ప్రభుత్వం ఎవరినైతే 'డిపోర్ట్' చేసేస్తున్నదో వాళ్లన్నమాట. 'స్థానికులు' అంటే అమెరికన్లే!. అక్రమ వలసదారులందరినీ 'డిపోర్ట్' చేయడం.. అమెరికాను ఖాళీ చేయించడం అనే మాటలు ఆకర్షణీయంగా కనిపించవచ్చు. కానీ, ఆ నిర్ణయం పర్యవసానాలు అమెరికాలోని ప్రజాజీవితం మీద భవిష్యత్తులో ఎలాంటి ప్రభావం చూపిస్తాయో అర్థం చేసుకోవడానికి ఇది చిన్న ఉదాహరణ.

'అక్రమ వలసదారులు' అనే పదం ద్వారా వారి గురించి దురభిప్రాయాన్ని సృష్టించడం చాలా సులువు. కానీ అమెరికన్ శ్రామిక వ్యవస్థలో అట్టడుగు స్థాయిలో ఉన్న వీరిని ఆ స్థానంనుంచి తొలగించడమంటే ఏకంగా ఆ వ్యవస్థను కుప్పకూల్చేయడమే. ఇందుకు అమెరికా అనేక రకాల విపరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది. ఉత్పాదనల ధరలు అమాంతం పెరిగి, అంతిమంగా అమెరికన్లలో అసహనానికి దారితీయవచ్చు. అమెరికాలో చిన్నచిన్న ఉద్యోగాల్లో ఇలాంటివారే ఉంటారు. కెనడా, మెక్సికో తదితర ప్రాంతాల నుంచి పొట్టకూటి కోసం సరిహద్దు దాటి పెద్దసంఖ్యలో వచ్చేస్తుంటారు. ఆ రెండు దేశాలు మాత్రమే కాదు. మెక్సికోలోకి సులువుగా ప్రవేశించగల భూమార్గాలు ఉన్న గ్వాటిమాలా, ఎల్ సాల్వడార్ తదితర దక్షిణ అమెరికా దేశాలకు చెందినవారు కూడా తొలుత మెక్సికోలోకి, తర్వాత మంచి అవకాశం చూసుకుని అమెరికాలోకి నడుచుకుంటూ వచ్చేస్తుంటారు. ఈ అక్రమ వలసదారులనే కేటగిరీలో భారతీయులు కూడా అత్యధికంగానే ఉన్నారు. పంజాబ్, గుజరాత్‌లకు చెందిన అనేకమంది తొలుత మెక్సికోకు వెళ్లి అక్కడి నుంచి అమెరికాలోకి వస్తారు. తర్వాతి స్థానం తెలుగువారిదే. తనిఖీల కన్నుగప్పగల తెలివితేటలు, చాకచక్యం ఉన్నవారు నేరుగా వచ్చేయగలరు. మెక్సికోలో సరిహద్దు దాటించి అమెరికాలోకి పంపడానికి కొన్ని ముఠాలు కూడా పనిచేస్తుంటాయి.

వీళ్లందరూ పొట్ట చేతబట్టుకుని కడుపుకూటి కోసం తరలివచ్చేవాళ్లు. పిల్లాపాపలతో వందల కిలోమీటర్లు వచ్చేస్తారు. బెదిరించిన వారికి తృణమో పణమో సమర్పించుకుని వస్తారు, గుట్టుచప్పుడు కాని బతుకులే బతుకుతూ ఉంటారు. వ్యవసాయ పనుల్లో, డెయిరీ ఫార్మ్‌లలో, భవన నిర్మాణ కార్మికులుగా, ఆతిథ్య, సేవారంగాల్లో అతి తక్కువ కూలికి వీరు పనిచేస్తుంటారు. ల్యాండ్ స్కేపింగ్, రవాణా, వేర్ హౌసింగ్, చైల్డ్ కేర్, ఇంటి పనులు వంటి వాటిల్లో కూడా వీరి సేవలు అధికం. ఈ రంగాలన్నీ మానవ వనరులు విస్తృతంగా అవసరమయ్యేవి.

భారతీయ విద్యార్థులను తక్షణం వెనక్కు పంపాలనేంత దుర్మార్గమైన పోకడలు ప్రస్తుతానికైతే ఇక్కడ ఏమీ కనిపించడం లేదు. అక్రమంగా ఉంటున్నవారి మీదనే ఐస్ (ఐసీఈ– ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్) దృష్టి ఉంటోంది. అమెరికా నుంచి అక్రమ వలసదారుల్ని డీపోర్ట్ చేయడం ఇప్పుడు కొత్తగా జరుగుతున్నదేమీ కాదు. ఐస్ నిరంతరాయంగా అదే పనిమీద ఉంటుంది. కాకపోతే, ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కొంచెం ఉధృతంగా జరుగుతోంది.



srini

ఇవి తరచూ కూలీల కొరతతో ఇబ్బంది పడుతుంటాయి. ఈ రంగాలు స్థిరంగా కొనసాగడంలో ఈ అన్ డాక్యుమెంటెడ్ లాటినో వర్కర్స్‌గా పరిగణనలో ఉండేవారి భాగస్వామ్యమే ఎక్కువ.

దాదాపు 90 శాతం హోటళ్లలో, ఇతరత్రా తక్కువ వేతనాలు ఇవ్వజూపే వృత్తుల్లో వీరే ఉంటారు. గంటల వంతున చెల్లించే వేతనాలను తక్కువ మొత్తాల్లో ఇస్తూ, వీరి నుంచి నాణ్యమైన పనిని పొందడం ఆయా వ్యాపారాల యజమానులకు సాధ్యమవుతుంది. వేతనాలకు సంబంధించి వారి నుంచి అతిగా డిమాండ్లు ఉండవు. అలాగే ఒళ్ళు దాచుకోకుండా శ్రద్ధగా పనిచేస్తారని పేరుంది. అలాగే అన్ని రకాల చిల్లర పనులు చేస్తూ, నిత్యం అందుబాటులో ఉండే వారిని అమెరికాలో 'హ్యాండీ మెన్' అని వ్యవహరిస్తారు. వీరు ఎలక్ట్రికల్, ప్లంబింగ్, గార్డెనింగ్, క్లీనింగ్ తదితర సకల డొమెస్టిక్ పనులకు గంటల వారీ వేతనానికి అందుబాటులో ఉంటారు. ఈ హ్యాండీ మెన్‌లుగా పనులు చేసేవాళ్లలో అత్యధికులు ఈ వర్గానికి చెందినవారే. వారిని దేశం నుంచి పూర్తిగా తుడిచిపెట్టడం అంటూ జరిగితే అమెరికాలో చిరువ్యాపారాలు, వ్యవసాయ రంగాల రూపురేఖలు మారిపోతాయి. వారి స్థానంలో అమెరికన్లనే నియమించుకోవాల్సి వస్తే, ప్రతి పనికీ ఆ వ్యాపార యజమాని గతంలో ఇస్తున్న వేతనం కంటే కనీసం రెట్టింపు చెల్లించాల్సి వస్తుంది. దీని ప్రభావం ఉత్పత్తుల ధరల మీద పడుతుంది. అంతిమంగా నష్టం జరిగేది అమెరికన్ పౌరులకే. అమెరికాలోని సెంటర్ ఫర్ అమెరికన్ ప్రోగ్రెస్ ఎస్టిమేట్స్ వారి నివేదిక ప్రకారం ఈ ఇమిగ్రెంట్స్ అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఏటా వందల బిలియన్ల డాలర్ల ఆదాయం సమకూరుస్తుంటారు. వారు చెల్లించే వివిధ రకాల పన్నులే కాదు, వీరిలో కొందరు సొంతంగా చిరువ్యాపారాలు కూడా ప్రారంభించి ఆర్థిక వృద్ధిలో భాగం అవుతుంటారు.

నేరచరిత్ర ఉన్నవారిని వెనక్కు పంపడాన్ని ఎవ్వరూ కాదనరు. కానీ స్వస్థలాలను, సొంత మనుషుల్ని వదులుకుని.. ఇక్కడ బతుకు తెరువు కోసం వచ్చిన అందరిమీద సమానంగా కక్ష కట్టడం విజ్ఞత కాదు. డెమొక్రాట్ల నుంచి మాత్రమే కాకుండా.. వీరి సేవలను వాడుకుంటున్న చిరు వ్యాపారులు, వ్యవసాయదారులు, పారిశ్రామికవేత్తలు, ఉత్పాదక వర్గాల నుంచి కూడా ట్రంప్ నిర్ణయం పట్ల వ్యతిరేకత వెల్లువెత్తే అవకాశం ఉంది. ట్రంప్, విశాల దృక్పథంతో అమెరికన్ల జీవితాలపై పడే భారాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని, తన నిర్ణయాలను సమీక్షించుకోవాలి.

డీపోర్టేషన్ జరుగుతున్న సమయంలో భారత్‌లో తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేసే అనేక అర్థంపర్థంలేని సోషల్ మీడియా ప్రచారాలు వెల్లువెత్తుతున్నాయి. భారతీయ విద్యార్థులను తక్షణం వెనక్కు పంపాలనేంత దుర్మార్గమైన పోకడలు ప్రస్తుతానికైతే ఇక్కడ ఏమీ కనిపించడం లేదు. అక్రమంగా ఉంటున్నవారి మీదనే ఐస్ (ఐసీఈ– ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్) దృష్టి ఉంటోంది. అమెరికా నుంచి అక్రమ వలసదారుల్ని డీపోర్ట్ చేయడం ఇప్పుడు కొత్తగా జరుగుతున్నదేమీ కాదు. ఐస్ నిరంతరాయంగా అదే పనిమీద ఉంటుంది. కాకపోతే, ఇప్పుడు ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కొంచెం ఉధృతంగా జరుగుతోంది.

■ కృష్ణమోహన్ దాసరి
జర్నలిస్ట్, డల్లాస్



నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

ప్లాస్టిక్ కట్టడి జరిగేనా?

వరంగల్ నగరంలో యథేచ్ఛగా విక్రయాలు





వరంగల్ నగరంలో ప్లాస్టిక్ విక్రయ షాపులను తనిఖీ చేసి జరిమానా విధిస్తున్న బల్దియా అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల వినియోగం విచ్చలవిడిగా పెరిగిపోతోంది. గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో ప్రతీ రోజు 450టన్నుల చెత్త సేకరణలో సగానికంటే ఎక్కువ ప్లాస్టిక్ వస్తువులే లభిస్తున్నాయి. ప్లాస్టిక్ వాడకం ద్వారా చాలా ఆరోగ్యపరమైన సమస్యలు వస్తున్నాయని ప్రజలకు తెలినప్పటికీ అనివార్యంగా ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్‌తో తయారు చేసిన వస్తువులను వాడుతున్నారు. తద్వారా ప్రజలు క్యాన్సర్‌తో పాటు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

బల్దియా పరిధిలో హనుమకొండ, వరంగల్, కాజీపేటలో వందకుపైగా హోల్‌సేల్ ప్లాస్టిక్ విక్రయషాపులు ఉన్నాయి. వీరు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 120 మైక్రాన్స్ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను మాత్రమే విక్రయించాలి. కానీ నగరంలో కొందరు వ్యాపారులు 120 మైక్రాన్స్ మందం ఉన్నట్టు నకిలీ ముద్రను వేసి మరీ కవర్లు యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. ఇంకా కొందరు బల్దియా అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలతో ప్లాస్టిక్ విక్రయాలు జరుగుతున్నట్టు తెలిసింది. ఇలా ప్రతీ రోజూ వరంగల్ నగరం నుంచి 200 టన్నుల ప్లాస్టిక్ విక్రయాలు జరుగుతున్నా.. అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు విమర్శలు వస్తున్నాయి.

పట్టించుకోని అధికారులు

వరంగల్ పిన్నవారి వీధి, బట్టల బజార్, హనుమకొండలో టైలర్‌స్ట్రీట్, బస్‌డిపో, కేయూ రోడ్డు, కమార్‌పల్లి, కాజీపేటతో బాపూజీనగర్, సోమిడి రోడ్డులో ఉన్న హోల్‌సేల్ షాపులలో పెద్దమొత్తంలో ప్లాస్టిక్ విక్రయాలు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి గ్రామీణ ప్రాంతాలతో పాటు బార్లు, రెస్టారెంట్లు, మటన్ షాపులు, చికెన్ షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కూరగాయల విక్రయ వ్యాపారులకు, కిరాణ షాపులకు సప్లయి అవుతున్నాయి. అడ్డగోలు దందా జరుగుతున్నా.. ఏ అధికారి కన్నెత్తి చూడక పోవడంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వరంగల్‌లో పిన్నవారి స్ట్రీట్‌లో ఓ షాపు యజమాని, హనుమకొండలో బోరింగ్ ఆఫీస్ వద్ద ఉన్న షాపు యజమాని, కాజీపేటలో ఓ వ్యక్తి ముగ్గురు ప్రతీనెల ప్లాస్టిక్ షాపుల నుంచి డబ్బులు వసూలు చేసి బల్దియా అధికారులకు మామూళ్లు ఇస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. సింగిల్ యూజ్ బ్యాగులు వాడాలని సిబ్బంది అవగాహన కల్పించకపోవడంతో ప్లాస్టిక్ వాడకం విచ్చల విడిగా మారింది.



బల్దియా పరిధిలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ నియంత్రణ వాహనాలు

- విచ్చలవిడిగా వినియోగంతో పెరుగుతున్న రోగాలు
- నియంత్రించడంలో బల్దియా అధికారుల నిర్లక్ష్యం
- గతంలో నియమించిన ప్రత్యేక బృందాలు విఫలం
- మామూళ్ల మత్తులో బాధ్యత మరిచిన సిబ్బంది
- మళ్లీ రెండు బృందాలను ఏర్పాటు చేసిన కమిషనర్
- ఈ సారైనా నియంత్రణ సాధ్యమయ్యేనా? అని అనుమానాలు

అడ్డదారులు

వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు ఐదేళ్ల కిందట ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. 16 మంది ప్రభుత్వ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించి వరంగల్ ట్రైసిటీస్‌లో తనిఖీలు చేసేవారు. ప్లాస్టిక్ వాడకంపై ఉక్కుపాదం మోపారు. దీంతో అప్పట్లో కొంత మేరకు నియంత్రణ జరిగింది. అయితే అప్పటి ఉన్నతాధికారులు, కింద స్థాయి సిబ్బంది బదిలీలు కావడంతో బృందాల్లో పని చేసే సిబ్బందికి అవకాశంగా మారింది. ఇదే అదునుగా భావించి ప్లాస్టిక్ విక్రయాలు జరిగే షాపులను గుర్తించి సాయంత్రం సమయంలో వెళ్లి బెదిరింపులకు పాల్పడేవారు. అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే జరిమానా వేస్తామని, లేదటే షాపులు సీజ్ చేస్తామని హెచ్చరించేవారు. దీంతో నిర్వాహకులు ఎంతో కొంత ముట్టజెప్పేవారు. కొందరికి డబ్బులు, మరి కొందరికి సెల్‌ఫోన్లు, ఇంకొందరికి బహుమతుల రూపంలో ఇచ్చేవారు. వీరి ఆకృత్యాలు విఅతిమీరడంతో రెండేళ్ల కిందట నిషేధించారు. అప్పటి నుంచి శానిటేషన్ విభాగం అధికారులు ప్లాస్టిక్ వస్తువులను విస్మరించారు. ఆయా ప్రాంతాల శానిటరీ ఇన్‌స్పెక్టర్ల కనుసన్నల్లో జవాన్లు ప్లాస్టిక్ హోల్‌సేల్, రిటైల్ షాపుల నుంచి అడ్డగోలు వసూళ్లకు పాల్పడ్డట్టు ప్రచారం జరిగింది.

ప్రత్యేక బృందాలు

ప్లాస్టిక్ వినియోగం యథేచ్ఛగా పెరిగిపోతున్న నేపథ్యంలో బల్దియా కమిషనర్ వెంటనే తిరిగి ప్లాస్టిక్ నియంత్రణ బృందాలను పునరుద్ధరించాలని సీఎంహెచ్‌వోకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఈనెల 1వ తేదీ నుంచి రెండు ప్లాస్టిక్ నియంత్రణ బృందాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వరంగల్, హనుమకొండలో 10 మందితో కూడిన రెండు ప్లాస్టిక్ నియంత్రణ బృందాలు పర్యటిస్తున్నాయి. 8 మంది బల్దియా సిబ్బంది, ఇద్దరు డ్రైవర్లు, రెండు వాహనాలు అప్పగించారు. ఈ రెండు బృందాలు ప్లాస్టిక్ విక్రయాల షాపులను తనిఖీ చేస్తూ నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు
బల్దియా సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి

బల్దియా పరిధిలో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు విక్రయిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయి. గతంలో చాలామంది వ్యాపారులను గుర్తించి జరిమానాలు విధించాం. ఇప్పటి వరకు కొన్ని చోట్ల ఫిర్యాదులు రావడంతో కొత్తగా రెండు బృందాలను ఏర్పాటు చేశాం. ఇకపై ప్లాస్టిక్ నియంత్రపై కఠినంగా వ్యవహరిస్తాం. నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు పెడతాం.

వైద్య కళాశాలలో మెరుగైన వసతులు కల్పించాలి

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ సత్యశారద

నర్సంపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని అధికారులను జిల్లా కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రి, వైద్య కళాశాలను గురువారం కలెక్టర్ సందర్శించారు. ఆస్పత్రి ఆవరణతో పాటు కళాశాల లెక్చర్ హాల్, హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి చెందిన అంశాలు తన దృష్టికి వచ్చాయని, మునిసిపల్ అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆస్పత్రిలో ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ఆపరేషన్ థియేటర్ ఏర్పాటుచేసి రోగులకు సేవలు అందించేందుకు చర్యలు చేపడుతామన్నారు. అధికారులు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. కేంద్రంలో నిర్వహిస్తున్న రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిని వైద్య కళాశాల నియంత్రణలోకి తెస్తూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఇటీవల ఉత్తర్వులను జారీ చేసిందని, వైద్య కళాశాలలో పూర్తిస్థాయిలో చేయాల్సిన ఏర్పాట్లపై త్వరలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, ప్రొఫెసర్ రమేశ్ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంజీఎంలో అధికారిపై విచారణ

- 'పెద్దాస్పత్రిలో ఇష్టారాజ్యం'పై స్పందించిన డీఎంఈ
- ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీ.. నేడు ఎంక్వైరీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రిలో ఓ పరిపాలన అధికారి తీరుపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. 'పెద్దాస్పత్రిలో ఇష్టారాజ్యం' పేరిట గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమించింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు లేఖ నెంబర్ 38/ఎస్‌పీఎల్/డీఎంఈ/ 2025 ఫిబ్రవరి 6న విడుదల చేసింది. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై విచారణ జరుపాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్, అడిషనల్ డీఎంఈ డాక్టర్ డి.మోహన్‌దాస్ కమిటీకి చైర్మన్‌గా, జనగామ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గోపాల్‌రావు, జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ అసిస్టెంట్ డైరెక్టర్ బాలాజీలను సభ్యులుగా నియమించారు. శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు కమిటీ నివేదికను డీఎంఈకి అందజేయాలని ఆదేశించారు. అదే రోజు నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని ఉత్తర్వులో పేర్కొన్నారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా పత్రికా కథనంపై ప్రభుత్వం వెంటనే స్పందించి, అదే రోజు నివేదిక ఇవ్వాలని ఆదేశించడంపై బాధిత ఉద్యోగులు, రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం ఎంజీఎంలో చర్చనీయాంశమైంది.

కొత్త రుణాలు మంజూరు చేయండి..

- లక్ష్యాల సాధనలో విఫలమైతే కఠిన చర్యలు
- రుణాల రికవరీ వంద శాతం జరగాలి
- బ్యాంక్ మేనేజర్ల సమావేశంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ పొందిన రైతులకు వెంటనే కొత్త రుణాలు అందచేయాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు డీసీసీ బ్యాంకు మేనేజర్లను ఆదేశించారు. గురువారం హనుమకొండ నక్కల గుట్టలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బ్యాంకు మేనేజర్ల సమావేశంలో జరిగింది. ఈ సందర్భంగా రవీందర్‌రావు మేనేజర్లకు పలు అంశాలపై నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రుణమాఫీ అర్హత గల రైతుల్లో ఇంకా సాంకేతిక సమస్యల వల్ల మాఫీ కానీ పక్షంలో పరిష్కార చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. వెను వెంటనే కొత్త రుణాల మంజూరుకు చర్యలు చేపట్టాలన్నారు. బ్యాంకు లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే మేనేజర్లపై చర్యలు తీసుకోవాలని సీఈవో వజీర్ సుల్తాన్‌ను ఆదేశించారు. వివిధ రకాల రుణాల రికవరి వంద శాతం జరగాలని ఆదేశించారు. బ్యాంక్ టర్నోవర్ రూ.2500కోట్లకు చేరాలని, ఈ మేరకు కృషి చేయాలని రవీందర్‌రావు బ్యాంకు మేనేజర్లను ఆదేశించారు. ప్రస్తుతం బ్యాంక్ 'ఏ' ర్యాంక్‌లో ఉన్న క్రమంలో మరోసారి కూడా ఇదే ర్యాంక్‌లో నిలిచేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీజీఎం అశోక్, ఏజీఎం మధు, స్రవంతి, బోడ రాజు, గంప స్రవంతి, కృష్ణమోహన్, డీఆర్‌వోఎస్‌డీ విజయకుమారి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీపీల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించండి

- హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద
- యూజీడీ ప్రాథమిక సర్వే పవర్ పాయింట్ ప్రజంటేషన్
- 'కుడా' కార్యాలయంలో బల్దియా, కుడా అధికారులతో సమావేశం



యూజీడీ ప్రాథమిక సర్వే పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేస్తున్న అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించాలని హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి.ప్రావీణ్య, డాక్టర్ సత్యశారదాదేవిలు సూచించారు. గురువారం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో బల్దియా ఆధ్వర్యంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మురుగు నీటి నిర్వహణ వ్యవస్థ, ఎస్టీపీల ఏర్పాటు కోసం స్థలాల గుర్తింపుపై అధికారులు, కన్సల్టెన్సీలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎన్‌కే బిల్డ్ కాన్ ప్రైవేటు లిమిటెడ్ కన్సల్టెంట్ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో కలెక్టర్లతో పాటు కుడా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఇరు జిల్లాలకు చెందిన వివిధ విభాగాల ఉన్నాతాధికారులు పాల్గొని సమీక్షించారు.

ఈ సందర్భంగా వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో 2055 సంవత్సరం వరకు సుమారు 21.31 లక్షల జనాభాకు అవసరం అయ్యే ప్రణాళికలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాథమిక సర్వేను నిర్వహించినట్లు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అందుకు గాను 9 జోన్లను ఏర్పాటు చేసి ప్రతీ జోన్‌లో సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు ఆయా ప్రాంతాల్లో అవసరమైన స్థలం గురించినట్లు కన్సల్టెన్సీ ప్రతినిధులు వివరించారు. అనంతరం కలెక్టర్లు మాట్లాడుతూ.. సర్వేలో ఎస్టీపీల కోసం స్థలాల ఫిజిబిలిటీని సంబంధిత రెవెన్యూ అధికారులు బృందాలను ఏర్పాటు చేసుకుని క్షేత్రస్థాయిలో ఆయా స్థలాలను పరిశీలించి త్వరితంగా ఎంపిక చేయాలన్నారు. ఆయా మండలాల పరిధిలో సాధ్యపడకపోతే మరో ప్రాంతాన్ని అధికారులు గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనివాస్‌రావు, ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, రాథోడ్ రమేష్, కుడా సీపీవో అజిత్‌రెడ్డి, బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవింద్ర రాడేకర్, ఇరిగేషన్ అధికారి సీతారాం, ఈఈలు, తహసీల్దార్లు పాల్గొన్నారు



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

విద్యార్థినులు చదువులో రాణించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

రెడ్డికాలనీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చదువుల్లో అత్యుత్తమ ప్రతిభ చాటాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. గురువారం సాయంత్రం రెడ్డికాలనీలోని తెలంగాణ ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల విద్యార్థినులకు అందిస్తున్న భోజనాన్ని, మెనూ పట్టికను పరిశీలించి భోజనాలను సైతం పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలో అందుతున్న సేవలను విద్యార్థినులను అడిగి తెలుసుకోగా కళాశాలలకు ఆర్టీసీ బస్సుల్లో వెళుతున్నామని, ఆర్టీసీ బస్సులు ఆగేలా చర్యలు తీసుకో వాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం కళాశాల విద్యార్థినులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ డీడీ రామిరెడ్డి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పుష్పరాణి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణలో భాగస్వాములు కావాలి

అదనపు డీసీపీ ఎన్.రవి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు డీసీపీ రవి

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కుల పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని వరంగల్ పోలీసు కమిషనరేట్ అడిషినల్ డీసీపీ ఎన్.రవి కుమార్ అన్నారు. గత నెల నిర్వహించిన 'ఆపరేషన్ స్మైల్‌తో పాటు బాలల సంరక్షణ' అనే అంశంపై పోలీసుశాఖ, ఎన్జీవోలు, ఇతర ప్రభుత్వ శాఖలతో హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ పోలీస్ కమిషనరేట్, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ సంయుక్తంగా గురువారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషినల్ డీసీపీ రవి మాట్లాడుతూ.. సమాజంలో పోలీసులు, ఇతర ప్రభుత్వశాఖలు బాలల సంరక్షణ కోసం పనిచేసినప్పటికీ ఇంకా బాలల హక్కుల ఉల్లంఘన వివిధ రూపాల్లో జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బాలల అమాయకత్వాన్ని, వారి పేదరికాన్ని ఆసరా చేసుకొని కొందరు స్వార్థపరులు బాలకార్మికులు మార్చుతున్నారన్నారు. అంతేకాకుండా వాళ్లను వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలల హక్కుల ఉల్లంఘనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని, దీనికి అందరి భాగస్వామ్యం కావాలన్నారు. జనవరిలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్‌లో అందరి సమన్వయంతో 162 మంది పిల్లలను రెస్క్యూ చేసి తల్లితండ్రులకు అప్పగించామన్నారు. 18 ఏళ్లలోపు బాలలను పనిలో పెట్టుకుంటే బైండోవర్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్‌హెచ్ఓ ఆధ్వర్యంలో ఇతర ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కలిసి ఒక కమిటీ ఏర్పాటు చేసి బాలల సంరక్షణ కోసం పనిచేయడానికి ప్రణాళిక రూపొందిస్తామన్నారు. మత్తు పదార్థాల బారిన పడకుండా వివిధ శాఖ అధికారులతో కలిసి డ్రగ్స్ వ్యతిరేక కమిటీని ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు.

కాగా, రానున్నరోజుల్లో బాలల సంరక్షణ కోసం ఆచరించాల్సిన అంశాలపై ఏహెచ్‌టీయూ ఇన్స్‌పెక్టర్ పి.వెంకన్న పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. బాల కార్మికులు, డ్రాపవుట్ పిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు హనుమకొండ జిల్లా సంక్షేమాధికారి జయంతి తెలిపారు. ఈ సందర్భంగా బాలల సంరక్షణ కోసం కృషి చేసిన హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాలకు చెందిన పోలీసు అధికారులు, ఇతర ప్రభుత్వశాఖ అధికారులు, ఎన్జీవోలకు డీసీపీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా సంక్షేమాధికారి రాజమణి, కమిషనరేట్ పరిధిలోని మూడు జిల్లాల బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్స్ వసుధ, అనిల్ చందర్‌రావు, ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలం గిరి ప్రదర్శనకు ప్రత్యేక బస్సు

జనగామ రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అరుణాచలం గిరి ప్రదర్శనకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం జనగామ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ జనగామ డిపో మేనేజర్ ఎం.స్వాతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న రాత్రి 10 గంటలకు జనగామ నుంచి డీలక్స్ బస్సు బయల్దేరి కానిపాకం, వేలూరు గోల్డెన్ టెంపుల్ మీదుగా ఈనెల 12న పౌర్ణమి నాటికి అరుణాచలానికి చేరుకుంటుందన్నారు. గిరి ప్రదర్శన అనంతరం శ్రీకాళహస్తి మీదుగా 13వ తేదీ రాత్రి జనగామకు చేరుకుంటుందన్నారు. బస్సు ప్రయాణానికి రాను, పోను పెద్దలకు గాను రూ.4వేలు, పిల్లలకు రూ.2500లు టికెట్ చార్జీలు ఉంటాయన్నారు. ఇతర వివరాలకు 73828 52818 నంబరులో సంప్రదించాలని కోరారు.

జాతీయ అథ్లెటిక్స్‌కు సాంకేతిక నిపుణుడిగా మనోజ్‌కుమార్



జనగామ కల్చరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : డెహ్రాడూన్‌లో జరిగే జాతీయఅథ్లెటిక్స్ పోటీలకు సాంకేతిక నిపుణులుగా జనగామ జిల్లా కేంద్రానికి చెందిన గంగిశెట్టి మనోజ్‌కుమార్ ఎంపికయ్యారు. ఈనెల 7నుంచి 13 వరకు డెహ్రాడూన్‌లో జాతీయ అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నందున ఆయన గురువారం డెహ్రాడూన్ చేరుకున్నారు. జాతీయ అథ్లెటిక్స్‌కు సాంకేతిక నిపుణులుగా వెళ్లిన జిల్లాకు చెందిన తొలి వ్యక్తి మనోజ్ కావడం విశేషం. ప్రస్తుతం మనోజ్‌కుమార్ జనగామ మండలం చౌడారం జడ్పీ ఉన్నత పాఠశాలలో పీఈటీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్, ఆవుల అశోక్, చంద్రశేఖర్‌రెడ్డి, రంజిత్‌కుమార్, సురేష్, ప్రవీణ్, శ్రీదేవి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోపగోని సుగుణాకర్, హనుమంతరావు హర్షం వ్యక్తం చేశారు.

కేయూ లా స్టూడెంట్స్ ప్రొఫెషనల్‌గా రాణించాలి

▸▸ హనుమకొండ, వరంగల్ జిల్లాల జడ్జీలు రమేశ్‌బాబు, నిర్మలా గీతాంబ



వర్సిటీ న్యాయ కళాశాలకు కంప్యూటర్లను ఇస్తున్న జిల్లా జడ్జి రమేశ్‌బాబు, డీఎల్ఎస్ఏ బాధ్యులు క్షమాదాస్ పాండే, శ్రీకాంత్ తదితరులు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ న్యాయ కళాశాల విద్యార్థులు ప్రొఫెషనల్‌గా రాణించి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని హనుమకొండ జిల్లా జడ్జి సీహెచ్.రమేశ్‌బాబు ఉద్బోధించారు. కేయూ న్యాయ కళాశాల విద్యార్థుల ఉపయోగార్థం ఉచితంగా కంప్యూటర్లను కళాశాలకు అందచేశారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, వర్సిటీ పాలక మండలి సభ్యుడు, ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో హనుమకొండ జిల్లా జడ్జి రమేశ్‌బాబు, వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతాంబ, హనుమకొండ, వరంగల్ జిల్లాల డీఎల్ఎస్ఏ సెక్రటరీలు క్షమాదాస్ పాండే, సాయికుమార్‌లు హాజరయ్యారు. న్యాయ కళాశాల విద్యార్థుల ఉపయోగార్థం తమ తరుపున కంప్యూటర్లను అందచేసినట్లు వెల్లడించారు. విద్యార్థులు వీటిని ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. న్యాయ విద్యార్థులు వృత్తిలో రాణించేందుకు సబ్జెక్టుపై పట్టు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ న్యాయ కళాశాల అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలకలం రేపిన నిరసన

▸▸ గ్రామసభలో పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి



ఎంజీఎంలో నాగేశ్వర్‌రావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, నేతలు



నాగేశ్వర్‌రావు (ఫైల్)

ములుగు/కన్నాయిగూడెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెంలో జనవరిలో జరిగిన ఘటన కలకలానికి దారి తీసింది. ప్రజాపాలన గ్రామసభలో అందరూ చూస్తుండగా ఓ వ్యక్తి పురుగుల మందు తాగడం, చికిత్స పొందుతూ మృతి చెందడం తీవ్ర చర్చనీయాంశమైంది. దీనిపై రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు సైతం వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల పథకాల లబ్ధిదారుల ఎంపికలో భాగంగా ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెంలో జనవరి 23న గ్రామ సభ జరిగింది. ఈ పంచాయతీ పరిధి కొత్తూరుకు చెందిన కుమ్మరి నాగేశ్వర్‌రావు(42) అప్పటికే ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకొని ఉన్నాడు. గ్రామ సభకు హాజరైన ఆయన లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేకపోవడంతో అధికారులను నిలదీశాడు. దీంతో స్పందించిన అధికారులు మళ్లీ దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామని వివరణ ఇస్తుండగానే తీవ్ర మనస్తాపానికి గురైన నాగేశ్వర్‌రావు వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగాడు. పక్కనే ఉన్నవారు అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ వినలేదు. అస్వస్థతకు గురైన నాగేశ్వరరావును 108 అంబులెన్స్‌లో తొలుత ఏటూరునాగారం ప్రభుత్వ సామాజిక వైద్యశాలకు తరలించారు. వైద్యుల సూచన మేరకు ములుగు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హనుమకొండ జిల్లా ఆరెపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలోనే ఆయన ఆరోగ్యం విషమించి అదే రోజు అర్ధరాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వేణుగోపాల్ గురువారం ఎంజీఎంకు వెళ్లారు. అంత్యక్రియల నిమిత్తం రూ.50 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించిన కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. నాగేశ్వర్‌రావుకు భార్య శాంతి, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

నాగేశ్వర్‌రావు మృతికి కాంగ్రెస్‌దే బాధ్యత

వరంగల్ మెడికల్: నాగేశ్వర్‌రావు మృతికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నాగేశ్వర్‌రావు మృతి చెందడంతో ఎంజీఎం పోస్టుమార్టంకు తరలించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మార్చురీకి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృత దేహాన్ని పరిశీలించారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో లబ్ధిపొందాలనే యావతో ఎలాంటి ముందస్తు ప్రణాళికలు లేకుండానే లబ్ధిదారుల ఎంపిక పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం గందరగోళం సృష్టించిందన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను ముప్పు తిప్పలు పెడుతోందని పేర్కొన్నారు. రోడ్డున పడ్డ నాగేశ్వర్‌రావు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

కుమ్మరి నాగేశ్వర్‌రావుది ప్రభుత్వ హత్య

హనుమకొండ టౌన్: కుమ్మరి నాగేశ్వర్‌రావు ఆత్మహత్య ప్రభుత్వ హత్యగా భావించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గత నెల 23న జరిగిన గ్రామసభలో అధికారుల ప్రకటించిన జాబితాలో అర్హుడైన నాగేశ్వర్‌రావు పేరు లేకపోవడంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి చనిపోయారన్నారు. ప్రభుత్వం ఆ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

యూజీసీ కొత్త ముసాయిదాను ఉపసంహరించుకోవాలి

• ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ బహిరంగ లేఖ

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నూతన యూజీసీ చట్టం - 2025లో వర్సిటీ వీసీలు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అకడమిక్ సిబ్బంది నియామకాలు, పదోన్నతితోపాటు ఇతర అంశాలు, రాష్ట్రాల హక్కులను తొలగించే ప్రక్రియను ఉపసంహరించుకోవాలని న్యూఢిల్లీలోని యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్(యూజీసీ) సెక్రటరీకి తెలంగాణ రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ బహిరంగ లేఖను రాశారు. ఈ మేరకు గురువారం పత్రికలకు లేఖ ప్రతిని విడుదల చేశారు. లేఖలోని అంశాలను వెల్లడించారు. యూజీసీ నూతన డ్రాఫ్ట్‌లో రాష్ట్రాల హక్కులు, ప్రయోజనాలు, ఉన్నత విద్యా విధానాలకు వ్యతిరేకంగా ఉన్నాయని తెలిపారు. వర్సిటీల్లో వీసీ పాత్ర కీలకమని, వారి లోతైన నైపుణ్యం, విద్యపై అవగాహన అవసరమన్నారు. వీసీల అర్హత ప్రమాణాలలో పరిశ్రమ, ప్రజా పాలన, ప్రజా విధానంలో అనుభవం ఉన్న వ్యక్తులపై తీవ్ర ఆందోళనలు తలెత్తున్నాయని వివరించారు. వీసీ నియమాకాల్లో రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర నిర్వీర్యం అవుతోందని, విద్య కేంద్ర- రాష్ట్రాల ఉమ్మడి చట్టమన్నారు. వీసీలను విద్యారంగం నుంచి కాక ఇతర రంగాల నుంచి నియమిస్తే వర్సిటీలపై కేంద్రం పెత్తనం పెరుగుతోందన్నారు. త్వదారా రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రభావం పడుతోందన్నారు. వీసీల ఎంపికలో యూజీసీ నామినీ ఉంటారని పేర్కొన్నారు. 1956 యూజీసీ చట్ట స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ఉందన్నారు. వర్సిటీల్లో ప్రొఫెసర్ల నియామకాలు ఎంపిక చేసిన కమిటీతోనే జరుగుతోందన్నారు. నూతన ముసాయిదాలో ప్రత్యక్ష నోటిఫికేషన్‌తో చేపట్టినట్లయితే గ్రామీణ అభ్యర్థులు, మాతృభాష చదివిన వారికీ అన్యాయం జరుగుతోందన్నారు. యూజీసీ నూతన ముసాయిదా సమాఖ్యవాద స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు. వర్సిటీలకు గొడ్డలిపెట్టుగా మారిన కొత్త ముసాదాను వెంటనే ఉపసంహరించుకోవాలని లేఖలో డిమాండ్ చేశారు.

రౌడీషీటర్లకు టాస్క్‌ఫోర్స్ పోలీసుల కౌన్సెలింగ్

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు టాస్క్‌పోర్స్ కార్యాలయంలో ఏసీపీ మధుసూదన్ రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఏర్పాటు చేసి హెచ్చరించారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠినంగా శిక్షించి జైలుకు పంపిస్తామన్నారు. రౌడీషీటర్లు నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. సత్ప్రవర్తన కల్గిన వారిపై రౌడీషీట్లను తొలిగించడానికి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ఇన్‌స్పెక్టర్స్ సార్ల రాజు, మేకల రంజిత్ పాల్గొన్నారు.



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న ఏసీపీ మధుసూదన్

బర్డ్‌ఫ్లూ దరిచేరకుండా చర్యలు తీసుకోవాలి

▸▸ పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ నాగమణి



పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువులైన కోళ్లు, బాతులు, సీమ కోళ్లు, టర్కీలు, అడవి పక్షి జాతుల్లో బర్డ్‌ఫ్లూ వ్యాధి దరిచేరకుండా చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి. నాగమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బర్డ్‌ఫ్లూను వైద్య పరిభాషలో ఏవియన్ ఇన్ఫ్లుఎంజా అంటారని, పక్షులలో ఒక దాని నుంచి మరొకదానికి త్వరితగతిన వ్యాధి వ్యాపిస్తుందని తెలిపారు. ఈ వ్యాధి మానవులు, జంతువులకు సైతం సోకుతుందని వెల్లడించారు. సాధారణంగా చలికాలంలో బర్డ్‌ఫ్లూ ఎక్కువగా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. వ్యాధి సోకిన కోళ్ల ముక్కు స్రావాలు, కంటి స్రావాలు, రెట్టల ద్వారా బయటి వాతావరణం, దాణా, నీరు కలుషితం అవడం తదితర అంశాల వల్ల బర్డ్‌ఫ్లూ విస్తరిస్తుందని తెలిపారు. పక్షులలో కండ్లు, ముక్కు నుంచి స్రావాలు కారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తల, వాటిల్స్, జుట్టు భాగాలు ఎరుపు రంగుకి మారి వాపు కనిపిస్తాయని, రక్తపు దారి కలతో కూడిన ఆకుపచ్చని అతిసారం కనిపిస్తుందని తెలిపారు. ఈకలు సున్నితత్వం కోల్పోయి గరుకుగా ఉండడం ద్వారా వ్యాధిని గుర్తించవచ్చని వెల్లడించారు. బర్డ్‌ఫ్లూ సోకిన మనుషులలో అధిక జ్వరం, వణుకు, కండరాల నొప్పి, తలనొప్పి, దగ్గు, తుమ్ములు, గొంతునొప్పి, కండ్లు, ముక్కు నుంచి స్రావాలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వికారం వాంతులు, కంటి కింద వాపులు, అతిసారం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. బర్డ్ ఫ్లూను నివారించేందుకు కచ్చితమైన మందులు లేనందున జీవరక్షణ (బయో సెక్యూరిటీ) పద్ధతులు పాటించడం వల్లే వ్యాధిని నివారంచవచ్చని తెలిపారు. ఫారంలోకి వ్యాధి రాకుండా జీవరక్షణ చర్యలు పాటించాలని, తగినచర్యలుతప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

డ్యూటీకి సెలవు పెట్టి.. ఇంటికి వచ్చి...

▸▸ ఆత్మహత్య చేసుకున్న ఏఆర్ ఎస్సై
▸▸ అద్దె ఇంట్లో ఉరివేసుకొని బలవన్మరణం
▸▸ కుటుంబ కలహాలే కారణం?





సువర్ణపాక లక్ష్మీనర్సు (ఫైల్), లక్ష్మీనర్సు మృతదేహం

గోవిందరావుపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పని ఒత్తిడి నుంచి కాస్త ఉపశమనం పొందాలనుకొని డ్యూటీకి సెలవు పెట్టి ఇంటికి వచ్చిన ఏఆర్ ఎస్సై ఆత్మహత్య చేసుకోవడం విషాదాన్ని నింపింది. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో ఈ సంఘటన చోటుచేసుకుంది.

గోవిందరావుపేట మండలంలోని పస్రాలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న ఏఆర్ ఎస్సై సువర్ణపాక లక్ష్మీనర్సు(38) గురువారం ఉదయం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం మణిక్యారం గ్రామానికి చెందిన ఆయన 2007లో ఏఆర్ ఎస్సైగా ఉద్యోగంలో చేరారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని టీజీఎస్పీ-15వ బెటాలియన్‌కు చెందిన ఆయన ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని ఏడూళ్లబయ్యారం సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో టీజీ స్పెషల్ పార్టీ ఆర్మ్‌డ్ రిజర్వ్ ఎస్సై కొనసాగుతున్నారు. భార్య వినోద తాడ్వాయి మండలం మేడారం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. కొంతకాలంగా తమ ఇద్దరు పిల్లలు తనుశ్రీ, యోగితో కలిసి పస్రాలోని అద్దె ఇంట్లో ఆమె నివసిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చిన లక్ష్మీనర్సు గురువారం ఉదయం ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు.

లక్ష్మీనర్సు ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణమని తెలుస్తోంది. భార్యాపిల్లలు, కుటుంబ సభ్యులు ఆయన మృతదేహంపై పడి కన్నీరు మున్నీరుగా విలపించారు. లక్ష్మీనర్సు మృతదేహానికి ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం జరిపించిన పస్రా పోలీసులు ఆయన తండ్రి ధర్మయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రేపటి నుంచి వరంగల్‌లో గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్

గిర్మాజీపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : చైన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ నుంచి హజ్రత్ నిజాముద్దీన్ వెళ్లే గరీబ్‌రథ్ (12611) ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 8వ తేదీ శనివారం నుంచి వరంగల్‌లో హాల్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ప్రతీ శనివారం ఉదయం 6 గంటలకు డాక్టర్ ఎం.జి.రామచంద్రన్ సెంట్రల్ రైల్వే స్టేషన్ చైన్నై నుంచి ఈ రైలు బయలుదేరి గూడూరు (7.40 గంటలు), ఒంగోలు(9.30 గంటలు), విజయవాడ (11.40 గంటలు), వరంగల్ (మధ్యాహ్నం 2.14 గంటలు), బల్లార్ష(సాయంత్రం 5.45 గంటలు), నాగపూర్ జంక్షన్ (రాత్రి 8.30 గంటలు), భోపాల్ (ఆదివారం ఉదయం 02.15 గంటలు), వీరంగణ లక్ష్మీబాయి ఝాన్సీ జంక్షన్(5.25 గంటలు), గ్వాలియర్ (6.25 గంటలు), ఆగ్రా కంటోన్మెంట్ (7.52 గంటలు), హజ్రత్ నిజాముద్దీన్‌కు ఉదయం 10.30 గంటలకు చేరుకుంటుంది. చైన్నై సెంట్రల్ నుంచి హజ్రత్ నిజాముద్దీన్ వరకు వరంగల్‌తో సహా 10 రైల్వేస్టేషన్‌లలో మాత్రమే ఈ గరీబ్‌రథ్‌కు హాల్టింగ్ ఉంటుంది. వరంగల్ నుంచి న్యూఢిల్లీకి వెళ్లేందుకు ప్రతీ శనివారం మధ్యాహ్నం 2.14 గంటలకు వరంగల్‌లో ఈ రైలు అర్నిమిషాలపాటు ఆగుతుందని, ప్రయాణికులు వినియోగించుకోవాలని దక్షిణమధ్య రైల్వే తెలిపింది.



చైన్నై సెంట్రల్-హజ్రత్ నిజాముద్దీన్ గరీబ్‌రథ్ (ఫైల్)

ట్రాఫిక్ సీఐ సీతారెడ్డిపై కేసు నమోదు

▸▸ అడ్వకేట్‌పై దాడి ఘటనలో పోలీసుల చర్య
▸▸ సస్పెండ్ అయ్యేంత వరకు పోరాడాలని న్యాయవాదుల నిర్ణయం

వరంగల్ లీగల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాది గంధం శివపై దాడి చేసిన కేసులో హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి, ఇతర పోలీసు సిబ్బందిపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు బుధవారం రాత్రి 10.30 గంట లకు ఎఫ్ఐఆర్ జారీ చేశారు. ఈనెల 3న సాయంత్రం గంధం శివపై పోలీసులు దాడిచేసి స్టేషన్‌కు తీసుకెళ్లి విచక్షణారహితంగా కొట్టిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై రెండు రోజులుగా న్యాయవాదులు విధులు బహిష్కరించి తమ నిరసన వ్యక్తం చేశారు. రెండో రోజు గురువారం కూడా న్యాయవాదులు విధులు బహిష్కరించి వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో అత్యవసర సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షించారు. అదే విధంగా సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. అకారణంగా, ఏకపక్షంగా న్యాయవాది గంధం శివపై జరిగిన దాడిని న్యాయవాదులంతా ముక్తకంఠంతో తమ నిరసన వ్యక్తం చేసి కేసు నమోదు చేయించి పాక్షిక విజయం సాధించామని న్యాయవాదులు పేర్కొన్నారు.

అదే విధంగా ఎఫ్ఐఆర్ నమోదైన సంబంధిత పోలీసులను సస్పెండ్ చేసేంత వరకు ఉద్యమం ఉధృతం చేస్తామని వారు తీర్మానించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తదుపరి కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని ఈ సందర్భంగా న్యాయవాదులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు తీగల జీవన్‌గౌడ్, మాతంగి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శులు ముదసిర్ అహ్మద్, లాడే రమేష్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు బైరపాక జయాకర్, న్యాయవాదులు ఎం.సహోదర్‌రెడ్డి, పులి సత్యనారాయణ, సిద్ధం యుగంధర్, ఆర్.నర్సింగరావు, వల్స సుధీర్, రంజిత్, రాచకొండ ప్రవీణ్, జిలుకర శ్రీనివాస్, ఐత ప్రసాద్, సాజిద్, గునిగంటి శ్రీనివాస్, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

అర్చక ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం

▸▸ దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హామీ



దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్‌ను సత్కరిస్తున్న గంగు ఉపేంద్రశర్మ, అర్చక ఉద్యోగులు

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ ఆలయాల్లో పనిచేస్తున్న అర్చక ఉద్యోగుల సమస్యలన్నింటినీ సానుకూలంగా పరిష్కరించనున్నట్లు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ హామీ ఇచ్చారని తెలంగాణ అర్చక ఉద్యోగ జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో ప్రిన్సిపల్ సెక్రటరీ ఆధ్వర్యంలో దేవాదాయ అడిషనల్ కమిషనర్ జ్యోతి, డీసీఎస్ కృష్ణప్రసాద్, ఏసీ టంకశాల వెంకటేశ్ తదితర అధికారులతో తమ తెలంగాణ అర్చక ఉద్యోగ సంఘం నాయకులు మూర్తి సత్యనారాయణశర్మ, అర్చక ఉద్యోగ జాక్ అధ్యక్షుడు పరాశరం రవీంద్రాచారి, డీవీఆర్.శర్మ, కాండూరి కృష్ణమాచారి, మత్తైక ఉద్యోగ సంఘం నాయకులు చక్రధరాచార్యులు, మురళీశర్మ, ధూప, దీప, నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర నాయకులు కేవీఎన్ చారి, వేద పండితులతో మూడు గంటలపాటు ప్రత్యేక సమావేశం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా దేవాదాయ శాఖలో పనిచేస్తున్న 122 మంది అర్చక ఉద్యోగులగా నియమితులైన వారికి గ్రాంటిన్ ఎయిడ్ వర్తింపజేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. అదే విధంగా 2014 వరకు పనిచేస్తున్న 107 మంది అర్చక ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి వారిని గ్రాంటిన్ ఎయిడ్‌లో పొందుపర్చాలని ప్రిన్సిపాల్ సెక్రటరీ ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. ఈ మేరకు ఫైనాన్స్ సెక్రటరీతో మాట్లాడుతానని ఆమె హామీ ఇచ్చిందన్నారు. గత ప్రభుత్వం 577 జీవో ప్రకారం 5,625 మంది అర్చక ఉద్యోగులకు గ్రాంటిన్ ఎయిడ్ ద్వారా వేతనాలు రావాల్సి ఉండగా కేవలం 3వేల మందికే వర్తింపజేసి పెద్ద దేవాలయాలు మినహాయింపు చేసి 121 జీవో తీసుకొచ్చిన క్రమంలో మిగిలిన ఉద్యోగులకు కూడా గ్రాంటిన్ ఎయిడ్ విషయంలో అర్హత ఉన్న అర్చక ఉద్యోగులను చేర్చాలని తమ సమావేశంలో కోరినట్లు దానికి ప్రిన్సిపల్ సెక్రటరీ సానుకూలంగా స్పందించినట్లు ఆయన చెప్పారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2280	2100
పల్లికాయ (సూక)	6350	4600
పల్లికాయ (పచ్చిది)	4300	3100
కందులు	6782	5540
పెసళ్లు	-	-
పత్తి	6970	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13400	9000
తేజ మిర్చి (కొత్తది)	-	-
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	15000	11500
ఎల్లో మిర్చి	18000	13500
యూఎస్341	14100	11500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

సంగీత సాగరం..

విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలకు 52 ఏళ్లు

నటరాజ కేతనం

- ఎందరినో ప్రతిభావంతులైన కళాకారులుగా తీర్చిదిద్దిన సంస్థ
- మహామహులైన అధ్యాపకులతో శిక్షణ
- నేడు కాళోజీ కళాక్షేత్రంలో స్వర్ణోత్సవ సంబురం

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పాశ్చాత్య ఆధునిక నృత్యాల హోరులో మసకబారుతున్న భారతీయ సంగీత నృత్య రీతులకు అక్కడ ప్రాణం పోస్తారు. యాంత్రిక జీవనంలోనూ సంగీత కళలంటే, శాస్త్రీయ నృత్యాలంటే మక్కువ చూపేవారికి అక్కడ తరగని ప్రోత్సాహం ఇస్తారు. ఆశించిన సౌకర్యాలు లేనప్పటికీ సంకల్పమే మహాబలంగా అక్కడ సంగీతం వీనులవిందు చేస్తుంది. నృత్య సవ్వడులు తనువును పులకింపజేస్తాయి. నగరంలోని పోతన ఆడిటోరియం వద్ద కొలువుదీరిన విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల చారిత్రక ఓరుగల్లు కంఠభరణంగా విలసిల్లుతోంది. ఎందరో కళాకారులను తీర్చిదిద్ది భారతీయతకు పట్టం కడుతోంది. మహామహులైన అధ్యాపకులను ముంగిటకు తెచ్చి సంగీత పరిమళాలను వెదజల్లుతోంది. ఈ కళాశాల స్థాపించి 52 వసంతాలు పూర్తవుతున్నాయి. ఈ సందర్భంగా కళాశాల సంగీత నృత్య ప్రస్థానంపై అవలోకనం.

ప్రస్థానం

1972వ సంవత్సరంలో ఓరుగల్లు నగరంలో రాష్ట్ర సాంస్కృతికశాఖ ఈ పాఠశాలను ప్రారంభించింది. కేవలం కర్ణాటక గాత్రం, హిందుస్థానీ గాత్రం కోర్సులతో ప్రారంభమైన పాఠశాల.. తరువాత అప్‌గ్రేడ్ అయి దాదాపు అన్ని ప్రధాన కోర్సులతో నేడు యేటా 350మందికి పైగా విద్యార్థులతో విద్యారణ్య ప్రభుత్వ నృత్య కళాశాలగా ఆదరణ పొందుతోంది. గతంలో ఈ కళాశాలలో పని చేసిన పని చేసిన వారు ప్రముఖంగా పేరుగాంచిన వారే కావడం విశేషం. కళాశాల తొలి ప్రిన్సిపాల్ ఆకెళ్ల మల్లికార్జునశర్మతో ప్రారంభమై ఎన్.హన్మంతరావు, పూచర్ల మనోరమ, పివి .శేషయ్యశాస్త్రి, సుబ్బరాయశర్మ, గుమ్మడి జనార్దన్, జె.శ్రీనివాసమూర్తి, కుప్ప పద్మజతోపాటు ప్రస్తుత ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్ లాంటి ప్రసిద్ధ కళాకారులే కళాశాల ప్రిన్సిపాళ్లుగా పని చేశారు. ఇప్పటి వరకు వివిధ కోర్సుల్లో ఈ కళాశాలలో 13వేల పైచిలుకు విద్యార్థులు సంగీత నృత్య విద్యలను అభ్యసించారు. యేటా కొత్తగా 350 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. కర్ణాటక గాత్రం, వయోలిన్, కూచిపూడి నృత్యం, హిందుస్థానీ గాత్రం, వీణ, మృదంగం, సితార్, తబలా లాంటి కోర్సులతోపాటు ఓరుగల్లులో పురుడుపోసుకున్న పేరిణి నృత్యంలో శిక్షణ ఇస్తున్నారు. ఈ కళాశాల ద్వారా యేటా జనవరి 30న సద్గురు త్యాగరాయ స్వామి ఆరాధనోత్సవాలు, సంగీత దినోత్సవం సందర్భంగా ప్రత్యేక వేడుకలతోపాటు నెల నెలా వెన్నెల పేరిట క్రమం తప్పకుండా కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. సంగీత నృత్యాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తూ ఆదరణ పొందుతున్న తమ ఈ కళాశాలకు అన్ని హంగులతో సొంత భవనం ఒకటి ప్రత్యేకంగా ఉంటే మరింత శిక్షణ ఇచ్చి కలల నగరంలో మరింతగా కళాకారులను తీర్చిదిద్దే అవకాశాలు మెండుగా ఉంటాయి.

కళాక్షేత్రంలో..

కరోనా కారణంగా రెండేళ్ల కిందటే జరుపుకోవాల్సిన స్వర్ణోత్సవ వేడుకలను ఈ నెల 7వ తేదీన హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో పెద్ద ఎత్తున జరుపుకునేందుకు సమాయత్తం కావడం విశేషం. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగే స్వర్ణోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, రాష్ట్ర సాంస్కృతిక భాషా సంచాలకులు మామిడి హరికృష్ణ, ప్రత్యేక ఆహ్వానితులుగా భద్రకాళి ఆలయ చైర్మన్ బి.శేషగిరిరావు తదితరులు పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధీర్ కుమార్ చెప్పారు. కళాశాల స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా ఈ కళాశాలలో పనిచేసిన అధ్యాపకులను సత్కరించడంతోపాటు విభిన్న కోర్సులలో శిక్షణ పొంది రాష్ట్ర, జాతీయస్థాయిల్లో పేరుగడించిన తమ విద్యార్థులచే ప్రతిభా ప్రదర్శనలు నిర్వహించనున్నారు.




హిందుస్థాన్ గాత్ర కచేరి


కూచిపూడి నాట్యం చేస్తున్న కళాకారులు


వయోలిన్ కచేరి


కర్ణాటక గాత్ర కచేరి


పేరిణి నృత్యం

ఈ-బైక్ జోరు..

రోజురోజుకూ పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు

అమ్మకాల్లో హుషారు!

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు పెరుగుతున్న పెట్రోల్ ధరలు.. మరోవైపు పొగ కాలుష్యం.. ఈ నేపథ్యంలో పర్యావరణాన్ని పరిరక్షిస్తూనే.. జనం తమ ఖర్చును తగ్గించుకోవడంపై దృష్టిపెడుతున్నారు. ఈ క్రమంలో పెట్రోల్‌తో నడిచే ద్విచక్రవాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ బైక్‌లను కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం పేద, మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటులో ధరల్లో ఎలక్ట్రిక్ వాహనాలు వస్తుండటంతో వీటి విక్రయాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని డీలర్లు చెబుతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరల సమస్యను అధిగమించడం సగటు మానవులకు కత్తిమీద సాములా మారిన నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నట్టు ప్రస్తుత మార్కెట్ ట్రెండ్‌ను బట్టి అర్థమవుతోంది. విద్యుత్ వాహనాలపై రోడ్డు ట్యాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలను పూర్తిస్థాయిలో మినహాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వాహనదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఆ మేరకు న్యూ ఈవీ పాలసీ ఉత్తర్వుల్లో జీవో 41 కూడా జారీ చేసింది.

మారుతున్న ట్రెండ్

ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ఏ కొద్ది దూరం వెళ్లాలన్నా బైక్ తప్పనిసరి అయిపోయింది. ఈ క్రమంలోనే వాహనదారులంతా తమ పాత వాహనాల స్థానంలో విద్యుత్‌తో నడిచే స్కూటీలు, బైక్‌లు, ఇతర వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఉద్యోగ, ఉపాధి, వాణిజ్య అవసరాలు కలిగిన వారంతా ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆ వాహనాల సంఖ్య జిల్లాలో గణనీయంగా పెరుగుతోంది. మరో వైపు పెరుగుతున్న వాహన కాలుష్యం రీత్యా ఎలక్ట్రిక్ వాహనాలకు తగిన ప్రోత్సాహంతో కూడిన మినహాయింపులు ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో కొనుగోళ్లు మరింత పెరిగే అవకాశాలున్నాయి. వీటి కోసం తగినన్ని చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు కూడా అవసరమని వాహనదారులు పేర్కొంటున్నారు. కంపెనీలు, మోడళ్లు, సామర్థ్యాన్ని బట్టి రూ.60వేల నుంచి రూ.2లక్షల వరకు ధరల్లో ఈ బైక్‌లు లభ్యమవుతున్నాయి. ఎలక్ట్రికల్ వాహనాల్లో 250 వాట్ల కంటే తక్కువ శక్తిని కలిగి ఉండి గంటకు 25 కిలో మీటర్ల కంటే తక్కువ వేగం కలిగిన సామర్థ్యం ఉన్న వాహనాలకు ఎలాంటి రిజిస్ట్రేషన్ అవసరం లేదు. అంతకంటే ఎక్కువ సామర్థ్యం ఉన్నవాటిని మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉండేది.



తాజాగా విద్యుత్‌తో నడిచే అన్ని వాహనాలకు కూడా పూర్తిస్థాయి రిజిస్ట్రేషన్ చార్జీలు, రోడ్డు ట్యాక్ రద్దు చేయడంతో వీటి కొనుగోలు మరింత పెరిగే అవకాశం ఉందని వాహన అమ్మకందారులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

పేద, మధ్య తరగతి కుటుంబాలకు లాభదాయకం
గజ్జెల రమేష్, ఎలక్ట్రిక్ బైక్ షోరూం డీలర్



డీలర్ గతంలో పెట్రోల్ బైక్‌లు నడిపి ఇబ్బందుల పాలవుతున్న వారు మమ్మల్ని సంప్రదించి వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఈ ఎలక్ట్రిక్ బైక్‌లు ఎంతో లాభదాయకం. రైతులు, చిరు వ్యాపారం చేసుకునే వారికి సైతం అనువుగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో తక్కు వ ఖర్చుతో ఎక్కువ లాభప డేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారు. గంట చార్జింగ్ పెడితే కొందరికి రెండు మూడు రోజుల పాటు వస్తోంది. దీనికి తోడు పర్యావరణ పరిరక్షణ కూడా వీలవుతుంది.

మహా వేడుకకు వేళాయే..

- నేడు కాళేశ్వరంలో మహా కుంభాభిషేకం ప్రారంభం
- 42 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి
- దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాక
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్న అధికారులు

మహదేవపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రం కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం. దక్షిణ కాశీగా పేరొందిన శైవక్షేత్రం ఇది. గోదావరి, ప్రాణహిత, సరస్వతి ఒడ్డున ఒకే పానవట్టంపై వెలిసిన రెండు లింగాలు ఉండి భక్తుల కొంగుబంగారంగా విలసిల్లుతోంది. ఇక్కడ కుంభాభిషేక ఉత్సవాలు 42 ఏళ్ల అనంతరం శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. దీని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ రాహుల్‌శర్మ ముఖ్య అతిథులుగా ఈ వేడుకలో పాల్గొననున్నారు. శుక్రవారం (ఈనెల 7న) స్వస్తి క్రోధి నామ సంవత్సర మాఘ శుద్ధ దశమి సందర్భంగా కుంభాభిషేకం ప్రారంభం కానుంది. ఈనెల 9 వరకు ఈ క్రతువు జరగనుంది.

వేడుకలు ఇలా..

కుంభాభిషేకం సందర్భంగా సప్త నదీ జలాలతో 1008 కళశాలతో వేద పండితులు మహా ఘట్టాన్ని నిర్వహించనున్నారు. విశ్వ కల్యాణం కోసం శృంగేరి జగద్గురు భారతీ తీర్థ మహాస్వామి ఆశీస్సులతో విధుశేఖర భారతి తీర్థస్వామి అనుగ్రహం, తుని తపోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి కరకములతో శతచండీ మహారుద్ర సహిత సహస్ర ఘటాభిషేకం, కుంభాభిషేకం మహోత్సవ ప్రయాగ దీక్ష జరుపనున్నట్టు వేద పండితులు తెలిపారు. సప్తనది జలాలతో కుంభాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు.


విద్యుత్ దీపాలతో అలంకరించిన కుంభాభిషేక మండపం

50 మంది వేద పండితులు

పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో 42 సంవత్సరాల తర్వాత జరిగే మహా కుంభాభిషేకానికి ఆలయ అర్చకులతో పాటు 50 మంది వేద పండితులు పాల్గొననున్నారు. మంచిర్యాల జిల్లా అర్చనాపురం గ్రామానికి చెందిన 50 మంది వేద పండితులు కుంభాభిషేకంలో పాల్గొననున్నారు.

100 మంది సిబ్బందితో సేవలు

కుంభాభిషేక మహా ఘట్టానికి పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ, ఆర్ అండ్‌బీ, అగ్నిమాపక, హెల్త్, ఇరిగేషన్, ఇతర విభాగాల అధికారులు మొత్తం వంద మంది సేవలు అందించనున్నారు.

పోలీసుల పటిష్ట బందోబస్తు

భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే నేతృత్వంలో పోలీసులు కుంభాభిషేకంలో మూడు రోజులపాటు భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. ఇద్దరు డీఎస్పీలు, ఏడుగురు సీఐలు, 15 మంది ఎస్సైలు, 200 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొననున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా ఎస్పీ అన్ని ఘాట్లను పరిశీలించారు. ఎప్పటికప్పుడు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. మూడు రోజుల పాటు కుంభాభిషేకానికి వచ్చే వీఐపీలు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.


కాళేశ్వరాలయంలో కుంభాభిషేకానికి సిద్ధంగా ఉన్న కళశాలు

భక్తులకు ఆర్టీసీ సేవలు

కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులు ఆర్టీసీ అధికారులు నడుపనున్నారు. భూపాలపల్లి, వరంగల్, జనగామ, మంచిర్యాల, మంథని, గోదావరిఖని, ఆసీఫాబాద్, కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడతో పాటు పలు డిపోల నుంచి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వీసులను అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం : ఈవో మహేష్

కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో జరిగే మహా కుంభాభిషేకానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ వేడుకలు అంగరంగ వైభవంతో నిర్వహిస్తున్నాం. నాలుగు గోపురాలకు పరంజాలు కట్టాం. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పనులు పూర్తి చేశాం.



లోకల్ కౌబాయ్..
భలే చాయ్

- ఆహార్యంలో అతడిదో ప్రత్యేకత
- రోజుకు 20 కిలోమీటర్లు నడుస్తూ టీ విక్రయం
- ఫోన్‌లో ఆర్డర్ చేస్తే చాలు నిమిషాల్లో అక్కడకు..
- ఆకట్టుకుంటున్న 'ఓరుగల్లు జేమ్స్‌బాండ్' రావల్

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అతడి అందరూ లోకల్ కౌ బాయ్ అని పిలుస్తుంటారు. జేమ్స్‌బాండ్‌లా ఉన్నావ్.. అంటూ కితాబిస్తుంటారు. అందరూ అన్నట్టుగానే ఆరడుగుల ఎత్తు.. బక్కపలచని శరీరాకృతి.. నెత్తిన గుండ్రటి టోపీ ధరించి అందరినీ ఆకట్టుకునేలా ఉంటాడు.. ఇంతకీ ఎవరా అతడు అనుకుంటున్నారా? అతడు ఒక సాధారణ చాయ్ వాలా. వరంగల్ నగరంలో షాపింగ్ మాల్స్, షాపులు, జంక్షన్లు, సెంటర్లలో సంచరిస్తూ టీవిక్రయించే కేపీ రావల్ అలియాస్ కన్నయ్య ప్రతాప్ లాల్. చాయ్‌వాలా అయినప్పటికీ రావల్ ఓ ప్రత్యేకతను చాటుకుంటున్నాడు. చూడటానికి సినిమా హీరోలా, గొప్పింటి బిడ్డలా కనిపిస్తున్న రావల్.. రెండు చేతుల్లో టీ ఫ్లాస్కులు, గ్లాసుల కట్టలు పట్టుకుని.. నడుము చుట్టూ క్యాష్ బ్యాగ్ ధరించి, నెత్తిన కౌబాయ్ క్యాప్, మెడలో పూసల దండలు, చేతులకు వివిధ రకాల బ్రాస్‌లెట్, దారాలు కట్టుకుని అందరి చూపును తన వైపునకు తిప్పుకుంటున్నాడు. కనిపించిన ప్రతీ ఒక్కరిని 'హాయ్ సార్.. హాయ్ మేడం.. చాయ్ కావాలా?' అంటూ నవ్వుతూ పలకరిస్తాడు. వరంగల్, హనుమకొండ నగరాల్లోని ప్రధాన రోడ్లపై నడుస్తూ 'హే భాయ్.. ఇదర్ చాయ్..' అంటూ స్మైల్ ఇస్తాడు. పలు ప్రాంతాల్లో తిరుగుతూ అమ్మే అతడికి ఆయా ప్రాంతాల్లో షాపింగ్ మాల్స్, ఇతర దుకాణాల నుంచి రోజూ సుమారు 200 మందికిపైగా ఫోన్ కాల్స్ చేసి టీ తెప్పించుకుంటారు. వారు ఫోన్ చేసిన నిమిషాల వ్యవధిలో అక్కడికి చేరుకుని టీ అందిస్తాడు. ఎవరైనా ఏంటీ ఈ వేషం అని అడిగితే.. ఫ్యాషన్ అని, ఫేమస్ కావాలనే ఇలా ఉంటానని, అందరికంటే బిన్నంగా ఉండడమే నా ప్రత్యేకత అని సమాధానమిస్తాడు హనుమకొండ చౌరస్తా, పెట్రోల్‌పంపు, ములుగురోడ్డు, ఎంజీఎం, కాజీపేట, కేయూ జంక్షన్, బాలసముద్రం, నక్కలగుట్ట వరకు రోజుకు సుమారు 20 నుంచి 30 కిలోమీటర్లు నడుస్తూ.. టీ అమ్ముతాడు. 8నుంచి 10 ఫ్లాస్కుల చాయ్, కాఫీలను విక్రయిస్తూ రోజుకు రూ.600 నుంచి రూ.800 వరకు సంపాదిస్తున్నాడు. ఇక తన ఫిట్‌నెస్ కోసం ఎలాంటి వ్యాయామం చేయనని, రోజూ తాను నడిచేదే సరిపోతుందని, అదే తన ఆరోగ్య రహస్యమని చెబుతున్నాడు.





గుజరాత్ నుంచి వరంగల్‌కు..

వరంగల్ వెరీ ఫేమస్ చాయ్ వాలాగా పేరున్న కేపీ రావల్ స్వస్థలం గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్ ప్రాంతం. జీవనాధారం కోసం అతడి కుటుంబం 2010లో వరంగల్‌కు వచ్చింది. అప్పటికే భార్య మీనాక్షి, ఇద్దరు కుమారులు అల్కర్ రావల్, మోహిత్ రావల్ ఉన్నారు. తొలిరోజుల్లో కాజీపేట ఫాతిమానగర్ జంక్షన్‌లో రాత్రివేళలో శ్రీరాం మార్వాడీ భోజనశాలను ఏర్పాటు చేశాడు. కానీ వ్యాపారం అంతగా లేక నష్టం రావడంతో అక్కడి నుంచి హనుమకొండకు మకాం మార్చాడు. రెడ్డికాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉన్న కాస్త డబ్బులతో ఇంట్లోనే భార్య చేసిన చాయ్‌ని రెండు ఫ్లాస్కులలో నింపుకుని రోడ్డెక్కాడు. నాడు రూ.2కే చాయ్ అమ్మగా.. బేరం సక్సెస్‌ఫుల్‌గా నడవడం, భార్య సహకారంతో అదే ప్రాంతంలో ఓ ఇంటిని కూడా కొనుక్కోగలిగాడు. అయినా చాయ్ విక్రయమే జీవనాధారంగా చేసుకుని.. ప్రస్తుతం ఒక్కో టీ, కాఫీ రూ.10కి అమ్ముతున్నాడు. ఇక తన పెద్ద కుమారుడు అల్కర్ రావల్‌కు పెట్రోల్ పంపు సమీపంలో ఓ హోటల్ పెట్టించగా.. చిన్న కుమారుడు మోహిత్ రావల్ ఢిల్లీలో సివిల్స్‌కు సిద్ధమవుతున్నాడు.

సంపాదనలో కొంత సామాజిక సేవకు..

రోజూ టీ విక్రయించగా వచ్చిన డబ్బులో కొంత సామాజిక సేవా కార్యక్రమాలకు కూడా వెచ్చిస్తున్నాడు రావల్. కుటుంబ సభ్యుల పుట్టిన, పెళ్లిరోజు వేడుకల సందర్భంగా దైవకార్యాలకు ఆర్థిక సాయం చేయడంతో పాటు నగరంలో రాత్రి సమయంలో రోడ్లపై నిద్రించే నిరాశ్రయులకు అన్నం, దుప్పట్లు పంపిణీ చేస్తాడు. మానసిక వికలాంగులు, వృద్ధాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలు చేస్తుంటాడు. తనకు వచ్చే చిన్నపాటి ఆదాయం నుంచి ఆపదలో ఉన్న పేదలకు పంచడం తనకు సంతోషాన్నిస్తోందని, ప్రతీ మనిషికి కష్టాలు.. నష్టాలు ఉంటూనే ఉంటాయని, అందరికీ ఆనందం పంచడమంటే తనకు ఇష్టమని రావల్ చెబుతున్నాడు. ఇదంతా తాను సొంతగా పెట్టుకున్న యూట్యూబ్ చానల్ ద్వారా యువతకు చెబుతున్నానని, ఇప్పటి వరకు తన చానల్‌కు 10వేల మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారని, తాను రీల్స్ చేయడం ఆలస్యం చేస్తే తన అభిమానులు ఫోన్లు చేసి మరీ అడుగుతారన్నారు. తన వేషధారణ చూసి ప్రతి ఒక్కరూ తనను ఇష్టపడతారని, కొందరు చాయ్ కోసం ఫోన్‌లో ఆర్డర్ ఇస్తారని చెప్పాడు. తనకు చిన్నతనం నుంచే సినిమాలు అంటే చాలా ఇష్టమని, రైతుబిడ్డగా పేరుపొందిన పల్లవి ప్రశాంత్ తరహాలో తననూ ఎప్పటికైనా గుర్తిస్తారని ఆశిస్తున్నానంటున్నాడు.

నీటిపారుదల శాఖలో
అవినీతి లీలలు

- కారుణ్య నియామకాలకు లక్షల్లో వసూళ్లు
- ఏళ్ల తరబడి సర్కిల్ కార్యాలయంలో విధులు
- కలెక్టర్‌కు ఫిర్యాదుకు సిద్ధమైన టీఎన్జీవో నేతలు

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖలో ఓ అధికారి అవినీతి లీలలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఏళ్ల తరబడి ఒకే దగ్గర పని చేయడంతో ఉన్నతాధికారుల పేరు చెప్పి లక్షల్లో డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు బాధిత ఉద్యోగులు చెబుతున్నారు. హనుమకొండ చింతగట్టు క్యాంపు చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఓ అధికారి వివిధ విభాగాల్లో పనిచేసే అటెండర్, రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్ కేడర్ వరకు పనిచేసే అధికారులు, సిబ్బంది వద్ద లక్షల్లో డబ్బులు వసూళ్లు చేసినట్లు చెబుతున్నారు. చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో సీనియారిటీ ప్రకారం బదిలీలు, ప్రమోషన్లు నిబంధనల ప్రకారం చేపట్టాలి. ఏళ్ల తరబడి ముఖ్య అధికారి కార్యాలయానికి అనుబంధంగా ఓ సెక్షన్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న అధికారి డబ్బులు ఇస్తేనే అపాయింట్‌మెంట్ లెటర్లు, డబ్బులు ఇవ్వకుంటే నెలల తరబడి తిప్పించుకోవడం చేస్తున్నట్లు ఆ శాఖలో పనిచేస్తున్న కొంతమంది అధికారులు వాపోతున్నారు. నీటిపారుదల శాఖలో పనిచేసే అటెండర్ కొన్ని నెలల కిందట గుండెపోటుతో మరణిస్తే తన భార్యకు కారుణ్య నియామకం కోసం రూ.లక్ష వరకు వసూలు చేసి ఇంకా డబ్బుల కోసం డిమాండ్ చేస్తున్నట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు, ప్రమోషన్లు చేస్తున్నట్లు టీఎన్జీవో యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఇటీవల చీఫ్ ఇంజనీర్ దృష్టికి తీసుకుపోయినప్పటికీ సూపరింటెండెంట్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిసింది. 2021 నుంచి అతడిపై ఉద్యోగులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం వెనుక ముఖ్య అధికారి పాత్ర ఉందా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారిపై కలెక్టర్, విజిలెన్స్ విచారణ జరిపించాలని శాఖలో పనిచేసే ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.



నేడు సంగీత నృత్య కళాశాల స్వర్ణోత్సవాలు

వడ్డెపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం ఆడిటోరియంలో తెలంగాణ ప్రభుత్వం-భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విద్యారణ్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల హనుమకొండ శాఖ కళాశాల స్వర్ణోత్సవాలు శుక్రవారం ఉదయం 9గంటలకు ప్రారంభమవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ నాడ్గౌడ సుధీర్‌కుమార్ తెలిపారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కళాశాల స్వర్ణోత్సవాల కరపత్రాలు, బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, విశిష్ట అతిథిగా మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, భాషా సాంస్కృతిక శాఖ రాష్ట్ర సంచాలకులు మామిడి హరికృష్ణ ప్రత్యేక ఆహ్వానితులుగా భద్రకాళి దేవస్థానం చైర్మన్ బండారి శేషగిరిరావు హాజరవుతారని అన్నారు. అనంతరం విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శన ఉంటుందని వరంగల్ ఉమ్మడి జిల్లాలోని సంగీత ప్రియులు, కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



కరపత్రాలు, బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ సుధీర్‌కుమార్

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ శాసన మండలిలో షెడ్యూల్ కులాల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంతో పాటు షెడ్యూల్ కులాల వర్గీకరణ రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించడంపై గురువారం హసన్‌పర్తిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మాదిగ, మాదిగ ఉపకులాల పక్షాన క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు రామంచ దయాకర్, డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, మాజీ మార్కెట్ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జన్ను రవిందర్, పుల్ల రవీందర్, ఎర్ర ప్రకాష్, మేకల రమేష్, రేణికుంట్ల అశోక్, ఐలయ్య, మధు, సుధాకర్, సురేష్, సాంబయ్య, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమికి హద్దులు ఏర్పాటు చేయాలి



ఆర్‌డీవో రమేష్ రాథోడ్‌కు వినతి పత్రం ఇస్తున్న తాళ్లపెల్లి విజయ్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ మండలం వడ్డెపల్లి రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 690లోని 33 గుంటల భూమి ఉందని దానికి సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపెల్లి విజయ్ హనుమకొండ ఆర్డీవో రమేష్ రాథోడ్‌ను కోరారు. గురువారం హనుమకొండలోని ఆర్డీవో కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. వడ్డెపల్లి రెవెన్యూ పరిధి బతుకమ్మ బండగా పేరొందిన ప్రభుత్వ భూమిని కొందరు సర్వే నంబర్ 693 మీద మున్సిపాలిటీ నుంచి పర్మిషన్ తీసుకొని తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకొని నిర్మాణాలు చేపట్టడానికి పునుకున్నారని అన్నారు. సర్వే నంబర్ 690లో సమగ్ర సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసి అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు.

ఫార్మసిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌గౌడ్

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఫార్మసిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఫార్మసిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ అన్నారు. గురువారం వరంగల్, హనుమకొండ జిల్లాల సమీక్షా సమావేశం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మసిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడానికి త్వరలోనే అధికారులతో మాట్లాడనున్నట్లు తెలిపారు. అవసరం అయితే హెల్త్ మినిస్టర్‌తో కూడా చర్చించి పరిష్కార మార్గాలను చూపుతామని హామీ ఇచ్చారు. సమావేశంలో వరంగల్, హనుమకొండ జిల్లాల కార్యదర్శులు ఎం.అవినాష్, గోపు సతీష్, అజిత, విజయలక్ష్మి, విజయ, వెంకటేశ్వర్లు, సునీత, రత్నప్రభ, అరుణాకుమారి, సంతోష్, జ్యోతి,సృజన, సుధారాణి, సరళారాణి, అన్వేష్, అంజి, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను బర్తరఫ్ చేయాలి

▸▸ తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న గోపు జైపాల్‌రెడ్డి, అర్షుల కిషన్‌రెడ్డి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలో నిర్వహించిన బీసీ రాజకీయ యుద్ధభేరి సభలో రెడ్డి సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానపర్చిన తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కుమార్‌ను ఎమ్మెల్సీ పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అర్షుల కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తీన్మార్ మల్లన్నకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దుచేసి ఎమ్మెల్సీ పదవి నుంచి మల్లన్నను తొలగించాలని సీఎం రేవంత్‌రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను, శాసన మండలి చైర్మన్‌కు వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు రావుల నర్సింహరెడ్డి, వీసం సురేందర్‌రెడ్డి, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, నల్లా రాజిరెడ్డి, జైహింద్ రెడ్డి, రాధారపు సంజీవరెడ్డి, రవీందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వీసం కరుణాకర్‌రెడ్డి, చింతల హరికృష్ణారెడ్డి, కట్టా రఘుపాల్‌రెడ్డి, పెద్ది ఇంద్రసేనారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడిని కలిసిన ఎస్సీ మోర్చా నేతలు



సంతోష్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంద్ర మధు, నాయకులు

రాంనగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియామకమైన కొలను సంతోష్‌రెడ్డిని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సంతోష్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బర్ల నవీన్, శ్రీనివాస్, కోవెల జీవన్, శివకృష్ణ, కార్యదర్శులు భైరపాక వెంకటేశ్, బొచ్చు శ్రీనివాస్, సదానందం, 63వ డివిజన్ అధ్యక్షుడు కళ్యాణ్, బీజేపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నర్మెట్ట శ్రీనువాస్, రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు అరణ్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి



సదస్సులో మాట్లాడుతున్న కొప్పు పద్మ

వడ్డెపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ.5వేల కోట్ల నిధులు కేటాయించి వారి అభివృద్ధికి కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ కొప్పు పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్ సమావేశ మందిరంలో తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ మత్స్య సహకార సంఘానికి రూ.10లక్షల ఉచిత రుణాలను ఇవ్వాలని, వరంగల్ మహానగరంలో 10ఎకరాల స్థలం కేటాయించి రూ.50కోట్లతో హోల్‌సెల్ చేపల ఎగుమతి కేంద్రాన్ని నిర్మించాలని అన్నారు. దేశవ్యాప్తంగా మత్స్య వృత్తిపై ఆధారపడి ప్రత్యక్షంగా 3కోట్ల మంది మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. దేశానికి కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని మత్స్య సంపద ఎగుమతుల ద్వారా సంపాదిస్తున్నారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇన్సూరెన్స్, ఎక్స్‌గ్రేషియాను బాధితులకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డోలి రాజలింగం, జిల్లా అధ్యక్షుడు నిమ్మల విజేందర్, జిల్లా నాయకులు జునాగిరి దుర్గయ్య, తెట్టె రవి, పిట్టల రవి, దువ్వ సమ్మక్క, మోరె కుమార్, మాటూరి సమ్మయ్య, నీలం భానుచందర్, మఠంపవన్, గొల్కొండ హిమబిందు, మోరె రాధిక, కుక్కల సరోజన, మమత, సమ్మక్క, పిట్టల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యేల పరామర్శ



మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రానికి చెందిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మారపల్లి రాంచంద్రారెడ్డి తల్లి సుశీలమ్మ దశదినకర్మ గురువారం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు, మార్తినేని ధర్మారావు, కొండేటి శ్రీధర్‌తో పాటు పలువురు ప్రముఖులు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారి వెంట స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు ఎడ్ల అశోక్‌రెడ్డి, దొంతి దేవేందర్‌రెడ్డి, చందుపట్ల కీర్తిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి, వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామిగౌడ్, రైల్వే బోర్డు మెంబర్లు దాసరి రాజు, తాళ్ల శ్యాం, మండల అధ్యక్షుడు మారం తిరుపతి, రాజేశ్వర్‌రావు, సుమన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్

హసన్‌పర్తి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఈనెల 8, 10వ తేదీలలో రెండు రోజుల పాటు నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువకేంద్రం వరంగల్ జిల్లా అధికారి చింతల అన్వేష్ తెలిపారు. యువకులకు వాలీబాల్, ప్రగూపు రన్నింగ్, షటిల్ సింగిల్స్, యువతులకు కబడ్డీ గ్రూప్, షటిల్ సింగిల్స్, రన్నింగ్ పోటీలు న్విహిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధికి చెందిన 18 నుంచి 30 సంవత్సరాల వయస్సులోపు ఉన్న అర్హులైన యువతీయువకులు ఈక్రీడా పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్, మెమోంటోలు ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకునేందుకు మండ రాజేష్ సెల్ నెం.9963945620ను సంప్రదించాలని సూచించారు.

కెమిస్ట్రీ అధ్యయనంతో ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీనాథ్

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పీజీ కెమిస్ట్రీ కోర్సు అభ్యసించే యువతకు ఉజ్వల భవిష్యత్ ఉందని వరంగల్ నిట్ కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ కాశీనాథ్ అన్నారు. గురువారం హనుమకొండ కేడీసీ కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ వాసం శ్రీనివాస్ అధ్యక్షతన ఉచిత కెమిస్ట్రీ కోచింగ్ తరగతులు ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రొఫెసర్ కాశీనాథ్ హాజరై మాట్లాడారు. సెంట్రల్ వర్సిటీలో కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (సీయూఈటీ-25) పరీక్ష విధానంపై అవగాహన కల్పించారు. కెమిస్ట్రీ పీజీ కోర్సులను సెంట్రల్ వర్సిటీతో పాటు డీమ్డ్, స్టేట్ వర్సిటీలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్ పరీక్షల విధానం, మోడల్ పేపర్, పరీక్షలకు సంబంధించిన మెళకువలను విద్యార్థులకు వివరించారు. డాక్టర్ వాసం శ్రీనివాస్ మాట్లాడుతూ.. 40 రోజుల ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకుఇన సీట్లు సాధించాలని కోరారు. ఈ సమావేశంలో కళాశాల ఏక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ శ్యాంప్రసాద్, కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్ విజయలక్ష్మి, ఎ.శ్రీనివాస్, సంధ్యారాణి, వీరన్న, రమేశ్, ప్రసూనలు కెమిస్ట్రీ ఎంట్రెన్స్ పరీక్షలకు సంబంధించిన విషయాలపై విద్యార్థులకుకీలక చూచనలు చేశారు. డాక్టర్ ప్రసూన వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చదరంగం పోటీలు

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఓపెన్ టు ఆల్ చదరంగ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్ ఎదురుగా ఉన్న టీటీడీ దేవస్థానంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. క్రీడాకారులు తమ వెంట చెస్ బోర్డుతో పాటు, క్లాక్ తీసుకుని రావాలని సూచించారు. పోటీలో గెలుపొందిన వారికి నగదు పురస్కారంతో పాటు, బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్లు వారు తెలిపారు. వివరాల కోసం 9059522986 నెంబరును సంప్రదించాలని కోరారు.

దామెర ఆశ్రమ పాఠశాలలో వసతులు కల్పించాలి

▸▸ అదనపు కలెక్టర్‌కు ధర్మ సమాజ్ పార్టీ నాయకుల వినతి



అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని దామెర మండల కేంద్రంలో ఉన్న బాలసముద్రం ఆశ్రమ పాఠశాలలో వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వసతులు కల్పించాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు గురువారం జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మసమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ మేకల సుమన్ మాట్లాడుతూ.. ఆశ్రమ పాఠశాలలో ఉన్న 250 మంది విద్యార్థులకు నీటి సౌకర్యం సరిగా లేదని, నీటి సమస్యతో చర్మవ్యాధుల బారిన పడుతున్నారన్నారు. కనీసం విద్యార్థులకు వడ్డించే వంట మనుషులు కూడా లేకపోవడంతో విద్యార్థులతోనే వంట పాత్రలు, భోజన పాత్రలు మోయిస్తున్నారన్నారు. వార్డెన్ రాత్రి సమయంలో అందుబాటులో ఉండటం లేదని, అధునాతనమైన కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్‌కు వినపత్రం ఇచ్చిన వారిలో ధర్మసమాజ్ పార్టీ నాయకులు పొదిల సాయిబాబా, బరిగెల బాబు, కొత్తపెసోబు, పూరెళ్ల విష్ణు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించండి

▸▸ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



సెగ్రిగేషన్ యూనిట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్, సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : తడి, పొడి చెత్తను వేరుగా అందించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. హనుమకొండ మున్సిపల్ గెస్ట్‌హౌస్ సమీపంలో నిర్వహిస్తున్న సెగ్రిగేషన్ కంపోస్ట్ యూనిట్లను గురువారం బల్దియా సిబ్బందితో కలిసి పరిశీలించారు. పనులు సమదర్ధవంతంగా నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. నగర వ్యాప్తంగాశానిటేషన్ విధానాలను అవలంబించడానికి ప్రయోగాత్మకంగా హనుమకొండ పరిధిలోని 6, 49వ డివిజన్‌లను ఎంపిక చేశామన్నారు. తడి చెత్తను మున్సిపల్ గెస్ట్‌హౌస్ సమీపంలోని కంపోస్టు యూనిట్‌కు తరలించి ఎరువుగా మార్చడం, పొడి చెత్తను డీఆర్‌సీసీ కేంద్రాలకు తరలిస్తామన్నారు. ఈ ప్రక్రియ రెండు డివిజన్‌లలో ప్రయోగాత్మకంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, శానిటరి సూపర్‌వైజర్ నరేందర్ వర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శాంరాజు, పోలెపాక అనిల్‌కుమార్, సంపత్‌రెడ్డి, శ్రీనివాస్, నిరంజన్, వెంకన్నలతో పాటు ఐటీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాజు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు మృతి చెందిన ఘటన కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధి కోమటిపల్లి పెట్రోల్‌బంకు సమీపంలో గురువారం చోటు చేసుకుంది. కేయూసీ సబ్ ఇన్‌స్పెక్టర్ మాధవ్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామానికి చెందిన మాచర్ల రాజు హనుమకొండలోని ఓ ప్రైవేటు ల్యాబ్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గురువారం విధులు ముగించుకొని తిరిగి గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో కోమటిపల్లి పెట్రోల్ బంకు సమీపంలో అతడు నడుపుతున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడగా బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాధవ్ తెలిపారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా ట్రెజరీల్లో ఆమోదం పొంది ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సప్లిమెంటరీ బిల్లులు, మెడికల్, జీపీఎఫ్, పెన్షన్ తదితర బిల్లులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు ప్రభుత్వం చర్యలు తీసుకొని బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కిరణ్‌కుమార్, రవీందర్ రాజు, రాజు, మోజెస్, రామ్మోహన్ ఆచారి, ఢావూ పాల్గొన్నారు.

సీఏ పట్టా సాధించిన పొలోమీ నిఖిల్



వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో నిర్వహించిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) స్నాతకోత్సవంలో వరంగల్ నగరానికి చెందిన గంగిశెట్టి పొలోమి నిఖిల్ సీఏ పట్టాను సాధించారు. గురువారం ఐసీఏఐ అధ్యక్షుడు సీఏ రజత్‌కుమార్ చేతుల మీదుగా పొలోమి పట్టాను అందుకున్నారు. వరంగల్‌కు చెందిన ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ పీవి నారాయణరావు మార్గదర్శనంలో పొలోమి సీఏ పూర్తి చేసినట్లు తెలిపారు.

మాజీ మంత్రి పద్మారావుకు వినయభాస్కర్ పరామర్శ



హనుమకొండ టౌన్ , ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పద్మారావు గౌడ్ ఇటీవల స్వల్ప అనారోగ్యానికి గురికాగా, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ గురువారం హైదరాబాద్‌లో పలకరించి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలో ప్రజలకు మరింతగా సేవ చేయాలని వినయ్‌భాస్కర్ కాంక్షించారు.

అమ్మవారి ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు సిద్ధం

వరంగల్ కల్చరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పర్యాటకులు, భక్తుల సౌక ర్యార్థం భద్ర కాళి అమ్మ వారి ఆలయ పరిసర ప్రాంగణం మొత్తం చలువ పందిళ్లు వేశారు. గురువారం ప్రాంగణం మొత్తం పందిళ్లు వేయడంతో ఉత్సవాల కళ కనిపిస్తోంది. దర్శనానికి వచ్చే భక్తులు కూ ర్చునేందుకు వీలుగా క్యూలైన్లలో వెళ్లేవారు ఎండ వేడిమి తాకకుండా గేటు నుంచి గర్భాలయానికి వచ్చే ఆలయ పరిసర ప్రాంగణం భక్తులకు వేడితో కాలకుండా ఇబ్బందులు కాకుండా దేవస్థానం ఆధ్వర్యంలో చలువ పందిళ్లు ఏర్పాట్లు చేశారు.

11 కేవీ విద్యుత్ వైర్లు తెగి ప్రమాదం

- కేయూ క్యాంపస్‌లో కాలి బూడిదైన చెట్ల కొమ్మలు
- విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం





ప్రమాద స్థలంలో రిజిస్ట్రార్ రామచంద్రం, డీవో, తెగిపోయిన వైర్లు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో ఎన్పీడీసీఎల్ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ప్రమాదకరంగా మారింది. వర్సిటీ క్యాంపస్‌లో రుద్రమాంబ ఫిల్టర్ బెడ్‌కు విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్‌లైన్ తెగిపోయి గురువారం రాత్రి వర్సిటీలో ప్రమాదం జరిగింది. 11 కేవీ హైటల్టేజీ విద్యుత్ వైర్లు తెగిపోయి, షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. క్యాంపస్‌లోని చెట్లు, చెదారం కాలిబుడిదగా మారి పెద్దఎత్తున పొగ కమ్ముకుంది. ఆ సమయంలో విద్యార్థులు, వర్సిటీ సిబ్బంది ఎవ్వరూ విద్యుత్ వైర్ల వైపున లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, డెవలప్‌మెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎన్.వాసుదేవారెడ్డితో పాటు ఇతర అధికారులు ఘటన స్థలానికి వెళ్లారు. ప్రమాద వివరాలను హనుమకొండ విద్యుత్ ఉన్నతాధికారులకు తెలియజేశారు. ప్రమాద సంఘటనను పరిశీలించిన వారిలో వర్సిటీ ఎఫ్ఓ తోట రాజయ్య, డీవో కార్యాలయం సిబ్బంది ఉన్నారు.

రాజనీతి శాస్త్ర విద్యార్థులపై సమాజ గురుతర బాధ్యతలు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రాజనీతి శాస్త్ర విద్యార్థులపై సమాజాన్ని సన్మార్గంలో నడిపించే గురుతర బాధ్యతలున్నాయని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అన్నారు. గురువారం కేయూ రాజనీశాస్త్ర విభాగంలో విద్యార్థుల ప్రెషర్స్ పార్టీ సంబురాలు జరిగాయి. ఈ సందర్భంగా విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు, యువత చదువు ప్రాధాన్యతను గుర్తించాలని పిలుపునిచ్చారు. రాజనీతిశాస్త్ర గొప్పతనాన్ని అందరూ గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజనీతిశాస్త్ర బీవోఎస్ చైర్మన్ డాక్టర్ జి.కృష్ణయ్య, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ వి.నాగరాజుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అలరించారు.

పీహెచ్‌డీ అర్హతతోనే ప్రిన్సిపాల్ నియామకాలు చేయాలి

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలల్లో పీహెచ్‌డీ విద్యార్హత డిగ్రీలు పొందిన అభ్యర్థులకే ప్రిన్సిపాల్ పోస్టులను కేటాయించాలని కేయూ డాక్టరేట్ అసోసియేషన్(కేయూడీఏ) నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను తన చాంబర్‌లో కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా కుడా అధ్యక్షకార్యదర్శులు డాక్టర్ సూత్రాపు అనిల్, మద్దిరాల మోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ.. వర్సిటీ అనుబంధ కళాశాలల్లో ప్రిన్సిపాల్స్ నియామకాల్లో యూజీసీ నిబంధనల మేరకు డాక్టరేట్ క్వాలిఫికేషన్ ఉన్న అభ్యర్థులనే ప్రిన్సిపాల్‌గా నియమించాలని ఆదేశాలున్నాయని పేర్కొన్నారు. దీన్ని వర్సిటీ పరిధిలో కచ్చితంగా అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కుడా కార్యవర్గ సభ్యులు డాక్టర్‌బోడ వీరన్న, డాక్టర్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం

చివరి పరీక్షను ఇలా గెలుద్దాం!



హరేకృష్ణ

"జీవితంలోని ఆఖరి క్షణంలో చేసే ఆలోచన చివరి పరీక్షలాంటిది. ఈ చివరి పరీక్షకు జీవితాంతం సిద్ధం కావాలి. జీవితమంతా ఆ భగవత్తుణ్ణి స్మరించే సాధన చేయగలిగితే... మన ఆఖరి క్షణాల్లో రాసే ఆ చిట్ట చివరి పరీక్షలో తప్పకుండా ఉత్తీర్ణులం అవుతాం."

మనమందరం మన రోజువారీ జీవితాలలో తీరిక లేకుండా గడిపేస్తున్నాం. మనుగడకోసం చేసే ఈ పోరాటంలో మనం ఎన్నో కష్ట సుఖాలను ఎదుర్కొంటూ ఉంటాం. మన రోజువారీ విధులను నిర్వర్తిస్తూనే... భగవంతుడికి చేరువయ్యే మార్గాన్ని 'భగవద్గీత' బోధించింది. అదే విధంగా మనకు ఎన్నో పండుగలు, విశేషమైన ఉత్సవాలు ఉన్నాయి. వాటిని జరుపుకోవడం ద్వారా భగవన్నామస్మరణను మరింత ఎక్కువగా చేసుకోవచ్చు. భగవంతుణ్ణి, ఆయన దివ్య లీలల్లోని అంతరార్థాన్నీ పరిపూర్ణంగా అర్థం చేసుకున్నవారు మోక్షాన్ని పొందుతారని, భగవత్ సన్నిధానాన్ని చేరుకుంటారనీ పెద్దలు చెప్పారు. అటువంటి ఒక అవకాశమే శ్రీ వరాహ ద్వాదశి. ఇది శ్రీ వరాహస్వామిగా మహా విష్ణువు అవతరించిన రోజు.

వరాహస్వామి వాగ్దానం


శ్రీ వరాహావతార లీలను ప్రపంచవ్యాప్త హరేకృష్ణ ఉద్యమ సంస్థాపకాచార్యులైన శ్రీల ప్రభుపాదులు వివరిస్తూ... "సృష్టి ఆరంభం నుంచి దేవతలు, దైత్యులు అనే ఇరు వర్గాల వారు విశ్వంలోని లోకాలన్నిటినీ శాసించేవారు. భగవంతుడు ఏర్పరచిన ఈ సృష్టిలో నిర్దిష్ట నియమానుసారం... గ్రహాలన్నీ అంతరిక్షంలో తేలియాడుతూ ఉండేవి. వాటిలో కొన్ని జలాలతో నిండి ఉండగా, మిగిలిన సగం అసంఖ్యాకమైన గ్రహాలతో కూడిన లోకాలతో నిండి ఉండేది. ఈ గ్రహాలు కక్ష్యలో తిరిగే క్రమానికి అసురుడైన హిరణ్యాక్షుడు విఘాతం కలిగించాడు. దీనితో భూలోకం తన భారరహిత స్థితిని కోల్పోయి జలాలలోకి జారిపోయింది. ఆ సమయంలో... ఈ జగత్తుకు స్థితికారకుడైన మహా విష్ణువు... భీకరమైన సూకర రూపాన్ని ధరించి, తన దంతాలతో భూమండలాన్ని జలాల నుంచి పైకి ఎత్తి పట్టాడు. ఆ సందర్భంలో వరాహస్వామిని హిరణ్యాక్షుడు అడ్డగించబోగా... స్వామి తన దంతాలతో అతణ్ణి గుచ్చి సంహరించాడు. భగవంతుడి అవతారాలకు ఉన్న విశిష్టత ఇదే. అసాధారణమైన పరిస్థితుల్లోనే ఆయన అవతరిస్తాడు. మనుష్యుడి ఆలోచనకైనా అందని పరమాద్భుతమైన రీతిలో తన లీలలను ప్రదర్శిస్తాడు. అటువంటి భగవంతుణ్ణి సదా స్మరించుకోవడమే ముక్తికి మార్గం అని పురాణాలు చెబుతున్నాయి. మరి మేము ప్రతిరోజూ భగవన్నామ స్మరణ చేస్తున్నాం. కానీ జీవితంలోని ఆఖరి క్షణంలో దేవుణ్ణి స్మరించుకోలేని ప్రమాదకర పరిస్థితిలో ఉంటే ఎలా? అని కొందరు భక్తులకు సందేహం కలుగవచ్చు. "ఒకవేళ నా భక్తుడు మరణ సమయంలో దేహానికి కలిగే అవాంతరాల కారణంగా నన్ను స్మరించలేకపోతే... నేనే నా భక్తుణ్ణి స్మరించి, నా దివ్య ధామానికి తీసుకువెళ్తాను" అని 'వరాహ పురాణం'లో శ్రీవరాహస్వామి చేసిన వాగ్దానం... ఆ సందేహానికి సమాధానం ఇస్తుంది. వరాహ ద్వాదశి రోజున... వరాహమూర్తిని స్మరించాలి. హరేకృష్ణ మంత్రాన్ని జపించాలి. అన్నదానం, గోసేవలను నిర్వహించడం వల్ల స్వామి అనుగ్రహం కలుగుతుంది.

9న వరాహ ద్వాదశి

శాశ్వతమైన ఆనందం కోసం...

జీవితంలోని చిట్టచివరి క్షణంలో చేసే భగవన్నామ స్మరణ గురించి శ్రీకృష్ణుడు వివరించాడు. "ఏ వ్యక్తి తన చిట్ట చివరి క్షణంలో దేనినైతే తలుస్తాడో, దాని ఆధారంగానే ఆ వ్యక్తి తదుపరి జన్మ నిర్ణయం అవుతుంది. దేవతలను తలిస్తే దేవ లోకాన్ని చేరుతారు. తమ పూర్వీకులను తలిస్తే పితృలోకాలకు చేరుకుంటారు. శ్రీహరిని లేదా నారాయణుణ్ణి లేదా శ్రీకృష్ణుణ్ణి తలచుకుంటే... ఆ దేవాదిదేవుడి దివ్య ధామాన్ని తప్పకుండా చేరుకుంటారు" అని చెప్పాడు. భగవద్ధామం ఒక్కటే శాశ్వతమనీ, భౌతిక ప్రపంచంలోని మిగిలినవన్నీ తాత్కాలికమేననీ భగవద్గీత వివరిస్తోంది. శాశ్వతమైన ఆనందాన్ని పొందాలన్నదే అందరి ఆకాంక్ష. అయితే అది భగవద్ధామాన్ని చేరినప్పుడు మాత్రమే నెరవేరుతుంది. జీవితంలోని ఆఖరి క్షణంలో చేసే ఆలోచన చివరి పరీక్షలాంటిది. ఈ చివరి పరీక్షకు జీవితాంతం సిద్ధం కావాలి. జీవితమంతా ఆ భగవతుణ్ణి స్మరించే సాధన చేయగలిగితే... మన ఆఖరి క్షణాల్లో రాసే ఆ చిట్ట చివరి పరీక్షలో తప్పకుండా ఉత్తీర్ణులం అవుతాం.

శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984



మనసు ఏం చేస్తోందో గమనిస్తున్నారా?

విద్యను, సమాచారాన్ని పొందడానికి మనకు ఎన్నో మార్గాలు ఉన్నాయి. పాఠశాలకు, కళాశాలకు, విశ్వవిద్యాలయానికి వెళ్ళడం ద్వారా, గురువుల ద్వారా విద్యను సంపాదించగలం. వార్తా పత్రికల ద్వారా ఇతర మాధ్యమాల ద్వారా సమాచారం తెలుసుకోగలం. పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానాన్ని పొందగలం. ఇలా మనకు ఎన్నో మార్గాలు కనిపిస్తాయి. కానీ జ్ఞానం పొందాలంటే ఇలాంటి మార్గాల ద్వారా సాధ్యం కాదు. మన మనసులో ప్రస్తుతం ఏం జరుగుతోందో తెలుసుకోవడమే జ్ఞానం. కానీ మనసు గురించి అవగాహన చేసుకోవడానికి ఇతర మార్గాలేవీ దోహదపడవు.

ప్రతి క్షణం మీ మనసు ఏం చేస్తోందో, అక్కడ ఏం జరుగుతోందో మీరు గమనించారా? తరువాత జరగబోయేది ఏవిటో అది ఆలోచిస్తూ ఉంటుంది. అది గతానికి, భవిష్యత్తుకు మధ్య ఊగిలాడుతూ ఉంటుంది. గతంలో జరిగిన దాని గురించి విచారంగా, లేదా కోపంగా ఉంటుంది. లేదా భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతుంది. మనస్సుకు మరో ధోరణి కూడా ఉంది. అది: ప్రతికూలతను అంటిపెట్టుకొని ఉండడం. మన జీవితంలో పది సందర్భాలు, సంఘటనల్లో ఒకటి ప్రతికూలంగా జరిగితే... అనుకూలంగా జరిగినవాటిని మరచిపోతాం. ఆ ఒక్క ప్రతికూలమైన దాని గురించే ఆలోచిస్తూ ఉంటాం. ఈ ధోరణిని మార్చుకోవడమే మీకు మీరు చేసుకోగలిగే పెద్ద సహాయం. ఈ ధోరణి గురించి అర్థం చేసుకోవడం వల్ల మీ జీవితం మరింత సహజంగా, మరింత సరళంగా మారుతుంది. అంతర్గతమైన వికాసం కలుగుతుంది. నిజానికి మనం పుట్టినప్పుడు ఎంతో అమాయకంగా ఉంటాం. పరిణతి చెందుతున్నకొద్దీ, తెలివైనవారిగా మారుతున్న కొద్దీ ఆ అమాయకత్వాన్ని కోల్పోతాం. చివరకు కఠినంగా మారుతాం. దానివల్ల జీవితంలో



మనస్సుకు మరో ధోరణి కూడా ఉంది. అది: ప్రతికూలతను అంటిపెట్టుకొని ఉండడం. మన జీవితంలో పది సందర్భాలు, సంఘటనల్లో ఒకటి ప్రతికూలంగా జరిగితే... అనుకూలంగా జరిగినవాటిని మరచిపోతాం. ఆ ఒక్క ప్రతికూలమైన దాని గురించే ఆలోచిస్తూ ఉంటాం.

ఆనందం కోల్పోతాం. ఆ కాఠిన్యాన్ని విడిచిపెట్టండి. అందరిపట్ల, అన్నిటిపట్ల దయగా, ప్రేమగా ఉండండి. అప్పుడు జీవితం మరింత ఆనందదాయకంగా, మరింత సంతృప్తికరంగా, ఆసక్తికరంగా మారుతుంది. ఇదంతా మీ మనసును అవగాహన చేసుకున్నప్పుడు, జరుగుతుంది. అందుకోసం మనసు ఏం చేస్తోందో గమనించాలి. ప్రతికూలమైన విషయాల గురించి ఆలోచించడం మానేయాలి. సానుకూలమైన దృక్పథంతో జీవితాన్ని కొనసాగించాలి. అప్పుడు అంతా ఆనందమే!

• శ్రీశ్రీరవిశంకర్

సుభాషితం


ఫలితాలు ఇచ్చేది అదే!

నైవాకృతిః ఫలతి నైవ కులం న శీలం
విద్యాపి నైవ న చ యత్న కృతాపి సేవా
భాగ్యాని పూర్వతపసా ఖలు సంచితాని
కాలే ఫలంతి పురుషస్య యథైవ వృక్షాః..

జీవితంలో మంచి ఫలితాలు పొందడానికి పూర్వ పుణ్యాలే కారణమవుతాయని తన 'నీతి శతకం'లోని ఈ శ్లోకంలో భర్తృహరి వర్ణించాడు. దాన్ని...

రమ్యరూపంబు, విద్యయు, రాజసేవ
కులము శీలంబు జాలవు ఫల మొసంగ
బూర్వపుణ్య సంచిత భాగ్యములు ఫలించు
గాలమున బనసాది వృక్షముల కరణి...

అనే పద్యరూపంలో ఏనుగు లక్ష్మణకవి తెలుగువారికి అందించాడు.




భావం: అందమైన రూపం, ఉన్నతమైన విద్య, గొప్ప కులం, మంచి నడవడిక, అధికారంలో ఉన్నవారి ఆశ్రయం... ఇవేవీ మనిషికి గొప్ప ఫలితాలను ఎల్లప్పుడూ ఇవ్వలేవు. కొన్నిసార్లు వాటివల్ల ప్రయోజనం ఉండదు. పూర్వం చేసిన పుణ్యం వల్ల మాత్రమే కర్మ ఫలం లభిస్తుంది. చెట్లు నాటిన తరువాత... అవి పెరిగి పెద్దవై, పండ్లు కాయడానికి సమయం పడుతుంది. అలాగే తగిన కాలం వచ్చినప్పుడే పూర్వ పుణ్యాల వల్ల ప్రతిఫలం లభిస్తుంది. కాబట్టి ఎప్పుడూ పుణ్యకార్యాలు చేస్తూ ఉండాలి. వాటి వల్ల ఫలితం భవిష్యత్తులో తప్పకుండా ఉంటుంది.

సహజయోగ

సమతుల్యత సాధించాలంటే...

భూమికి అక్షం ఉంటుంది. భూమి చలనం దాని మీద ఆధారపడి జరుగుతుంది. అదే విధంగా మానవుడిని సమతుల్య స్థితిలో ఉంచే అక్షం (ఇరుసు)... సూక్ష్మ నాడీ వ్యవస్థలో అంతర్గతంగా ఉన్న సుషుమ్నా నాడి. ఇదే మనకు ఆధారం. ఇది మనలో మధ్యస్థంగా ఉండే నాడి. ఎవరిలో సుషుమ్నా నాడి సరైన రీతిలో ఉండదో... వారి శరీరంలోని వివిధ చక్రాలలో సమస్యలు, ఇబ్బందులు ఏర్పడతాయి. ఈ ఇరుసు పరిధిని దాటి కుడి పార్శ్వం వైపు మొగ్గినప్పుడు... వ్యక్తి తన అహంకారంతో సమస్యలను సృష్టించుకుంటాడు. ఎడమ ఎడమ పార్శ్వం వైపు మొగ్గు చూపినప్పుడు.. తన వినాశనాన్ని కొని తెచ్చుకుంటాడు. సుషుమ్నా నాడిలో ప్రవహిస్తున్న శక్తి... ముప్పావు వంతు చుట్టుకున్న కాగితంలా ఉంటుంది. దాని లోపలే బ్రహ్మనాడి ఉంటుంది. ఈ బ్రహ్మనాడి మామూలుగా అయితే చాలా సన్నగా.. వెంట్రుక వాసిలో ఉంటుంది. అటువంటి సన్నని బ్రహ్మనాడిలోంచీ ఇంకా సన్నటి పోగులా ఉండే కుండలినీ శక్తి ఊర్ధ్వముఖంగా పయనిస్తుంది. ఈ పోగు బాగా సన్నగా ఉన్నవారు పైకి చూడడానికి గంభీరంగా, ధైర్యంగా తెలివైనవారుగా, మంచివారుగా కనిపిస్తారు. కానీ అంతర్గతంగా ఆధ్యాత్మికమైన లోతు ఉండదు. ఏ వ్యక్తయినా ఆధ్యాత్మికంగా లోతులకు వెళ్ళగలిగినప్పుడు... అతని బ్రహ్మనాడి విశాలం అవుతుంది. దానిలో ప్రయాణించే కుండలినీ పోగులు కూడా వెడల్పుగానే ఉంటాయి. ఆధ్యాత్మికమైన లోతు ఉన్నవారికి వైఖరి చాలా సుందరంగా, మనోహరంగా ఉంటుంది. వారు అందరికీ ఆనందాన్ని పంచుతారు.



కాబట్టి మన సుషుమ్నా నాడిని దృఢంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఈ స్థితిని సాధించడానికి భక్తి శ్రద్ధలే అనువైన మార్గం. ముందు మీ జీవితం మీద మీకు శ్రద్ధ ఉండాలి. "ఈ జీవితంతో నేను ఏం చేస్తున్నాను? నేను జీవితాన్ని ఎలా వృథా చేస్తున్నాను? ఎందుకు వృథా చేస్తున్నాను? నా జీవితానికి పరమార్థం ఉండాలి కదా! ఆ పరమార్థాన్ని నేను నెరవేరుస్తున్నానా?" అనే ప్రశ్నలు మీరు వేసుకోవాలి. అప్పుడు మీ అహంకారంతో పోరాటం చేయడం చాలా సులువని మీరు అర్థమవుతుంది. ఎప్పుడయితే చిత్తం అంతర్గతంగా ప్రయాణం ప్రారంభిస్తుందో... అప్పుడు బ్రహ్మనాడి విస్తరించడం మొదలవుతుంది. ఆ తరువాత ఎలాంటి పరిస్థితులలోనైనా, ఎటువంటి స్థితిలోనైనా, ఎటువంటి జీవన విధానంలోనైనా మీరు సౌకర్యంగా ఉండేలా చేస్తుంది. కుండలినీ జాగృతి ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొంది సహజయోగ సాధన చేస్తున్నవారు ఈ స్థితిని సాధించగలరనీ, నిరంతర ధ్యాన సాధన ద్వారా ఈ స్థితిని సుస్థిరపరుచుకోగలరని శ్రీమాతాజీ నిర్మలాదేవి పలు సందర్భాలలో స్పష్టం చేశారు.

డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి,
సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



శాంతిపథంలో తొలి మెట్టు

చింతన



మనం చదువుకోవాలంటే బడికి వెళ్ళాలి. ఆడుకోవాలంటే ఆట వస్తువులు బజార్లో దొరుకుతాయి. ఇలా మనకు కావలసింది ఏదైనా మన దగ్గర లేదనే విషయాన్ని ప్రపంచం మనకు నేర్పుతుంది. శాంతి విషయంలోనూ ఇలాగే ఆలోచిస్తాం. కానీ అది ఎక్కడో బయట ఉండదు. మన లోపలే ఉంటుంది. ఇది మనం తెలుసుకోవలసిన అతి ముఖ్యమైన విషయం. శాంతి పథంలో ఇదే తొలిమెట్టు.

శాంతి మీలోనే ఉంది...

మీరు తొలి అడుగు వెయ్యవలసింది ముందుకు కాదనీ, వెనక్కి అనీ నేను చెప్పినప్పుడు... చాలా మంది 'ఎప్పుడూ ముందుకే అడుగు వెయ్యాలి కదా!' అని ఆలోచిస్తూ ఉంటారు. కానీ మనం ముందుకు కాదు, లోపలివైపు అడుగు వెయ్యాలి. ఎందుకంటే మీకు అవసరమైన శాంతి మీలోనే నిక్షిప్తం అయి ఉంది. ఇప్పుడు కూడా ఉంది. మీరు కోపంతో రగిలిపోతున్న సమయంలో కూడా ఉంటుంది. అలాగే మీరు దుఃఖంలో విలవిలలాడిపోతున్న సమయంలో, సుఖ సంతోషాలతో తులతూగుతున్న సమయంలో కూడా ఉంటుంది. ప్రపంచంలో ఎవరు ఎక్కడ ఉన్నా, కటిక పేదవారైనా, గొప్ప ఐశ్వర్యవంతులైనా ప్రతి ఒక్కరూ దాన్ని స్వయంగా అనుభూతి పొందవచ్చు.

అది అసాధ్యం కాదు...

ఎవరికో దాహంగా ఉందని తెలిసి... నేను నాలుగు గ్లాసుల నీరు ఇచ్చి వచ్చాను. "అతని దాహం తీరిపోయి ఉంటుందా?" అని ఎవరైనా అడిగితే... "నేను నాలుగు గ్లాసుల నీరు ఇచ్చి వచ్చాను, తప్పకుండా తీరిపోయి ఉంటుంది" అని చెబుతాను. కానీ ఆ వ్యక్తి నీరు తాగకుండా ఉంటే దాహం ఎలా తీరుతుంది? శాంతి విషయంలో కూడా ఇలాగే జరుగుతుంది. యుద్ధాలు జరగకపోతే శాంతి ఏర్పడుతుందని భావిస్తారు. కానీ శాంతిగా ఉన్నప్పుడు యుద్ధం ఎలా మొదలైంది? కాబట్టి ఏవైతే జరుగుతున్నాయో వాటన్నిటికీ కారణం... శాంతి లోపించడం. 'ఇంతమందిని శాంతిపథంలో నడిపించడం అసాధ్యం' అని మీకు అనిపించవచ్చు.

కానీ ఈ ప్రపంచంలో యాభైశాతం మంది శాంతి పథంలో అడుగు పెట్టినా... మిగిలిన వారిపై ఆ ప్రభావం తప్పకుండా ఉంటుంది. మీరు గడిపే ఏ క్షణమైన మళ్ళీ తిరిగిరాదని గుర్తించి, ప్రతి రోజునూ కాపాడుకోవాలి. వృథాగా గడిచిపోకుండా చూసుకోవాలి.

దేన్నీ వదిలెయ్యాల్సిన అవసరం లేదు...

మనకు లభించిన ఈ జీవితకాలంలోని ప్రతి క్షణంలో దాగిన జీవన మాధుర్యాన్ని, శాంతిని అనుభూతి చెందడం చాలా అవసరం. జీవితంలో ఈ చిన్న పని చేయలేకపోతే మానవ శరీరం లభించడం వల్ల ప్రయోజనం ఏమిటి? ఈ మాట వినగానే 'మేము మా సంసారాలను, ఇల్లు వాకిళ్ళను వదిలేసి వెళ్ళాలా?' అని కొందరు అడుగుతారు. మీరు అవేవీ వదిలెయ్యాల్సిన పని లేదు. మీకు ఉన్న అన్ని బాధ్యతలను చక్కగా నిర్వహించండి. వాటితోపాటు మీలో కొలువై ఉన్న ఆ భగవంతుణ్ణి అనుభూతి చెందే బాధ్యతను కూడా నెరవేర్చుకోమని చెబుతున్నాను. ఆ బాధ్యతను విస్మరించకండి. ఈ విషయాలన్నిటినీ కేవలం నమ్మితే సరిపోదు. అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి. మీరు జ్ఞానం స్వీకరించడానికి శ్రద్ధ ఉండాలి, ఆరాటం ఉండాలి. ఎందుకంటే మనిషిలో జిజ్ఞాస అనేది లేకపోతే విషయం అర్థం కాదు. మీలో ఉన్న శాంతి కోసం అన్వేషించండి. శాంతిని మీరు మీ అంతరంగంలోనే అనుభూతి చెందడం కోసం ప్రయత్నించండి.

• ప్రేమ్ రావత్
9246275220
www.premrawat.com

సద్బోధ

అంతా సమానమే

సమాజంలో కొన్ని ఆచారాలు, సంప్రదాయాలు, పద్ధతులు ఉంటాయి. సాధారణ ప్రజలు వాటిని సాధ్యమైనంతవరకూ ఆచరిస్తారు. వయస్సులో పెద్దవారు వస్తే చిన్నవారు లేచి నిలబడతారు. పండితులు వస్తే పామరులు లేచి నిలబడి నమస్కరిస్తారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వస్తే... ఇతరులు వారికి స్వాగతం పలికి, పూలదండలు వేసి, శాలువాలు కప్పి తమ గౌరవాన్ని చాటుతారు. కానీ జ్ఞానులు ఇలాంటి సాంఘిక ఆచారాలు పాటించడంలో శ్రద్ధ చూపించరు. పెద్దలు, పిన్నలు, ధనికులు, పేదలు, , పండితులు, పామరులు, రాజులు, సామాన్యులు... ఇలా అందరిపట్లా సమభావమే కనబరుస్తారు. వారికి అణకువ ఉండదు, అహంకారం కూడా ఉండదు. సమత్వ గుణం వారిలో తొణికిసలాడుతూ ఉంటుంది. తమలో లేని అణకువను, నమ్రతను కృత్రిమంగా తెచ్చిపెట్టుకొని నటించరు. తమకు ఏది చేయాలని తోస్తే అది చేస్తారు. "నాకు అణకువ మీద విశ్వాసం లేదు. నేను సమదర్శిత్వాన్ని నమ్ముతాను" అన్నారు స్వామి వివేకానంద. అలాంటి వ్యక్తి లావోట్జూ. చైనా తత్త్వవేత్తలలో కన్ఫ్యూసియస్ ప్రముఖుడు. అతను అన్ని మర్యాదలు, ఆచారాలు, పద్ధతులు తెలిసినవాడు. ప్రజలందరూ లావోట్జూ గురించి గొప్పగా చెప్పుకోవడం అతను విన్నాడు. ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఉన్న లావోట్జూను



వెతుక్కుంటూ వెళ్ళి కలిశాడు. ప్రశాంతంగా కూర్చొని ఉన్న లావోట్జూతో "నేను కన్ఫ్యూసియస్‌ని. మీతో కొన్ని విషయాలు చర్చించాలని వచ్చాను" అన్నాడు. తన గొప్పతనం గురించి లావోట్జూ విని ఉంటాడనీ, తను ఎవరో చెప్పిన వెంటనే లేచి నిలబడతాడనీ ఊహించాడు. కానీ లావోట్జూ లేచి నిలబడలేదు.

అప్పుడు కన్ఫ్యూసియస్ "నేను నీకన్నా వయసులో పెద్దవాణ్ణి. పాండిత్యంలో నిన్ను మించినవాణ్ణి. లేచి నిలబడాలనే మర్యాద కూడా నీకు తెలీదా"? అన్నాడు కోపంగా.

లావోట్జూ గట్టిగా నవ్వి "నాకన్నా ఎవరూ పెద్దవారూ లేరు, చిన్నవారూ లేరు. 'నేను', 'పెద్దవాణ్ణి' అనే అహంకారాన్ని పక్కన పెట్టి కూర్చో, మాట్లాడుకొందాం" అన్నాడు.

కన్ఫ్యూసియస్‌కు కనువిప్పు కలిగింది. తనకు ఉన్నది ఉత్త పాండిత్యమేననీ, లావోట్జూకు ఉన్నది అనుభవ జ్ఞానమనీ, ఆ జ్ఞానం ముందు తన మేధస్సు, పాండిత్యం నిర్జీవ పదార్థాలనీ తెలిసివచ్చింది. లావోట్జూ తను ఊహించలేనంత ఉన్నతుడని గ్రహించాడు. అతనికి నమస్కరించి, వెనుతిరిగి వెళ్ళిపోయాడు.

• రాచమడుగు శ్రీనివాసులు


గీతాసారం

స్థిరమైన బుద్ధి

మన జీవిత ప్రయాణంలో మనం ఎన్నో విషయాలను వింటూ ఉంటాం. వాటిలో ఒకే అంశం గురించి విరుద్ధమైన అభిప్రాయాలు ఉంటాయి. ఇది మనకు కలవరపాటు కలిగిస్తాయి. వార్తలు కావచ్చు, ఇతరుల అనుభవాలు కావచ్చు, నమ్మకాలు కావచ్చు. వాటి మీద వివిధ అభిప్రాయాలు, వాదనలు విన్నప్పుడు కూడా మన బుద్ధి స్థిరంగా ఉన్నప్పుడే అత్యున్నతమైన యోగ స్థితిని పొందుతామని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు బోధించాడు. దీనిలోని అంతరార్థాన్ని అవగాహన చేసుకోవడానికి చెట్టు సరైన ఉదాహరణ. చెట్టు పైభాగం మనకు కనిపిస్తుంది. దాని కింది భాగం వేర్ల మూల వ్యవస్థతో కూడి ఉంటుంది. అది బయటకు కనిపించదు. పైభాగం తీవ్రమైన గాలులకు ఊగుతూ ఉంటుంది. కానీ దానివల్ల వేర్ల వ్యవస్థ ప్రభావితం కాదు. ఎగువ భాగం బాహ్య శక్తుల ప్రభావంతో ఊగిపోతూ ఉంటే... దిగువ భాగం నిశ్చలంగా, సమాధి స్థితిలో ఉన్నట్టు ఉంటుంది. అది స్థిరంగా ఉడడంతోపాటు మొత్తం చెట్టుకు పోషకాహారాన్ని అందించే బాధ్యతను నిర్వహిస్తుంది. బాహ్యభాగం ఊగిసలాడుతూ... అంతర్గతంగా నిశ్చలంగా ఉండడమే చెట్టుకు యోగ స్థితి.



అజ్ఞాన స్థితిలో ఉన్నప్పుడు మన బుద్ధి చంచలంగా ఉంటుంది. అది బయటి విషయాల ప్రభావానికి గురై దానంతట అదే ఊగిసలాడుతూ ఉంటుంది. తాత్కాలికమైన స్పందనలు, ఉద్వేగాలు, కోపాల రూపంలో ఈ ఊగిసలాట మన నుంచి బయటకు వస్తుంది. మన జీవితాలను సమస్యాత్మకం చేస్తుంది. మన వ్యక్తిగత జీవితాలనే కాదు, మన కుటుంబ సభ్యుల జీవితాలను, మనం పని చేసే చోట తోటి వారి జీవితాలను కూడా ఇది సమస్యాత్మకంగా మారుస్తుంది. కొందరు ఈ ఊగిసలాటను అణచివెయ్యడం కోసం ముఖానికి ఒక ముసుగు తొడుక్కుంటారు. అందరిముందూ ధైర్యంగా, ఆహ్లాదంగా ఉన్నట్టు ప్రవర్తిస్తారు. కానీ ఇది ఎక్కువకాలం సాగదు. ఈ బాహ్యమైన ఊగిసలాటలు అనిత్యమైనవని తెలుసుకొని... నిశ్చలంగా ఉన్న అంతరాత్మను చేరుకోవడమే దీనికి పరిష్కారమని శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు.



కె. శివప్రసాద్
ఐఏఎస్







చిత్రజ్యోతి
SINCE 1965

అంచనాలకు మించి ఆశ్చర్యపరుస్తుంది

- నాగ చైతన్య



అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా నటించిన చిత్రం 'తండేల్'. సాయిపల్లవి కథానాయిక. చందు మొండేటి దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీవాసు నిర్మించారు. నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నాగ చైతన్య మాట్లాడుతూ 'మేమంతా సినిమా చూశాం. చాలా సంతోషంగా ఉన్నాం. చివరి ముప్పై నిమిషాలు సినిమా పీక్స్‌లో ఉంటుంది. అంచనాలకు మించి ఆశ్చర్యపరుస్తుంది. ఈ పాలి యేట గురితప్పలేదు. రేపొద్దున రాజులమ్మ జాతరే' అని అన్నారు. నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ 'చందు సినిమాను అద్భుతంగా తీర్చి దిద్దారు' అని చెప్పారు. చందు మొండేటి మాట్లాడుతూ 'ప్రేమికుల ఎడబాటు, తొమ్మిది నెలలు ఓ మనిషి కోసం ఎదురు చూపు, ఆ మనిషి తనకోసం వస్తాడనే నమ్మకం... ఇలా చాలా బ్యూటీఫుల్ ఎమోషన్స్ ఈ సినిమాలో ఉన్నాయి' అని అన్నారు. నిర్మాత బన్నీవాసు మాట్లాడుతూ 'పాకిస్థాన్ సీక్వెన్స్ కోసం డైరెక్టర్ బాగా రీసెర్చ్ చేశారు' అని చెప్పారు.

లైలా గెటప్‌కు రెండు గంటలు పట్టేది

-విశ్వక్ సేన్



విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'లైలా'. ఇందులో ఆయన లేడీ గెటప్‌లో కనిపించనున్నారని తెలిసిందే. రామ్‌నారాయణ్ దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మించారు. ఆకాంక్ష శర్మ హీరోయిన్. ఈ నెల 14న ప్రేమికుల రోజున సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం ట్రైలర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో హీరో విష్వక్ సేన్ మాట్లాడుతూ "ఇందులో నేను లేడీ గెటప్‌లో కనిపించేది మిమ్మల్ని నవ్వించడానికే. ఇందులోని 'లైలా' గెటప్‌లో సిద్ధమవ్వడానికి ప్రతీ రోజూ రెండు గంటలు పట్టేది. ఇదొక విభిన్న తరహా చిత్రం. త్వరలోనే 'అటక్ పటక్' సాంగ్ విడుదలవుతుంది. నేనే ఆ పాటను రాశాను" అని అన్నారు. "పూర్తి వినోదాత్మక చిత్రమిది. కచ్చితంగా మీ అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది. విశ్వక్ పోషించిన రెండు పాత్రలు ఆకట్టుకుంటాయి" అని దర్శకుడు రామ్‌నారాయణ్ చెప్పారు.

ఓ ఇంటి కథ



'ఇది మన ఇంటి కథ. ఈ ఇంట్లోనే చిన్న చిన్న కథలు చాలా ఉన్నాయి. ఇది మసాలా డబ్బా కాదు.. అమ్మగారి చిన్న బ్యాంక్. ఇది నాన్న గారి సెంటిమెంట్ బీరువా' అంటూ హీరో సిద్దార్థ్ వాయిస్‌తో మొదలైన '3 బీహెచ్‌కె' చిత్రం టీజర్ ఆకట్టుకుంటోంది. సిద్దార్థ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో అరుణ్ విశ్వ నిర్మిస్తున్నారు. శ్రీగణేశ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శరత్‌కుమార్, దేవయాని, యోగిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే అంశాలతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం వేసవిలో విడుదల కానుంది.

ఇకపై ప్రతీ ఏడాది వేడుక నిర్వహిస్తాం

భరత్ భూషణ్



ఇకపై ప్రతీ ఏడాది ఫిబ్రవరి 6న తెలుగు సినిమా పుట్టినరోజు వేడుకలు నిర్వహించాలని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయించింది. అలాగే ప్రతీ ఏడాది ఉత్తమ చిత్రాలతో పాటు నటీనటులకు కూడా పురస్కారాలను ఆ రోజున ఇవ్వనుంది. తెలుగు సినిమా పుట్టినరోజు వేడుకల్లో భాగంగా నటీనటుల ఇళ్ళతో పాటు రాష్ట్రంలోని థియేటర్లలో తెలుగు సినిమా జెండా ఎగురవేయాలని తీర్మానించుకుంది. జెండా తయారీ బాధ్యతను పరుచూరి గోపాలకృష్ణకు అప్పగించింది. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రెసిడెంట్ భరత్‌భూషణ్ మాట్లాడుతూ "ఫిల్మ్ ఛాంబర్ నుంచి ఈ వేడుక చేయడం ఇదే తొలిసారి. ఇక నుంచి ప్రతీ సంవత్సరం ఘనంగా నిర్వహిస్తాం. పాత తరం కళాకారులను సన్మానిస్తాం" అని అన్నారు. "1932లో హెచ్.ఎమ్.రెడ్డి దర్శకత్వంలో తొలి తెలుగు సినిమా 'భక్త ప్రహ్లాద' ఇదే రోజున విడుదలైంది. ఈ సందర్భంగానే ఈ వేడుకను ఫిబ్రవరి 6నే జరపాలని నిర్ణయించుకున్నాం" అని నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ చెప్పారు. "కాస్త ఆలస్యమైనా, ఈ నిర్ణయం తీసుకున్నందుకు సంతోషంగా ఉంది" అని సీనియర్ నటుడు, నిర్మాత మురళీ మోహన్ తెలిపారు.

మరోసారి భన్సాలీతో హృతిక్?



హీరోగా తన రెండు దశాబ్దాల ప్రయాణంలో అభిమానుల హృదయాల్లో చెరగని ముద్రవేశారు హృతిక్ రోషన్. ఇటీవలే నెట్‌ఫ్లిక్స్‌లో వచ్చిన డాక్యుమెంటరీ సిరీస్ 'ది రోషన్స్'లో ఆయన నట ప్రస్థానాన్ని ప్రేక్షకుల ముందు ఆవిష్కరించారు మేకర్స్. ప్రస్తుతం వార్ 2 చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు హృతిక్ రోషన్. దీని తర్వాత ఆయన 'క్రిష్ 4'చిత్రం చేస్తారని ప్రకటించారు. అయితే బడ్జెట్ పరిమితుల కారణంగా ఈ సినిమా చిత్రీకరణ వాయిదా వేస్తున్నట్లు రాకేశ్ రోషన్ ప్రకటించారు. దీంతో హృతిక్ నటించబోయే తదుపరి చిత్రం ఏమై ఉంటుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో హృతిక్ రోషన్ ఓ చిత్రం చేయబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. గ్రాండియర్ చిత్రాలకు పెట్టింది పేరు అయిన భన్సాలీ ఈ చిత్రాన్ని కూడా చారిత్రక నేపథ్యం ఉన్న కథతో తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. లైన్ బాగా నచ్చడం, ఇప్పుడు చారిత్రక నేపథ్యంలో వస్తున్న చిత్రాలకు ఆదరణ ఉండడంతో హృతిక్ కూడా అంగీకరించినట్టు టాక్. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.





బ్రైట్‌కామ్ గ్రూప్‌నకు సెబీ షాక్

రూ.34 కోట్ల భారీ జరిమానా

కంపెనీ ప్రమోటర్లపై ఐదేళ్ల పాటు నిషేధం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వాటాదారులను నిండా ముంచిన హైదరాబాద్ కంపెనీ బ్రైట్‌కామ్ గ్రూప్ లిమిటెడ్ (బీజీఎల్)కు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ పెద్ద షాకిచ్చింది. ఈ కంపెనీపైన, కంపెనీ ప్రమోటర్లు, ఇతరులపై రూ.34 కోట్ల భారీ జరిమానా విధించింది. ఇందులో కంపెనీ ప్రధాన ప్రమోటర్లు ఎం సురేశ్ కుమార్ రెడ్డి, కంచర్ల విజయ్ చెరో రూ.15 కోట్ల చొప్పున జరిమానా చెల్లించాలని ఆదేశించింది. దీనికి తోడు వీరిద్దరు ఐదేళ్ల పాటు సెక్యూరిటీస్ మార్కెట్లో పాల్గొనకుండా వేటు వేసింది. అంతేకాకుండా వీరిద్దరూ ఏ కంపెనీలోగానీ, సెబీ వద్ద నమోదైన సంస్థల్లోగానీ ఐదేళ్ల పాటు కీలక మేనేజ్‌మెంట్ పదవులు చేపట్టకూడదని స్పష్టం చేసింది. దీనికి తోడు కంపెనీ ఇతర డైరెక్టర్లు వై శ్రీనివాస రావుపై రూ.2 కోట్లు, ఎర్రదొడ్డి రమేష్ రెడ్డి, బీజీఎల్‌పై చెరో రూ.కోటి చొప్పున జరిమానా విధించింది. తప్పుడు రికార్డుల ద్వారా లేని టర్నోవర్, లాభాలు ఉన్నట్టు చూపి వీరు కంపెనీ షేర్ల విలువను భారీగా పెంచి, తమ వాటా షేర్లు అమ్ముకుని మదుపరులను నిండా ముంచినట్లు తేలడంతో సెబీ ఈ చర్య తీసుకుంది.

ఎస్‌బీఐ లాభం రూ.16,891 కోట్లు

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ నికర లాభం రూ.16,891 కోట్లుగా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి ఆర్జించిన రూ.9,164 కోట్ల లాభంతో పోలిస్తే 84 శాతం వృద్ధి కనబరిచింది. 2024-25లో సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో నమోదైన రూ.18,331 కోట్ల లాభంతో పోలిస్తే మాత్రం భారీగా తగ్గింది. మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈ క్యూ3లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) వార్షిక ప్రాతిపదికన 4 శాతం పెరిగి రూ.41,446 కోట్లకు చేరుకుంది. ఇదే కాలానికి బ్యాంక్ రుణాలు దాదాపు 14 శాతం వృద్ధి చెంది రూ.40.68 లక్షల కోట్లకు చేరినప్పటికీ, నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) మాత్రం 0.19 శాతం తగ్గుదలతో 3.15 శాతానికి పరిమితమైంది.



- డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో బ్యాంక్ డిపాజిట్లు 9.81 శాతం వృద్ధితో రూ.52.3 లక్షల కోట్లకు పెరిగాయి. అందులో దేశీయ బ్రాంచీల్లోని కరెంట్ అకౌంట్, సేవింగ్ అకౌంట్ల (కాసా) డిపాజిట్లు 4.46 శాతం పెరిగి రూ.19.65 లక్షల కోట్లకు చేరాయి.
- "కస్టమర్ల ప్రాధాన్యాలు మారడంతో సమీక్ష కాలానికి బ్యాంక్ నికర వడ్డీ మార్జిన్ 3.15 శాతానికి తగ్గింది. కస్టమర్లు పొదుపు ఖాతాల కంటే అధిక వడ్డీ ఆదాయం అందించే ఎఫ్‌డీల్లో సొమ్ము జమ చేస్తున్నారు. అయితే, మార్జిన్ 3 శాతం కంటే తగ్గదు. గత త్రైమాసికంలో మొత్తం డిపాజిట్లలో 39.2 శాతానికి తగ్గిన కాసా అకౌంట్ల వాటా మళ్లీ పెంచడం కష్టమే" అని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు.
- ఆస్తుల నాణ్యత విషయానికొస్తే, డిసెంబరు చివరి నాటికి బ్యాంక్ మొండి బకాయిలు లేదా స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ) 2.07 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 0.53 శాతానికి జారుకున్నాయి. ఈ క్యూ3లో కొత్త రూ.3,823 కోట్ల రుణాలు మొండి పద్దులుగా మారాయని బ్యాంక్ తెలిపింది.

10 శాతం తగ్గిన అరబిందో ఫార్మా లాభం

రూ.846 కోట్లుగా నమోదు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో అరబిందో ఫార్మా నికర లాభం 10 శాతం క్షీణించి రూ.846 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నికర లాభం రూ.940 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం 8.5 శాతం వృద్ధి చెంది రూ.7,979 కోట్లుగా నమోదైంది. ఈ కాలంలో అమెరికా ఫార్ములేషన్స్ వ్యాపారం 2.3 శాతం తగ్గుదలతో రూ.3,671 కోట్లుగా ఉన్నట్లు కంపెనీ తెలిపింది. మరోవైపు యూరప్ వ్యాపారం మాత్రం 22.7 శాతం వృద్ధితో రూ.2,121 కోట్లుగా ఉన్నట్లు పేర్కొంది. కాగా వర్ధమాన మార్కెట్లలో కూడా ఆదాయం 39.3 శాతం వృద్ధి చెంది రూ.873 కోట్లుగా నమోదైనట్లు తెలిపింది. సమీక్షా కాలంలో ఆర్ అండ్ డీ కోసం రూ.450 కోట్లు వెచ్చించినట్లు అరబిందో వెల్లడించింది. మొత్తం రెవెన్యూలో ఇది 5.6 శాతం.



మార్కెట్లోకి రోల్స్ రాయిస్ ఘోస్ట్ సిరీస్ 2

ప్రారంభ ధర రూ.8.95 కోట్లు

లగ్జరీ కార్ల దిగ్గజం రోల్స్-రాయిస్.. భారత మార్కెట్లో ఘోస్ట్ సిరీస్ 2 కార్లను ప్రవేశపెట్టింది. ఈ కారు ఎక్స్‌షోరూమ్ ప్రారంభ ధర రూ8.95 కోట్లు. ఘోస్ట్ ఎక్స్‌టెండెడ్ సిరీస్ ధర రూ.10.19 కోట్లు కాగా బ్లాక్ బ్యాడ్జ్ ఘోస్ట్ సిరీస్ 2 ధర రూ.10.52 కోట్లు. చెన్నై,ఢిల్లీ షోరూమ్‌లలో మాత్రమే ఈ కారుకు ఆర్డర్లు స్వీకరించనున్నట్టు రోల్స్-రాయిస్ ప్రకటించింది.

ఎయిర్‌టెల్ లాభం ఐదింతలు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో భారతి ఎయిర్‌టెల్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన ఐదింతలకు పైగా పెరిగి రూ.16,134.6 కోట్లకు చేరుకుంది. మొబైల్ టవర్ల నిర్వహణ కంపెనీ ఇండస్ టవర్స్ వ్యాపార కన్సాలిడేషన్ గత నవంబరు నుంచి అమలులోకి రావడంతో పాటు మొబైల్ చార్జీల పెంపు కంపెనీ లాభాల వృద్ధికి దోహదపడింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.2,876.4 కోట్లుగా నమోదైంది. క్యూ3లో రూ.45,129.3 కోట్ల ఆదాయాన్ని గడించింది. 2023-24 క్యూ3లో నమోదైన రూ.37,899.5 కోట్ల రెవెన్యూతో పోలిస్తే 19 శాతం వృద్ధి కనబరిచింది. కాగా, ఈ క్యూ3లో కంపెనీకి ఒక్కో వినియోగదారు నుంచి లభించిన సగటు ఆదాయం (ఆర్పు) రూ.245కు పెరిగింది.

జెప్టోతో స్కోడా జట్టు

టెస్ట్‌డ్రైవ్‌కు 10 నిమిషాల్లోనే కైలాక్ కారు

స్కోడా కంపెనీ ఇటీవల మార్కెట్లో విడుదల చేసిన కైలాక్ కారు టెస్ట్ డ్రైవ్ కోసం జెప్టోతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం కింద జెప్టో కంపెనీ ఆసక్తి చూపిన కస్టమర్ల ఇంటి ముంగిటికి 10 నిమిషాల వ్యవధిలోనే కారును టెస్ట్‌డ్రైవ్‌కు తెస్తుంది. ఆసక్తి గల కస్టమర్ల కోసం జెప్టో తమ యాప్‌పై "10 నిమిషాల్లో టెస్ట్ డ్రైవ్" అనే ఒక టాబ్ ఏర్పాటు చేస్తుంది. చాలా మంది కస్టమర్లు 10 నిమిషాల్లోనే కారు డెలివరీ అని పొరపాటు పడుతున్నారని, ఇది కేవలం టెస్ట్‌డ్రైవ్ కోసమేనని జెప్టో సీఈఓ ఆదిత్ పలీచా స్పష్టం చేశారు.

ఎన్‌సీసీ లాభంలో క్షీణత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డిసెంబరుతో ముగిసిన తృతీయ త్రైమాసికంలో ఎన్‌సీసీ లిమిటెడ్.. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.5,382.86 కోట్ల ఆదాయం పై రూ.193.18 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.220.65 కోట్లుగా ఉండగా ఆదాయం రూ.5,287.74 కోట్లుగా ఉంది. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.4,719.75 కోట్ల ఆదాయంపై రూ.185.40 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి గాను రూ.16,165.55 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.566.06 కోట్ల నికర లాభాన్ని సాధించింది. కాగా డిసెంబరు ముగిసే నాటికి కంపెనీ ఆర్డర్ బుక్ రూ.55,548 కోట్లుగా ఉంది.

కిమ్స్ హాస్పిటల్స్ ఆదాయం రూ.790 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హాస్పిటల్స్) డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.790 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.93 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.77 కోట్లుగా ఉండగా స్థూల ఆదాయం 29.7 శాతం వృద్ధి చెందింది. డిసెంబరు త్రైమాసికం ముగిసే నాటికి కంపెనీ వద్ద రూ.112 కోట్ల నగదు, అందుకు సమానమైన నిల్వలు ఉన్నాయి. సీజనల్‌గా డిసెంబరు త్రైమాసికం అంతగా మెరుగ్గా ఉండకపోయినప్పటికీ నిర్వహణపరంగా సామర్థ్యాలను పెంచుకోవటంపై దృష్టి పెట్టడంతో మంచి ఫలితాలను నమోదు చేయగలిగినట్లు కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ బీ భాస్కర్ రావు తెలిపారు. కాగా సంస్థకు చెందిన అన్ని యూనిట్ల సహకారంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత లక్ష్యాలను అందుకుంటామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఎన్ఎండీసీ లాభంలో 30 శాతం వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.1,944 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.1,492 కోట్లు)తో పోల్చితే లాభం 30 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా 21 శాతం వృద్ధితో రూ.5,410 కోట్ల నుంచి రూ.6,531 కోట్లకు చేరుకుంది. ఈ కాలంలో ముడి ఇనుప ఖనిజ ఉత్పత్తి 9 శాతం పెరిగి 1.32 కోట్ల టన్నులకు చేరుకుందని ఎన్ఎండీసీ పేర్కొంది. కాగా కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన కంపెనీ రూ.6,942.92 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.1,896.66 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ కొన్ని సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ వృద్ధి పథంలోనే సాగుతూ వస్తోందని ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. దేశీయంగా ముడి ఇనుము, స్టీల్‌కు డిమాండ్ గణనీయంగా పెరుగుతూ వస్తోందన్నారు.

మార్కెట్లో లాభాల స్వీకరణ

213 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్

ముంబై: ఆర్‌బీఐ ద్రవ్యపరపతి సమీక్షకు ముందు అప్రమత్తతతో ఈక్విటీ మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోవడమూ మార్కెట్‌ను కుంగదీసింది. గురువారం లాభాల్లో ట్రేడింగ్ ప్రారంభించిన సెన్సెక్స్.. తొలి గంటలోనే నష్టాల్లోకి మళ్లింది. ఒక దశలో 427 పాయింట్లు క్షీణించిన సూచీ.. చివరికి 213.12 పాయింట్ల నష్టంతో 78,058.16 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 92.95 పాయింట్లు కోల్పోయి 23,603.35 వద్దకు జారుకుంది.

12 నుంచి హెక్సావేర్ టెక్నాలజీస్ ఐపీఓ: ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం కార్లైల్ గ్రూప్ పెట్టుబడులు కలిగిన మధ్య స్థాయి ఐటీ కంపెనీ హెక్సావేర్ టెక్నాలజీస్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 12న ప్రారంభమై 14న ముగియనుంది. ఐపీఓలో భాగంగా షేర్ల విక్రయ ధరల శ్రేణిని కంపెనీ రూ.674-708గా నిర్ణయించింది.

మరో రికార్డు కనిష్ఠానికి రూపాయి: భారత కరెన్సీ సరికొత్త రికార్డు కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 16 పైసలు క్షీణించి రూ.87.59 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడంతో పాటు డొనాల్డ్ ట్రంప్ సుంకాల దెబ్బతో అంతర్జాతీయ వాణిజ్య మార్కెట్లో పెరిగిన అనిశ్చితి రూపాయి క్షీణతకు కారణమవుతున్నాయని ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి.


- మేనేజ్‌మెంట్, టాలెంట్ మొబిలిటీ ప్లాట్‌ఫామ్ సంస్థ ఎడ్జ్‌ను చేజిక్కించుకున్నట్లు హెచ్ఆర్ సంస్థ ఫినోమ్ ప్రకటించింది. అయితే డీల్ విలువను మాత్రం కంపెనీ వెల్లడించలేదు. గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ (జీసీసీ) సహా ప్రొఫెషనల్ సర్వీసెస్ పరిశ్రమ కోసం ఇంటలిజెన్స్ సొల్యూషన్స్ అందించేందుకు ఈ కొనుగోలు దోహదపడుతుందని ఫినోమ్ తెలిపింది. కాగా వచ్చే రెండేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించటంతో పాటు ప్రస్తుతమున్న హైదరాబాద్, వైజాగ్, బెంగళూరు కేంద్రాల్లో ఉద్యోగుల సంఖ్యను రెండింతలు పెంచాలని చూస్తున్నట్లు పేర్కొంది.
- ఎంటార్ టెక్నాలజీస్.. క్లీన్ ఎనర్జీ (ఫ్యూయల్ సెల్స్, సివిల్ న్యూక్లియర్ పవర్), ఏరోస్పేస్, స్పేస్ విభాగంలోని సంస్థల నుంచి రూ.200 కోట్ల విలువైన ఆర్డర్లను చేజిక్కించుకున్నట్లు వెల్లడించింది. క్లీన్ ఎనర్జీలోని బ్లూమ్ ఎనర్జీ, ఫ్లూయెన్స్ సహా ఇస్రో, ఏరోస్పేస్ విభాగంలోని బహుళ జాతి సంస్థల నుంచి ఈ ఆర్డర్లను దక్కించుకున్నట్లు తెలిపింది. గడిచిన రెండు మూడేళ్ల కాలంలో క్లీన్ ఎనర్జీ, స్పేస్ వర్టికల్స్ విభాగంలోని సంస్థల నుంచి ప్రస్తుత, కొత్త కస్టమర్ల నుంచి ఆర్డర్లను అందుకున్నట్లు కంపెనీ తెలిపింది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి సివిల్ న్యూక్లియర్ పవర్‌లో మంచి ఆర్డర్లు అందుకోవచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపింది.
- గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ కేంద్రంగా ఉన్న అర్థ భారత్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) అశ్వినీ సావిర్కార్.. ఐసీఏఐ నుంచి చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ) ఉమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డును గెలుచుకున్నారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ నుంచి అశ్వినీ ఈ అవార్డును అందుకున్నారు.
- ఫిలిప్పీన్స్‌లో నెఫ్రోప్లస్ తన కార్యకలాపాలను మరింతగా విస్తరించింది. విస్తరణలో భాగంగా కొత్తగా ఏడు డయాలిసిస్ క్లినిక్స్‌ను కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. తాజా కొనుగోళ్లతో ఫిలిప్పీన్స్‌లో నెఫ్రోప్లస్ నిర్వహిస్తున్న క్లినిక్స్ సంఖ్య 36కి చేరింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	500
వరంగల్	442	గోదావరి	452
చిత్తూరు	493	విశాఖపట్నం	470
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	103	విజయవాడ	119
వరంగల్	103	గుంటూరు	114
కరీంనగర్	103	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	92
కర్నూలు	103	నెల్లూరు	97
విశాఖపట్నం	111	అనంతపురం	97
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	86,510 ▲	79,300 ▲	1,07,000 ▲
విజయవాడ	87,500 ▲	82,500 ▲	97,500 ▼
విశాఖపట్నం	84,860 ▲	77,790 ▲	95,770 ▼
రాజమండ్రి	86,510 ▲	79,300 ▲	99,000 ▲
ప్రొద్దుటూరు	85,400 ▲	79,910 ▲	96,500 ▲
ముంబై	84,613 ▼	77,506 ▼	94,762 ▼

అలవోకగా ఆడేశారు..

గిల్, శ్రేయాస్, అక్షర్ హాఫ్ సెంచరీలు

భారత్ ఘనవిజయం

జడేజా, రాణాలకు మూడేసి వికెట్లు

తొలి వన్డేలో ఇంగ్లండ్ చిత్తు



గిల్ (87)

జడేజా (3/26)



శ్రేయాస్ (59)



హర్షిత్ రాణా (3/53)

నాగ్‌పూర్: ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను కూడా టీమిండియా అదిరే విజయంతో ఆరంభించింది. వెటరన్ జడేజా (3/26)తో పాటు అరంగేట్ర పేసర్ హర్షిత్ రాణా (3/53) బౌలింగ్‌లో ఇంగ్లండ్‌ను కట్టడి చేయగా.. ఆ తర్వాత ఛేదనలో వైస్ కెప్టెన్ గిల్ (87), శ్రేయాస్ (59), అక్షర్ (52) కీలక అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. దీంతో గురువారం జరిగిన ఈ తొలి వన్డేలో భారత్ మరో 11.2 ఓవర్లుండగానే 4 వికెట్ల తేడాతో బోణీ చేసింది. అలాగే సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలవగా.. రెండో వన్డే ఆదివారం కటక్‌లో జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 47.4 ఓవర్లలో 248 పరుగులకు ఆలౌటైంది. బట్లర్ (52), బెథెల్ (51) అర్ధసెంచరీలు సాధించగా, ఓపెనర్లు సాల్ట్ (43), డకెట్ (32) పర్వాలేదనిపించారు. ఆ తర్వాత ఛేదనలో భారత్ 38.4 ఓవర్లలో 6 వికెట్లకు 251 పరుగులు చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా గిల్ నిలిచాడు. ఈ వన్డేలో పేసర్ హర్షిత్, ఓపెనర్ జైస్వాల్ అరంగేట్రం చేశారు.

భారీ భాగస్వామ్యాలతో..: ఛేదనలో భారత్ 19 పరుగులకే ఓపెనర్లు రోహిత్ (2), జైస్వాల్ (15) వికెట్లను కోల్పోయింది. కానీ బరిలోకి దిగిన గిల్, శ్రేయాస్‌లతో పాటు బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా వచ్చిన అక్షర్ పటేల్ ఇంగ్లండ్ బౌలర్లను సునాయాసంగా ఎదుర్కొన్నారు. అలాగే వీరి మధ్య భారీ భాగస్వామ్యాలు నెలకొనడం విశేషం. ఆరంభంలో గిల్ నిదానం కనబర్చినా.. శ్రేయాస్ మాత్రం టీ20 ఆటతీరును రుచి చూపించాడు. బౌలర్ ఎవరైనా అలవోకగా బౌండరీలు సాధిస్తూ స్కోరు బోర్డును పరిగెత్తించాడు. ఆర్చర్ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లు బాదిన తను కేవలం 30 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అందులో 44 పరుగులు బౌండరీల రూపంలోనే రావడం విశేషం. కానీ 16వ ఓవర్‌లో బెథెల్ అతడిని ఎల్బీ చేయడంతో మూడో వికెట్‌కు 94 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే అతడి వికెట్ తీసిన సంబరంలో ఉన్న ఇంగ్లండ్‌కు ఆ తర్వాత చుక్కలు కనిపించాయి. శ్రేయాస్ అవుటయ్యాక గిల్ జోరు పెంచాడు. అటు కుడి-ఎడమ చేతి కాంబినేషన్ కోసం రాహుల్‌కన్నా ముందే ఐదో స్థానంలో అక్షర్‌ను బరిలోకి దించారు. తను వచ్చీ రాగానే బాదుడు ఆరంభించడంతో ఇంగ్లండ్ బౌలర్లకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. 60 బంతుల్లో గిల్ హాఫ్ సెంచరీ పూర్తి చేయగా.. అక్షర్ మాత్రం 46 బంతుల్లోనే పూర్తి చేశాడు. ఈ దశలో రషీద్ వరుస ఓవర్లలో అక్షర్, రాహుల్ (2)ల వికెట్లను తీశాడు. దీంతో నాలుగో వికెట్‌కు గిల్-అక్షర్ మధ్య నెలకొన్న 108 పరుగుల శతక భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు శతకం పూర్తి చేస్తాడనుకున్న గిల్‌ను 37వ ఓవర్‌లో సకీబ్ పెవిలియన్‌కు చేర్చాడు. అప్పటికి జట్టు ఇంకా 14 పరుగుల దూరంలోనే ఉంది. దీంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా జడేజా (12 నాటౌట్), హార్దిక్ (9 నాటౌట్) 68 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించారు.

ఆరంభం బాగున్నా..: టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్‌కు మెరుపు ఆరంభం దక్కింది. ఓపెనర్ సాల్ట్ మాత్రం దూకుడైన ఆటతో భారత్‌ను భయపెట్టాడు. రాణా వేసిన ఇన్నింగ్స్ ఆరో ఓవర్‌లోనైతే అతడు 6,4,6,4,0,6తో 26 పరుగులను రాబట్టాడు. మరో ఎండ్‌లో డకెట్ అడపాదడపా ఫోర్లతో సహకారం అందించాడు. అయితే అత్యంత ప్రమాదకరంగా మారిన ఈ జోడీకి తొమ్మిదో ఓవర్‌లో బ్రేక్ పడింది. మూడో రన్ కోసం ప్రయత్నించిన సాల్ట్.. శ్రేయాస్ త్రోతో రనౌట్‌గా వెనుదిరగ్గా తొలి వికెట్‌కు 75 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక తర్వాతి ఓవర్‌లోనే డకెట్, బ్రూక్ (0)లను రాణా అవుట్ చేయడంతో ఒక్కసారిగా స్కోరు మందగించింది. రూట్ (19) స్వల్ప స్కోరుకే వెనుదిరిగాక బట్లర్, బెథెల్ జాగ్రత్తగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ఈక్రమంలో బట్లర్ 31వ ఓవర్‌లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. కానీ కాసేపటికే అక్షర్‌కు చిక్కడంతో ఐదో వికెట్‌కు 59 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత బెథెల్ కూడా అర్ధసెంచరీ పూర్తి చేసినా.. మిగతా బ్యాటర్ల నుంచి సహకారం కరువైంది. జడేజా పొదుపైన బౌలింగ్‌తో పాటు బెథెల్ వికెట్ తీశాడు. 44వ ఓవర్‌లో ఆర్చర్ 4,6,4తో 16 రన్స్‌తో అదరగొట్టాడు. కానీ మరో నాలుగు ఓవర్లలోనే జట్టు ఇన్నింగ్స్ ముగిసింది.

1 — మూడు ఫార్మాట్లలోనూ అరంగేట్ర మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా హర్షిత్ రాణా. అలాగే అరంగేట్ర వన్డేలో భారత్ తరపున ఒకే ఓవర్‌లో ఎక్కువ పరుగులిచ్చుకున్న (26) బౌలర్‌గానూ రాణా నిలిచాడు.

5 — అంతర్జాతీయ క్రికెట్‌లో 600 వికెట్లు పూర్తి చేసిన ఐదో భారత బౌలర్‌గా జడేజా. కుంబ్లే (953), అశ్విన్ (765), హర్భజన్ (707), కపిల్ (687) ముందున్నారు.

1 — భారత్-ఇంగ్లండ్ మధ్య జరిగిన వన్డేల్లో ఎక్కువ వికెట్లు (42) తీసిన బౌలర్‌గా జడేజా. అండర్సన్ (40)ను అధిగమించాడు.

విరాట్‌కు గాయం

స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ గాయం కారణంగా తొలి వన్డేకు దూరమయ్యాడు. బుధవారం రాత్రి తను మోకాలి నొప్పికి గురైనట్టు కెప్టెన్ రోహిత్ టాస్ సమయంలో తెలిపాడు. అయితే అతడి గాయం తీవ్రతపై బోర్డు ఇంకా స్పందించలేదు. చాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత్ మూడు మ్యాచ్‌లే ఆడనుండడంతో విరాట్ తదుపరి మ్యాచ్‌లో ఉంటాడా? లేదా? అనే సందేహం వ్యక్తమవుతోంది.

యశస్వి సూపర్ క్యాచ్

అరంగేట్ర మ్యాచ్‌లోనే యశస్వీ జైస్వాల్ అద్భుత ఫీల్డింగ్‌తో ఆకట్టుకున్నాడు. జోరు మీదున్న ఓపెనర్ డకెట్ పదో ఓవర్‌లో పుల్ షాట్‌కు ప్రయత్నించాడు. అయితే గాల్లోకి లేచిన బంతిని మిడ్ వికెట్ నుంచి జైస్వాల్ ముందుకు పరిగెత్తుతూ డైవ్ ద్వారా రెండు చేతుల్తో ఒడిసిపట్టుకున్నాడు. అసాధ్యం అనుకున్న ఈ క్యాచ్‌ను అందుకోవడంతో ఆ తర్వాత ఇంగ్లండ్ పరుగుల వేగం తగ్గి ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్: సాల్ట్ (రనౌట్) 43; డకెట్ (సి) జైస్వాల్ (బి) రాణా 32; రూట్ (ఎల్బీ) జడేజా 19; బ్రూక్ (సి) రాహుల్ (బి) రాణా 0; బట్లర్ (సి) పాండ్యా (బి) అక్షర్ 52; బెథెల్ (ఎల్బీ) జడేజా 51; లివింగ్‌స్టోన్ (సి) రాహుల్ (బి) రాణా 5; కార్స్ (బి) షమి 10; రషీద్ (బి) జడేజా 8; ఆర్చర్ (నాటౌట్) 21; సకీబ్ (స్టంప్) రాహుల్ (బి) కుల్దీప్ 2; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 47.4 ఓవర్లలో 248 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-75, 2-77, 3-77, 4-111, 5-170, 6-183, 7-206, 8-220, 9-241, 10-248; **బౌలింగ్:** షమి 8-1-38-1; హర్షిత్ రాణా 7-1-53-3; అక్షర్ పటేల్ 7-0-38-1; హార్దిక్ పాండ్యా 7-1-37-0; కుల్దీప్ 9.4-0-53-1; రవీంద్ర జడేజా 9-1-26-3.

భారత్: జైస్వాల్ (సి) సాల్ట్ (బి) ఆర్చర్ 15; రోహిత్ (సి) లివింగ్‌స్టోన్ (బి) సకీబ్ 2; గిల్ (సి) బట్లర్ (బి) సకీబ్ 87; శ్రేయాస్ (ఎల్బీ) బెథెల్ 59; అక్షర్ (బి) రషీద్ 52; రాహుల్ (సి అండ్ బి) రషీద్ 2; హార్దిక్ (నాటౌట్) 9; జడేజా (నాటౌట్) 12; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 38.4 ఓవర్లలో 251/6; వికెట్ల పతనం:** 1-19, 2-19, 3-113, 4-221, 5-225, 6-235; **బౌలింగ్:** ఆర్చర్ 7-1-39-1; సకీబ్ 6.4-0-47-2; కార్స్ 5-0-52-0; రషీద్ 10-1-49-2; బెథెల్ 3-0-18-1; లివింగ్‌స్టోన్ 5-0-28-0; రూట్ 2-0-10-0.

స్పోర్ట్స్

స్టొయినిస్ షాకింగ్ నిర్ణయం!

వన్డేలకు తక్షణం వీడ్కోలు



స్టొయినిస్

మెల్‌బోర్న్: గాయాలతో సతమతమవుతున్న ఆస్ట్రేలియాకు చాంపియన్స్ ట్రోఫీ (సీటీ) ముందు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ మార్కస్ స్టొయినిస్ (35) హఠాత్తుగా వన్డేలకు వీడ్కోలు పలికి అందరికీ షాకిచ్చాడు. తక్షణం తాను 50 ఓవర్ల ఫార్మాట్ నుంచి తప్పుకొంటున్నట్టు అతడు ప్రకటించడంతో ఈ నెల 19 నుంచి జరిగే సీటీకి కూడా దూరమయ్యాడు. కీలక ఆటగాళ్లు కమిన్స్, మిచెల్ మార్ష్, హాజెల్‌వుడ్ గాయాల బారిన పడడంతో ఐసీసీ మెగా టోర్నీ కోసం తగిన జట్టును ఎంపిక చేయడానికి సెలెక్టర్లు నానా తంటాలు పడుతున్నారు. ఇప్పుడు స్టొయినిస్ రిటైర్మెంట్ ప్రకటనతో అతడి స్థానంలో మరో ఆటగాడిని వెతకాల్సిన పరిస్థితి. కాగా, సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో డర్బన్ సూపర్ జెయింట్స్ తరఫున ఆడుతున్నప్పుడు తొడ కండర గాయం కావడంతోనే మార్కస్ ఈ నిర్ణయం తీసుకొన్నట్టు తెలుస్తోంది. అయితే, టీ20 ఫార్మాట్‌లో కొనసాగుతానని అతడు చెప్పాడు. 2021 టీ20 వరల్డ్‌కప్, 2023 వన్డే ప్రపంచకప్ నెగ్గిన జట్లలో మార్కస్ సభ్యుడు. ఆడిన 71 వన్డేల్లో 26.69 సగటుతో 1495 పరుగులు చేసిన స్టొయినిస్.. బంతితో 48 వికెట్లు పడగొట్టాడు. 74 టీ20ల్లో 1245 పరుగులు సాధించగా.. 45 వికెట్లు కూల్చాడు. కానీ, తన పదేళ్ల కెరీర్‌లో ఒక్క టెస్ట్ కూడా ఆడలేదు.

కమిన్స్, హాజెల్‌వుడ్ అవుట్

కెప్టెన్ కమిన్స్‌తో పాటు పేసర్ హాజెల్‌వుడ్ గాయం కారణంగా చాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యారు. కమిన్స్ కెప్టెన్సీలోనే ఆసీస్ 2023 వన్డే వరల్డ్‌కప్ సాధించిన విషయం తెలిసిందే. ఇప్పటికే మిచెల్ మార్ష్ కూడా గాయంతో ఈ టోర్నీ నుంచి వైదొలిగాడు. సీటీ కోసం జనవరి 13న ఆసీస్ ప్రకటించిన ప్రాథమిక జట్టులో ఈ నలుగురు ఉండడం గమనార్హం. అయితే ఈనెల 12 వరకు టీమ్‌లో మార్పులు చేసుకునే అవకాశం ఉండడంతో క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) కొత్తగా మరో నలుగురితో వీరి స్థానాలను భర్తీ చేయనుంది.

సెమీస్‌కు సాకేత్ జోడీ

చెన్నై ఓపెన్ టెన్నిస్

చెన్నై: డిఫెండింగ్ చాంపియన్ సాకేత్ మైనేని-రామ్‌కుమార్ రామనాథన్ జోడీ చెన్నై ఓపెన్ సెమీస్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన క్వార్టర్స్‌లో సాకేత్-రామనాథన్ జంట 6-3, 6-4తో ఇగోర్ అగఫనోవ్-ఎవజెన్నీ టియుర్నేవ్‌పై నెగ్గింది. మరో క్వార్టర్స్ మ్యాచ్‌లో గెలిచిన జీవన్ నెడుంజెళియన్-విజయ్ సుందర్ ప్రశాంత్ ద్వయం కూడా సెమీస్ చేరింది.

బీచ్ వాలీబాల్‌లో ఆంధ్రకు స్వర్ణం

● బాక్సింగ్‌లో తెలంగాణకు కాంస్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): డెహ్రాడూన్‌లో జరుగుతున్న జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ నాలుగో పసిడి పతకం కైవసం చేసుకుంది. బీచ్ వాలీబాల్ ఫైనల్లో కె.మణికంఠ రాజు-ఎల్. సాయి ద్వయం 25-23, 21-19తో తమిళనాడు జోడీపై నెగ్గి, విజేతగా నిలిచింది. ఇక బాక్సింగ్ 91 ప్లస్ కిలోల విభాగంలో తెలంగాణ బాక్సర్ అబ్దుల్ జావేద్‌కు కాంస్యం లభించింది.

శ్రీలంక 229/9

ఆసీస్‌తో రెండో టెస్ట్

గాలె: దినేష్ చాందిమల్ (74), కుశాల్ మెండిస్ (59 బ్యాటింగ్) అర్థ శతకాలతో ఆదుకొన్నా.. ఆస్ట్రేలియా బౌలర్లు శ్రీలంకను భారీ స్కోరు చేయకుండా అడ్డుకొన్నారు. దీంతో గురువారం ఆరంభమైన రెండో టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో లంక 9 వికెట్లకు 229 పరుగులు చేసింది. కెరీర్‌లో ఆఖరి టెస్ట్ ఆడుతున్న దిముత్ కరుణరత్నె (36), రమేష్ మెండిస్ (28) పర్వాలేదనిపించారు. మిచెల్ స్టార్క్, లియోన్ చెరో 3 వికెట్లు పడగొట్టారు.

'ద హండ్రెడ్' జట్టును కొన్న 'సన్‌రైజర్స్'

లండన్: సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ 'ద హండ్రెడ్' లీగ్‌లో జట్టును కొనుగోలు చేసింది. 'నార్తర్న్ సూపర్ చార్జర్స్' జట్టులో పూర్తి 100 శాతం వాటాను రూ.1086 కోట్లకు దక్కించుకుంది. తద్వారా ఈ లీగ్ జట్టును సొంతం చేసుకున్న మూడో ఐపీఎల్ ఫ్రాంచైజీగా హైదరాబాద్ నిలిచింది. ఓవల్ ఇన్విన్సిబుల్స్ జట్టులో 49 శాతం వాటాను రూ.645 కోట్లకు ముంబై ఇండియన్స్, మాంచెస్టర్ ఒరిజినల్స్ ఫ్రాంచైజీలో 70 శాతం వాటాను రూ.882 కోట్లకు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టు ఇప్పటికే చేజిక్కించుకున్నాయి.

ఆసియా వింటర్ గేమ్స్‌కు చంద్ర

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆసియా వింటర్ గేమ్స్‌లో పాల్గొనే భారత బృందంలో విశాఖపట్నం స్కేటర్ దండ చంద్రమౌళికి చోటు లభించింది. చైనాలోని హర్బిన్ నగరంలో ఈనెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరగనున్న ఈ పోటీల్లో భారత్ నుంచి మొత్తం 12 మంది స్కేటర్లు పాల్గొంటున్నారు.

బ్యాడ్మింటన్‌లో కొత్త స్కోరింగ్ విధానం

ఆరు నెలలపాటు ప్రయోగాత్మకంగా అమలు

న్యూఢిల్లీ: బ్యాడ్మింటన్‌లో కొత్త స్కోరింగ్ విధానాన్ని తీసుకురావాలని అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) నిర్ణయించింది. 3X15 పేరిట నూతన పద్ధతిని ఎంపిక చేసిన టోర్నమెంట్లలో ఆరు నెలలపాటు వచ్చే ఏప్రిల్ నుంచి అమలు చేయనుంది. ప్రస్తుత స్కోరింగ్ విధానంలో 21 పాయింట్లతో బెస్టాఫ్ త్రీ గేమ్‌లు (3X21) నిర్వహిస్తున్నారు. అలా కాకుండా బెస్టాఫ్ త్రీ గేమ్‌లు 15 పాయింట్లతో జరుగుతాయి.

జాతిని మోసం చేసేటోడిని కాను

- ఎస్సీ వర్గీకరణను అడ్డుకునే కుట్రలు సాగవు: దామోదర



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మాదిగల సమష్టి కృషి, అందరికీ సమాన హక్కులు కల్పించాలన్న కాంగ్రెస్ సిద్ధాంతం, సీఎం రేవంత్‌రెడ్డి నిబద్ధత వల్లే రాష్ట్రంలో పెద్మ్యాల్లు కులాల వర్గీకరణ జరుగుతోందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. బట్టేబాజ్ మాటలు చెప్పి జాతిని మోసం చేసేటోడిని కానని, ఎవరికీ భయపడే తత్వం తనది కాదని అన్నారు. ఎస్సీల వర్గీకరణ కల నెరవేరుతోన్న సందర్భంగా మాదిగ, మాదిగ ఉప కులాల నాయకులు మంత్రుల క్వార్టర్లలో రాజనర్సింహను కలిసి సన్మానించారు. వారినుద్దేశించి మంత్రి మాట్లాడుతూ.. వర్గీకరణ జరగడం ఇష్టం లేని కొందరు వ్యక్తులు, వర్గీకరణ పేరిట మనుగడ సాగించాలనుకునేవారు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. అన్నదమ్ముల్లా ఉండాల్సిన మాల, మాదిగల మధ్య వివాదాలు సృష్టించి వర్గీకరణను అడ్డుకోవాలని కుట్రలు చేస్తున్న వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. భవిష్యత్తులో వర్గీకరణకు ఎలాంటి కోర్టు కేసులు, లీగల్ సమస్యలు ఎదురుకాకుండా కమిషన్ నివేదిక ప్రకారం ముందుకు వెళతామని ఆయన తెలిపారు.

రేవంత్ సర్కారు నిర్లక్ష్యం.. 'పాలమూరు'కు శాపం

- సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే ఉద్యమిస్తాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పాలమూరు ఎత్తిపోతలను 14 నెలలుగా రేవంత్ సర్కారు కోల్డ్‌స్టోరేజీలో పెట్టిందని, ప్రభుత్వ నిర్లక్ష్యం పాలమూరుకు శాపంగా మారిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కేసీఆర్ ముందుచూపుతో పాలమూరుకు 90 టీఎంసీల నికర జలాలు కేటాయించి ప్రాజెక్టును గట్టెక్కించే ప్రయత్నం చేస్తే.. కేంద్రం అనుమతులు సాధించడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాలి కొదిలేసిందని గురువారం 'ఎక్స్' వేదికగా ఆమె ఆరోపించారు. కృష్ణా జలాల నీటి కేటాయింపులు తేలేవరకు పాలమూరు-రంగారెడ్డికి జాతీయహోదా ఇవ్వలేమని పార్లమెంటు సాక్షిగా కేంద్రం తేల్చి చెప్పిందన్నారు. నల్లమల బిడ్డనని చెప్పే రేవంత్ రెడ్డి చిత్తశుద్ధి ఈ ప్రాజెక్టు విషయంలో తేలిపోయిందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని, కేసీఆర్‌పై కక్షతో సజీవ జలధారను వట్టిపోయేలా చేశారన్నారు. ఇదిలా ఉండగా.. రైతుభరోసా నిధుల విడుదలపై తాత్సారం చేస్తున్నారని, మాజీ సర్పంచులకు బకాయిపడిన బిల్లుల గురించి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని కవిత ఆరోపించారు. గురువారం పలువురు మాజీ సర్పంచులను కవితను ఆమె నివాసంలో ప్రత్యేకంగా కలిశారు. ప్రభుత్వం తక్షణమే సర్పంచులకు పెండింగ్ బిల్లులు విడుదల చేయడంతోపాటు రైతు భరోసా డబ్బులు వేయాలని.. లేకుంటే ప్రభుత్వంపై ఉద్యమిస్తామని ఈ సందర్భంగా కవిత హెచ్చరించారు.

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- ఓబీసీ సెమినార్‌లో తెలుగు ఎంపీల డిమాండ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంపీలు డిమాండ్ చేశారు. ఇందుకోసం పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి వెంటనే ఆమోదించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. గురువారం, ఏపీ/ తెలంగాణ భవన్‌లోని గురజాడ కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతీయ ఓబీసీ సెమినార్ జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 9 మంది ఎంపీలు ఆర్.కృష్ణయ్య, ఈటల రాజేందర్, బీద మస్తాన్ రావు, దగ్గుమళ్ల ప్రసాదరావు, పుట్టా మహేష్ కుమార్ యాదవ్, మల్లు రవి, అంబిక లక్ష్మీనారాయణ, పార్థసారథి, బస్తీపాటి నాగరాజు ఈ సెమినార్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా నేతలు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనగణనలో కులాలవారీగా జనాభా లెక్కలు సేకరించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల నియామకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని, క్రిమీలేయర్‌ను తొలగించాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, రూ.2 లక్షల కోట్లతో బీసీ సబ్ ప్లాన్‌ను కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఆ 11 మందిని తిరిగి విధుల్లోకి తీసుకోండి

- సస్పెండైన రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగుల కోసం జేఏసీ వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో చిన్నచిన్న తప్పులు చేసి సస్పెండ్ అయి ఏడాదిగా విధులకు దూరమైన 11 మంది రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ ఉద్యోగుల ఐకాస కోరింది. ఏసీబీ కేసుల వల్ల సస్పెండైన వారిని ఒకటి రెండు నెలల్లోనే తిరిగి విధుల్లోకి తీసుకున్న రిజిస్ట్రేషన్ శాఖ.. ఈ 11 మంది విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదని ఐకాస వాపోయింది. ఉద్యోగులపై ఉన్న కేసుల విషయంలో ఆరు నెలలకోసారి శాఖాపరంగా సమీక్ష నిర్వహించి తదుపరి చర్యలపై ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తారని, దాని ప్రకారం తప్పిదాలకు పాల్పడిన వారిని క్షమించి తిరిగి విధుల్లోకి తీసుకుంటారని ఐకాస వివరించింది. కానీ రిజిస్ట్రేషన్ శాఖలో 12 మందిని మాత్రం ఏడాదిగా పక్కనపెట్టేశారని, వారిలో ఒకరు గుండెపోటుతో మరణించారని తెలిపింది.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆయా ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఐకాస కోరింది.

వర్గీకరణ.. మందకృష్ణకు ఇష్టం లేదు

- ఈ నెలలో 20 లక్షల మందితో విజయోత్సవ సభ
- రేవంత్‌రెడ్డిని ఘనంగా సన్మానిస్తాం: సతీశ్ మాదిగ

పంజాగుట్ట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ జరిగిందన్న ఆనందం కన్నా మంద కృష్ణలో ఆందోళన ఎక్కువయిందని మాదిగ సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి దేవని సతీశ్ మాదిగ అన్నారు. కాంగ్రెస్ పార్టీ వర్గీకరణ చేయడం, వర్గీకరణ జరగడం ఆయనకు ఇష్టం లేదని విమర్శించారు. ఈ నెల చివరి వారంలో 20 లక్షల మందితో, 2 లక్షల డప్పులతో విజయోత్సవ సభ నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డికి ఘనంగా సన్మానం చేస్తామని వెల్లడించారు. మంద కృష్ణ తలపెట్టిన 'లక్ష డప్పులు, వేల గొంతులు' కార్యక్రమాన్ని వాయిదా వేయడం తప్పన్నారు. ఏపీలో వర్గీకరణ జరగలేదు కనుక, వచ్చే నెల అందరం అక్కడికి వెళ్లి వర్గీకరణ కోసం 'లక్ష డప్పులు, వేల గొంతులు' ప్రదర్శన చేపడదామని పిలుపునిచ్చారు. మాదిగ జాతిని బీజేపీకి తాకట్టు పెట్టాలని మందకృష్ణ కుట్ర చేస్తున్నారని సతీశ్ ఆరోపించారు.

బీసీ కులగణన నివేదికను పునఃసమీక్షించాలి

- బీసీ సంఘాల ప్రతినిధుల డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కులగణన నివేదికను పునఃసమీక్షించి పొరపాట్లను సరిదిద్దేందుకు సర్కారు చర్యలు చేపట్టాలని.. లేని పక్షంలో ఉద్యమ కార్యాచరణకు సిద్ధమని బీసీ సంఘాల ప్రతినిధులు ప్రకటించారు. కులగణన నివేదికను వ్యతిరేకిస్తూ బేగంపేటలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, తాడూరి శ్రీనివాస్, బీసీ మేధావుల ఫోరం చైర్మన్ చిరంజీవులు, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్, బీసీ కులసంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్‌చారితో పాటు పలువురు బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సర్వే నివేదికలో బీసీల జనాభాను తక్కువగా చూపడంతో ఉత్పన్నమయ్యే అన్యాయాన్ని వివరిస్తూ రాహుల్ గాంధీకి శుక్రవారం లేఖ రాయాలని సమావేశంలో నిర్ణయించినట్టు జాజుల తెలిపారు. 9న 'ఏది నిజం' పేరుతో బీసీ ప్రజాప్రతినిధుల విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి వాస్తవ వివరాలను వెల్లడించాలని నిర్ణయించామన్నారు. 16వ తేదీలోపు బీసీ కులగణన రణభేరి పేరుతో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు.

బీసీలు భళా!

(మొదటిపేజీ తరువాయి)

ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి! ప్రస్తుతం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల విషయమై పెద్ద చర్చే నడుస్తోంది. కుల గణన తర్వాత బీసీలకు పార్టీపరంగా తాము 42 శాతం రిజర్వేషన్ కేటాయిస్తామని అధికార కాంగ్రెస్ ప్రకటించింది. అదే కోటాను చట్టపరంగా ఇవ్వాలని బీఆర్ఎస్, బీజేపీ డిమాండ్ చేస్తున్నాయి. రాజకీయ వాదోపవాదాలను పక్కనపెడితే.. అసలు స్థానిక సంస్థల్లో గత ఎన్నికల్లో గెలిచి.. మొన్నటి వరకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా ఉన్న వారి సంఖ్య ఎంత? వారి ప్రాతినిధ్య శాతం ఎంత? వారికి రిజర్వు చేసిన 23 శాతం మేరకే ఉన్నారా? ఎక్కువ తక్కువ ఏమైనా ఉన్నారా!? అన్న అంశం ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలోనే.. స్థానిక సంస్థల్లో బీసీల ప్రాతినిధ్యంపై 'ఆంధ్రజ్యోతి' సమాచారం సేకరించింది. రాష్ట్రంలో 32 జిల్లాల్లోని (హైదరాబాద్ మినహా) వివరాలు పరిశీలిస్తే.. బీసీలు తమకు కేటాయించిన రిజర్వేషన్ల కంటే ఎక్కువగానే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రాజకీయ చైతన్యంతో వారికి కేటాయించిన 23 శాతం రిజర్వుడ్ సీట్లలోనే కాకుండా అనేకచోట్ల జనరల్ స్థానాల్లోను గెలుపొందారు. రాజకీయంగా బలోపేతం అయ్యారు. కొన్ని జిల్లాల్లో అయితే, ఇప్పుడు ప్రకటించిన 42 శాతం కంటే కూడా ఎక్కువగానే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరికొన్ని జిల్లాల్లో 50 శాతానికి పైగా స్థానిక సంస్థల్లో బీసీల ప్రాతినిధ్యం కొనసాగుతుండడం గమనార్హం. ఎస్టీ తండాలు, పెసా పంచాయతీలను మినహాయించి లెక్కిస్తే బీసీల ప్రాతినిధ్య శాతం మరికాస్త పెరుగుతుంది. ఇప్పుడు బీసీలకు పార్టీలు 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తే.. క్షేత్రస్థాయిలో వారి ప్రాతినిధ్యం మరికాస్త పెరిగే అవకాశం ఉంది.



పంచాయతీల్లో 41.5 శాతం

గత పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 41.5 శాతం స్థానాల్లో బీసీలు విజయం సాధించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ లెక్కల ప్రకారం.. గత ఎన్నికలనాటికి రాష్ట్రంలో 12,751 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో ఎస్టీ తండాలు 1,177, పెసా చట్టం (షెడ్యూల్ ఏరియాలో ఉన్న పంచాయతీలు 1,281) పోను విగిలిన వాటిలో 23 శాతం రిజర్వేషన్ల చొప్పున 2,345 పంచాయతీలను బీసీలకు కేటాయించారు. రాజకీయ చైతన్యం.. ఆర్థికంగా అండదండలు.. స్థానిక పరిస్థితులు.. కారణాలు ఏవైనా తమకు కేటాయించిన స్థానాలతోపాటు పలుచోట్ల జనరల్ స్థానాల్లోనూ పోటీ చేసి గెలిచారు. రిజర్వుడ్, జనరల్ కలిపి రాష్ట్రవ్యాప్తంగా 4,274 పంచాయతీల్లో బీసీలు గెలుపొందారు. అంటే, మొత్తం గ్రామ పంచాయతీల్లో 33 శాతం.. ఎస్టీ తండాలు, పెసా చట్టం కింద ఉన్న గ్రామాలను మినహాయించి లెక్కిస్తే 41.5 శాతం స్థానాల్లో బీసీలు విజయం సాధించినట్లు అయింది. వెరసి, బీసీల కోటా 23 శాతమే అయినా.. దానికి మించి 18.5 శాతం స్థానాల్లో బీసీ అభ్యర్థులు సర్పంచ్‌లుగా గెలిచారు.

గ్రామపంచాయతీల వివరాలు

జిల్లా	మొత్తం గ్రామ పంచాయతీలు	బీసీ రిజర్వేషన్ స్థానాలు	బీసీలు మొత్తం గెలిచినవి
ఆదిలాబాద్	468	47	95
గద్వాల్	255	80	135
జనగామ	281	39	95
భూపాలపల్లి	240	51	100
మంచిర్యాల	311	49	132
వనపర్తి	255	62	100
నారాయణపేట్	280	84	131
నిజామాబాద్	530	98	132
నిర్మల్	396	90	138
మేడ్చల్	61	16	22
జగిత్యాల	379	94	185
కామారెడ్డి	526	92	131
సిద్దిపేట	501	183	240
సంగారెడ్డి	647	175	282
మహబూబ్‌నగర్	439	97	158
హన్మకొండ	210	16	28
పెద్దపల్లి	263	70	144
వికారాబాద్	566	159	226
ములుగు	150	6	29
రాజన్నసిరిసిల్ల	252	56	80
నాగర్‌కర్నూల్	461	83	120
రంగారెడ్డి	558	124	195
యాదాద్రి	420	117	176
కరీంనగర్	313	74	120
ఖమ్మం	589	58	115
భద్రాద్రికొత్తగూడెం	478	0	10
మహబూబాబాద్	461	22	67
నల్లగొండ	835	209	288
వరంగల్	325	48	63
ఆసిఫాబాద్	334	35	85
సూర్యాపేట్	475	171	223
మెదక్	469	120	229
మొత్తం	12728	2625	4274

ఎంపీటీసీ వివరాలు

జిల్లా	మొత్తం	రిజర్వేషన్	బీసీ గెలిచిన మొత్తం స్థానాలు
ఆదిలాబాద్	158	4	56
గద్వాల్	141	44	74
జనగాం	128	17	55
భూపాలపల్లి	102	23	43
మంచిర్యాల	130	13	51
వనపర్తి	128	37	57
నారాయణపేట	140	52	76
నిజామాబాద్	307	67	124
నిర్మల్	156	26	71
మేడ్చల్	41	11	15
జగిత్యాల	214	58	94
కామారెడ్డి	236	63	114
సిద్దిపేట	226	86	106
సంగారెడ్డి	295	61	132
మహబూబ్‌నగర్	169	35	65
హన్మకొండ	130	30	63
పెద్దపల్లి	138	37	76
వికారాబాద్	221	53	82
ములుగు	72	25	26
రాజన్నసిరిసిల్ల	123	25	42
నాగర్‌కర్నూల్	210	49	70
రంగారెడ్డి	267	74	110
యాదాద్రి	117	39	51
కరీంనగర్	178	46	63
ఖమ్మం	289	31	67
భద్రాద్రికొత్తగూడెం	220	10	10
మహబూబాబాద్	198	5	37
నల్లగొండ	346	93	121
వరంగల్	134	35	53
ఆసిఫాబాద్	123	12	55
మెదక్	189	34	84
సూర్యాపేట	255	29	79
మొత్తం	5781	1224 (21.17%)	2222 (38.4%)

ఎంపీటీసీ.. జడ్పీటీసీల్లోనూ

రాష్ట్రంలో 5,781 ఎంపీటీసీ స్థానాలున్నాయి. వీటిలో ఎస్టీ తండాలు, పెసా చట్టం కింద మినహాయించిన తర్వాత 1,224 స్థానాలను బీసీలకు కేటాయించారు. కానీ, బీసీలు జనరల్ స్థానాల్లోను పోటీ పడి మరో 998 సీట్లలో విజయం సాధించారు. దీని ప్రకారం.. బీసీలు గెలిచిన ఎంపీటీసీల శాతం దాదాపుగా 38.5 శాతంగా ఉంది. ఎస్టీ తండాలు, పెసా చట్టం కింద మినహాయించిన స్థానాలను తీసేసి మిగిలిన స్థానాల్లో గెలిచిన బీసీల శాతం చూస్తే.. 41-42 శాతం ఉంటుందని అంచనా. ఇక, రాష్ట్రంలో 512 జడ్పీటీసీ స్థానాలు ఉండగా.. వాటిలోనూ బీసీలకు కేటాయించిన 23 శాతం కంటే ఎక్కువగానే గెలుపొందారు. సుమారు 33 శాతం బీసీలు జడ్పీటీసీలుగా పనిచేశారు.

జిల్లాలవారీగా పరిస్థితి ఇదీ..

- జోగులాంబ గద్వాల జిల్లాలో మొత్తం గ్రామ పంచాయతీలు 255. వీటిలో బీసీలకు 80 స్థానాలు రిజర్వ్ చేశారు. వాటితోపాటు జనరల్ స్థానాల్లో 55 మంది విజయం సాధించడంతో బీసీ సర్పంచుల సంఖ్య 135కి చేరింది. అంటే, పంచాయతీల్లో బీసీల ప్రాతినిధ్యం 52.94. ఇక, 141 ఎంపీటీసీ స్థానాల్లో బీసీలకు 44 కేటాయించగా.. మరో 30 జనరల్ స్థానాలనూ కైవసం చేసుకున్నారు. ఈ జిల్లాలో 52.48 శాతం ఎంపీటీసీ స్థానాల్లో బీసీలదే ప్రాతినిధ్యం. జడ్పీటీసీ స్థానాలు 12 ఉండగా.. బీసీలకు ఐదు రిజర్వ్ చేశారు. మరో జనరల్ స్థానంలో విజయం సాధించడంతో ఆ సంఖ్య ఆరుకు చేరింది. దాంతో జడ్పీటీసీల్లో బీసీలు 50 శాతం దక్కించుకున్నట్లు అయింది.
- భూపాలపల్లి జిల్లాలో 240 గ్రామ పంచాయతీలకు 51 బీసీలకు కేటాయించారు. జనరల్ స్థానాల్లో పోటీ చేసి 49 చోట్ల విజయం సాధించడంతో బీసీల సంఖ్య 100కి చేరింది. తద్వారా, ఇక్కడి పంచాయతీల్లో బీసీ సర్పంచులు 41.66 శాతానికి చేరారు. ఇక్కడ ఎంపీటీసీ స్థానాలు 102 ఉండగా.. బీసీలకు 23 కేటాయించారు. జనరల్ స్థానాల్లో 20 మంది గెలవడంతో వారి సంఖ్య 43కి చేరింది. అంటే, మొత్తం ఎంపీటీసీల్లో బీసీలు 48 శాతం. జడ్పీటీసీ స్థానాలు 11 ఉండగా.. బీసీలకు 2 కేటాయించగా.. జనరల్ స్థానాల్లో మరో ఇద్దరు విజయం సాధించారు. దాంతో, సంఖ్యాపరంగా వారి ప్రాతినిధ్యం నాలుగుకి; శాతాల్లో 36.3కి చేరింది.
- నారాయణపేట జిల్లాలో గ్రామ పంచాయతీలు 280 ఉండగా.. బీసీలకు 84 రిజర్వ్ చేశారు. 47 మంది జనరల్ స్థానాల్లో విజయం సాధించడంతో ఇక్కడ బీసీ సర్పంచులు 131కి (46.78 శాతం) చేరారు. ఇక, 140 ఎంపీటీసీ స్థానాలకు బీసీలకు 52 కేటాయించారు. జనరల్ స్థానాల్లో
- మరో 24 మంది గెలిచారు. మొత్తంగా 76 మంది ఎంపీటీసీలతో 54.28 శాతానికి చేరారు. 11 జడ్పీటీసీ స్థానాలకు నాలుగు బీసీలకు కేటాయించగా.. మరొక జనరల్ స్థానం దక్కించుకున్నారు. దీంతో, ఇక్కడ జడ్పీటీసీల్లో బీసీలు 45 శాతం దక్కించుకున్నారు.
- జగిత్యాల జిల్లాలో గ్రామ పంచాయతీలు 379. వీటిలో బీసీలకు రిజర్వు చేసింది 94. జనరల్ స్థానాల్లో 91 మంది గెలవడంతో వారి సంఖ్య 185కి పెరిగింది. తద్వారా, ఇక్కడి పంచాయతీల్లో బీసీల ప్రాతినిధ్యం 48.81కి చేరింది. అలాగే, ఎంపీటీసీ స్థానాలు 214 ఉండగా.. బీసీలకు 58 రిజర్వు చేశారు. జనరల్ స్థానాల్లో మరో 36 మంది గెలిచారు. 94 మంది ఎంపీటీసీలతో 43.92 శాతం ప్రాతినిధ్యం దక్కించుకున్నారు. మొత్తం 18 జడ్పీటీసీల్లో ఏడు దక్కించుకోవడం ద్వారా 38.8 శాతం ప్రాతినిధ్యం దక్కింది.
- సిద్దిపేట జిల్లాలో 501 గ్రామ పంచాయతీలకు 183 బీసీలకు కేటాయించారు. 57 జనరల్ స్థానాల్లోనూ వీరు గెలిచారు. మొత్తం 240 సర్పంచు పదవులతో 47.90 శాతం ప్రాతినిధ్యాన్ని దక్కించుకున్నారు. ఇక, ఎంపీటీసీ స్థానాలు 226 ఉండగా.. బీసీలకు 86 కేటాయిస్తే మరో 20 జనరల్ స్థానాల్లోనూ గెలిచారు. మొత్తంగా 106 ఎంపీటీసీ పదవులతో 46.90 శాతం ప్రాతినిధ్యం దక్కింది. అలాగే, ఈ జిల్లాలో 20 జడ్పీటీసీలు ఉన్నాయి. వీటిలో ఆరు బీసీలకు కేటాయించగా.. మరో మూడు జనరల్ స్థానాల్లో విజయం సాధించడంతో 9 చోట్ల వారిదే ప్రాతినిధ్యం. అంటే, జడ్పీటీసీల్లో 45 శాతం దక్కించుకున్నట్లయింది.

నాగయ్య మరణం ప్రభుత్వ హత్యే

- మాజీ మంత్రి హరీశ్ రావు
- రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా బుట్టాయిగూడెంకు చెందిన కుమ్మరి నాగయ్య మరణం ప్రభుత్వ హత్యేనని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేదనే ఆవేదనతో ములుగు జిల్లా బుట్టాయిగూడెంలో గత నెల 23న నిర్వహించిన గ్రామసభలో నాగయ్య పురుగు మందు తాగాడు. అప్పట్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగయ్య గురువారం మరణించాడు. ఈ ఘటనపై ఎక్స్ వేదికగా స్పందించిన ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. గ్రామ సభ పేరిట ప్రభుత్వం నాగయ్య కుటుంబంలో నిప్పులు పోసిందని మండిపడ్డారు. నాగయ్య భార్య, ముగ్గురు కుమార్తెలకు దిక్కు ఎవరిని ప్రశ్నించారు. నాగయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని, రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్న కాంగ్రెస్ పార్టీ ప్రజల పాలిట అభయ హస్తం కాదని, భస్మాసుర హస్తమని హరీశ్ వ్యాఖ్యానించారు. కాగా, మధ్యాహ్న భోజనం బాలేదని నారాయణపేట జిల్లా కోస్గి మండలంలోని చెన్నారం పాఠశాల విద్యార్థులు రోడ్డెక్కడం విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి పని తీరుకు నిదర్శనమని హరీశ్ ఎద్దేవా చేశారు. ఇక, రాష్ట్రాలకు వాటా ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే సెస్, సర్‌చార్జీలు పదేళ్లలో భారీగా పెరగడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పన్నుల్లో వాటాలు ఇవ్వకపోవడం వల్ల రాష్ట్రాలు నష్టపోతున్నాయని పేర్కొన్నారు. 2013-14లో రూ.1.08 లక్షల కోట్లుగా ఉన్న ఈ పనులు 2026నాటికి రూ.5.56లక్షల కోట్లకు చేరనున్నాయని తెలిపారు. రాష్ట్రాలకు వాటా ఇవ్వడంపై కేంద్రం పునఃపరిశీలన చెయ్యాలని కోరారు.

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 30 రైళ్ల రద్దు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కాజీపేట-విజయవాడ సెక్షన్‌లోని ఖమ్మం రైల్వేస్టేషన్‌లో ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా 30 రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. అలాగే కొన్ని రైళ్లను దారిమళ్లించగా, మరికొన్ని రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు గురువారం సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. వీటిని ఈ నెల 10 నుంచి 21 వరకు రద్దు చేశారు. పలు రైళ్ల వేళలను మార్పు చేశారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు తప్పదు

ఉప ఎన్నికలు రావాలని ప్రజలు కోరుకుంటున్నారు.. యూజీసీ నూతన నిబంధనలు సమాఖ్య స్ఫూర్తికి విఘాతం

- రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని, హక్కులను హరిస్తే ఊరుకోం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు తప్పదని, తెలంగాణలో ఉప ఎన్నికలు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. పార్లమెంట్ ఎదుట విజయ్ చౌక్ వద్ద కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై ఇటీవలే సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసిందని, వారికి నోటీసులు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు పడేలా సుప్రీంకోర్టులో కొట్లాడతామన్నారు. అంతకుముందు ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ బృందం సమావేశమైంది. సిరిసిల్ల వరకు నిర్మాణమవుతున్న జాతీయ రహదారి 365-బీని వేములవాడ నుంచి కోరుట్ల వరకు విస్తరించాలని గడ్కరీని కోరామన్నారు.



మిడ్ మానేరు మీదుగా రోడ్ కమ్ రైల్ బ్రిడ్జిను ఏర్పాటు చేసి వేములవాడ మీదుగా కోరుట్లలో జాతీయ రహదారి 63ని దానితో అనుసంధానం చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీలను గవర్నర్ల రూపంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తన అధీనంలోకి తీసుకోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీ వీసీల నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీల బాధ్యతను గవర్నర్లకు అప్పగించడం సరికాదన్నారు. దేశంలో రాష్ట్రాల హక్కులను హరిస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా నిబంధనలు తెస్తే సహించేది లేదన్నారు. యూజీసీ నిబంధనల్లో మార్పులపై బీఆర్ఎస్ నేతృత్వంలోని ఆరు పేజీలతో కూడిన విద్యారంగ నిపుణుల సలహాలు, సూచనలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు కేటీఆర్ అందజేశారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి హక్కులకు భంగం వాటిల్లకుండా యూజీసీ నూతన నిబంధనలు రూపొందించాలని కేటీఆర్ కోరారు. కేంద్రమంత్రులను కలిసిన బీఆర్ఎస్ బృందంలో ఎంపీలు సురేష్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దామోదర్ రావు, పార్థసారథి రెడ్డి, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సంజయ్ కుమార్ తదితరులున్నారు.

రాష్ట్రంలో పడకేసిన పాలన


రాష్ట్ర సచివాలయంలోనే కాక గ్రామ సచివాలయాల్లో కూడా పాలన పడకేసిందని, ప్రజల కష్టాలు తీరేదెలాగంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన పల్లె ప్రజలకు కష్టాలు తెచ్చిందన్నారు. సీఎం ఇప్పటికైనా మొద్దునిద్ర వీడాలని, గ్రామాల్లో సమస్యలను తీర్చాలని డిమాండ్ చేశారు.

ఏపీలో బీసీలకు మళ్లీ అగ్రతాంబూలం!

- నామినేటెడ్ పదవుల్లో 34% కోటా
- ఏపీ మంత్రివర్గం నిర్ణయం

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. వారికి 34 శాతం రిజర్వేషన్ కల్పించే ప్రతిపాదనను గురువారమిక్కడ వెలగపూడి సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోదించింది. దీనిపై బీసీ సంఘాలు, నేతలు హర్షం వెలిబుచ్చుతున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచీ బీసీలకు పెద్దపీట వేస్తూ వస్తోంది. నామినేటెడ్ పదవుల్లోనూ వారికి రిజర్వేషన్ కల్పించిన ఘనత ఆ పార్టీకే దక్కుతుంది. తొలిసారి ఎన్టీఆర్ హయాంలో బీసీలకు నామినేటెడ్ పదవుల్లో 20 శాతం రిజర్వేషన్‌ను అమలు చేశారు. చంద్రబాబు దానిని 34 శాతానికి పెంచారు. అయితే వైసీపీ హయాంలో బీసీలు, మైనారిటీలకు కలిపి 29 శాతానికి కుదించారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం కలిపి రిజర్వేషన్‌ను 50 శాతానికే పరిమితం చేస్తూ 2019లో చట్టం కూడా తెచ్చారు. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్ పరిమితి నిబంధన అమలు చేయాల్సిన అవసరం లేకపోయినా పరిమితి తీసుకురావడంతో ఆయా వర్గాలకు తీరని అన్యాయం జరిగింది. అప్పట్లో బీసీ సంఘాలు నాయకులు ఆందోళన చేసినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. తిరిగి బీసీలకు నామినేటెడ్ పదవుల్లో 34 శాతం కోటా ఇస్తామని ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పుడు కేబినెట్ సమావేశంలో జగన్ తెచ్చిన సదరు చట్టాన్ని రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. లోపాలను సరిదిద్ది కొత్త చట్టాన్ని తీసుకురానున్నారు. అందులో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూనే ఎస్సీ, ఎస్టీలకు 15, 6 శాతం కోటాను కొనసాగించనున్నారు.

ఏపీలో మంత్రులకు ర్యాంకులు



ఎన్ఎండీ ఫరూక్, చంద్రబాబునాయుడు

- ఫరూక్ టాప్‌లో.. సీఎంకు ఆరో స్థానం
- 8లో లోకేశ్.. పదిలో పవన్

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి 2024 డిసెంబరు వరకు ఫైళ్లను పరిష్కరించడంలో మంత్రుల పనితీరు ఎలా ఉందనే అంశాన్ని కేబినెట్ సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. మంత్రుల్లో ఎవరెవరు, ఏ స్థానంలో ఉన్నారో చదివి వినిపించారు. తాను 6వ స్థానంలో ఉన్నట్లు సీఎం పేర్కొన్నారు. ఆరు నెలల్లో సగటున 2.30 గంటలకు ఒక ఫైల్ చొప్పున క్లియర్ చేసిన మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మొదటి స్థానంలో ఉన్నట్లు తెలిపారు. తమ వద్దకు వచ్చిన ఫైళ్లను వేగంగా పరిష్కరించాలని మంత్రులకు సూచించారు.

మంత్రుల ర్యాంకులు ఇలా..

1. ఎన్ఎండీ ఫరూక్ 2. కందుల దుర్గేశ్ 3. కొండపల్లి శ్రీనివాస్ 4. నాదెండ్ల మనోహర్ 5. డోలా బాలవీరాంజనేయస్వామి 6. చంద్రబాబు నాయుడు (సీఎం) 7. సత్యకుమార్ యాదవ్ 8. నారా లోకేశ్ 9. బీసీ జనార్దన్‌రెడ్డి 10. పవన్ కల్యాణ్ (డిప్యూటీ సీఎం) 11. ఎస్. సవిత 12. కొల్లు రవీంద్ర 13. గొట్టిపాటి రవికుమార్ 14. పి. నారాయణ 15. టి.జి. భరత్ 16. ఆనం రామనారాయణరెడ్డి 17. కె. అచ్చెన్నాయుడు 18. ఎం. రాంప్రసాద్‌రెడ్డి 19. గుమ్మడి సంధ్యారాణి 20. వంగలపూడి అనిత 21. అనగాని సత్యప్రసాద్ 22. నిమ్మల రామానాయుడు 23. కొలుసు పార్థసారథి 24. పయ్యావుల కేశవ్ 25. వాసంశెట్టి సుభాశ్

మరో అయిదేళ్లు మేమే: కోమటిరెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మరో అయిదేళ్లు తామే అధికారంలో కొనసాగుతామని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జోస్యం చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అనంతరం కోమటిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సీఎం సూచించారని చెప్పారు. బీఆర్ఎస్ తెలంగాణలో లేదని, బీజేపీ స్టేట్‌మెంట్‌లకు మాత్రమే పరిమితమైందని విమర్శించారు. వచ్చే అయిదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందన్నారు. ప్రతిపక్షాలకు ఏమీ పని పాట లేదని అందుకే ఇష్టారీతిన మాట్లాడుతున్నారని మంత్రి మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వంద శాతం సీట్లు కాంగ్రెస్ పార్టీ గెలిచే విధంగా పని చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించినట్లు తెలిపారు. తీన్మార్ మల్లన్న విషయంలో పార్టీ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

తెలంగాణకు రూ. 176 కోట్ల ప్రత్యేక ఆర్థిక పెట్టుబడి సాయం

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాలకు "ప్రత్యేక ఆర్థిక పెట్టుబడి సహాయ పథకం 2024-25" కింది జాతీయ రోడ్డు రవాణా శాఖ సాయం ప్రకటించింది. ఆయా విభాగాల్లో కీలక మైలురాయిని సాధించినందుకు తెలంగాణకు రూ.176కోట్ల ఆర్థిక సహాయం ఇవ్వనుంది. 15ఏళ్ల పైబడ్డ రవాణా వాహనాల తొలగింపు, ఇతర అంశాలకు సంబంధించి ఈ మొత్తాన్ని జాతీయ రోడ్డు రవాణా శాఖ అందిస్తుంది.

బర్డ్ ఫ్లూపై పౌల్ట్రీ ప్రతినిధులతో అధికారుల భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఇతరరాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో రాష్ట్రపశు సంవర్ధకశాఖ అప్రమత్తమైంది. గురువారం శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి పౌల్ట్రీ పరిశ్రమ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పౌల్ట్రీ రైతులు అవలంబించాల్సిన చర్యలపై పలుసూచనలు చేశారు. బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు రాష్ట్ర సరిహద్దుల దగ్గర చెక్‌పోస్టులను ఏర్పాటుచేశామని, పౌల్ట్రీ లేదా దానాను సరఫరా చేసే వాహనాల్ని రాష్ట్రంలోకి అనుమతించబోమని పేర్కొన్నారు.

118 మంది డీఈఈలకు త్వరలో పోస్టింగ్‌లు

రోడ్లు, భవనాల శాఖలో ఇటీవల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (ఏఈఈ)ల నుంచి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (డీఈఈ)లుగా పదోన్నతులు పొందిన 118 మందికి కొద్ది రోజుల్లో పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వనున్నారు. గురువారం హైదరాబాద్, ఎర్రమంజిల్‌లోని శాఖ కేంద్ర కార్యాలయంలో పదోన్నతులు పొందిన వారికి కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. దీంతో పాటు పోస్టింగ్ విషయంలోనూ ఏవైనా అభ్యంతరాలు ఉంటే చెప్పాలని సూచించారు.

విద్యుత్ డిమాండ్‌కు రెక్కలు

- 15,752 మెగావాట్లుగా నమోదు
- 11 ఏళ్లలో ఇప్పటి వరకు ఇదే అత్యధికం: ట్రాన్స్‌కో

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వేసవికి ముందే తెలంగాణలో విద్యుత్ డిమాండ్‌కు రెక్కలు వచ్చాయి. గురువారం రాష్ట్రంలో 15,752 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. 11 ఏళ్లలో ఇదే అత్యధికం. చివరగా 2024 మార్చి 8న 15,623 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ వచ్చింది. ఈ వేసవిలో 17 వేల మెగావాట్ల వరకు డిమాండ్ నెలకొనే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గృహ, వ్యవసాయ వినియోగం పెరగడంతోనే ఈ డిమాండ్ వస్తోందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు అత్యధిక డిమాండ్ వస్తుండటంతో జెన్‌కో కేంద్రాల్లో విద్యుత్ ఉత్పాదనను తగ్గించి, బహిరంగ విపణిలో కరెంట్ కొనుగోళ్లు చేయడం ద్వారా 2023 డిసెంబరు నుంచి 2025 జనవరి దాకా రూ.982.66 కోట్లు ఆదా చేశామని ట్రాన్స్‌కో సీఎండీ డి.కృష్ణ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

జాతీయ హోదా సాధ్యం కాదు

- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలపై కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా సాధ్యం కాదని కేంద్ర జలశక్తి సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి తెలిపారు. ఏపీ, తెలంగాణలో ఏ ఒక్క ఎత్తిపోతల పథకానికీ జాతీయ హోదా లేదన్నారు. జాతీయ హోదా ఇవ్వాలంటే ముందుగా కేంద్ర జల సంఘం సంబంధిత ప్రాజెక్టు సాంకేతిక, ఆర్థిక అంశాలను మదింపు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గురువారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ బలరాం నాయక్ అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

ఇకపై సీసీ కెమెరాల నిఘాలో ఇంటర్ పరీక్షలు!

హైదరాబాద్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఇకనుంచి రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలన్నీ సీసీ కెమెరాల నిఘాలో జరగనున్నాయి. పరీక్షల్లో మరింత పారదర్శకత తీసుకురావాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇంటర్ బోర్డు ఈ దిశగా చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్‌లో తొలిసారి సీసీ కెమెరాలు వినియోగిస్తున్నారు. ఇంటర్ రెండో సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులతో పాటు మొదటి, రెండో ఏడాది ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు ఈనెల 3న ప్రారంభమైన ప్రాక్టికల్ పరీక్షలు 22వ తేదీ వరకు కొనసాగనున్నాయి. మొత్తం 1,812 కేంద్రాల్లో ఈ పరీక్షలు విడతలవారీగా జరగనున్నాయి. ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్న కేంద్రాల్లో 830 కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి.. ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేశారు. జిల్లా కేంద్రాలతో పాటు ఇక్కడి కేంద్రంలోని సిబ్బంది పరీక్షలను పర్యవేక్షిస్తారని ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు.

'బనకచర్ల' మా అంతర్గతం!

- తెలంగాణ, కృష్ణా బోర్డు జోక్యానికి వీల్లేదు: ఆంధ్ర
- జల వనరుల శాఖ ప్రత్యేక సీఎస్‌తో కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి భేటీ
- రాష్ట్ర పరిధిలో వాటర్ గేజీలు ఏర్పాటు చేయం
- సాగర్ ఎడమ కాలువ వద్ద రాష్ట్ర ఎస్పీఎఫ్ సాయిప్రసాద్ స్పష్టీకరణ
- బెజవాడలోనే బోర్డు కార్యాలయం: రాయ్‌పురే

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న పోలవరం-బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ పథకం పూర్తిగా తమ రాష్ట్ర అంతర్గత వ్యవహారమని.. ఇందులో కృష్ణా నదీ యాజమాన్య బోర్డుగానీ, తెలంగాణ గానీ జోక్యం చేసుకునేందుకు వీల్లేదని ఏపీ జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ స్పష్టం చేశారు. గురువారమిక్కడ వెలగపూడి సచివాలయంలో బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే ఆయన్ను కలిశారు. పోలవరం-బనకచర్లపై తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలు.. నీటి లెక్కలు.. వాటర్ గేజీల అమరిక తదితర అంశాలను ప్రస్తావించగా.. సాయిప్రసాద్ ఘాటుగా స్పందించారు. 'ఈ ప్రాజెక్టు పూర్తిగా రాష్ట్ర పరిధిలోని అంశం. మా అంతర్గత జలాల వ్యవహారం. దీనిపై తెలంగాణకు అభ్యంతరాలేమిటి? ఇందులో కేఆర్ఎంబీ జోక్యం ఏమిటి' అని ప్రశ్నించారు. అభ్యంతరాలను బోర్డు లేవనెత్తడం లేదని.. తెలంగాణ మాత్రమే లేవనెత్తిందని రాయ్‌పురే చెప్పారు. నాగార్జున సాగర్ ఎడమ ప్రధాన కాలువ వద్ద సీఐఎస్ఎఫ్‌ను తొలగించాక.. భద్రతా సిబ్బంది లేకపోవడంపైనా చర్చకు వచ్చింది. అక్కడ రాష్ట్ర ఎస్పీఎఫ్ బలగాలను నియమించేందుకు ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావును సాయిప్రసాద్ ఆదేశించారు. తెలంగాణ ప్రతిపాదించినట్లుగా ఏపీ పరిధిలోని కృష్ణా ప్రాజెక్టుల్లో వాటర్ గేజ్‌లు ఏర్పాటు చేసేది లేదని రాయ్‌పురేకు తేల్చిచెప్పారు. జల వనరుల శాఖ ఇంజనీర్లను ఐదేళ్ల కాలానికి కేఆర్ఎంబీకి డిప్యుటేషన్‌పై పంపడానికి ఎలాంటి అభ్యంతరమూ లేదన్నారు.

కులగణనపై ఏఐసీసీ సంతృప్తి

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శితో సీఎం రేవంత్, భట్టి, ఉత్తమ్, మహేశ్ కుమార్ గౌడ్ భేటీ

కులగణనపై వస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని వివరణ.. పీసీసీ కార్యవర్గంపైనా చర్చలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం నిర్వహించిన కులగణనపై ఏఐసీసీ సంతృప్తి వ్యక్తం చేసింది. కులగణనపై విమర్శలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిలను అధిష్ఠానం ఢిల్లీకి పిలిపించింది. గురువారం రాత్రి ఢిల్లీ చేరుకున్న వెంటనే వీరు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా తాము జరిపించిన కులగణనను నిష్పాక్షికంగా జరిగిన తీరును రేవంత్ వివరించారు. ఎలాంటి ఎజెండా లేకుండా సమగ్రంగా ఈ కులగణన జరిగిందని, దానిపై వస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని వివరించారు. కాగా పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్‌ను నియమించి ఐదు నెలలు అయినప్పటికీ పార్టీ కార్యవర్గాన్ని నియమించలేదన్న విషయంపై కూడా చర్చ జరిగింది. పార్టీ కార్యవర్గంలోను, ఆఫీసు బేరర్లుగానూ ఎవరెవరెవరిని నియమించాలన్న విషయమ్మీద కూడా సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. పంచాయతీ ఎన్నికల నిర్వహణ కూడా చర్చకు వచ్చింది. దశలవారీగా స్థానిక ఎన్నికల నిర్వహణ పూర్తి చేయాలని కూడా పార్టీ నిర్ణయించినట్లు తెలిసింది. అసంతృప్త ఎమ్మెల్యేలు సమావేశమవుతున్నారన్న వార్తలపైనా వేణుగోపాల్ ఆరా తీసినట్లు తెలిసింది. ఇందులో పెద్ద ఆందోళన పడాల్సిన అవసరం లేదని, కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపు జరగడం లేదని కొందరు ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారని వివరించినట్లు సమాచారం. కాగా శుక్రవారం ఉదయం రేవంత్, ఇతర పార్టీ నేతలు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి చర్చించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా రెండు, మూడు రోజుల్లో పీసీసీ కార్యవర్గాన్ని అధిష్ఠానం ప్రకటిస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కేసీ వేణుగోపాల్‌తో భేటీ ముగిశాక ఆయన మీడియాతో మాట్లాడారు. క్యాబినెట్ విస్తరణపైనా చర్చ జరిగిందని వెల్లడించారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ పూర్తయిన నేపథ్యంలో అధిష్ఠానం పెద్దల్ని ఆహ్వానించేందుకే తాము ఢిల్లీ వచ్చినట్లు చెప్పారు. త్వరలోనే రాష్ట్రానికి రాహుల్ గాంధీ వస్తానని వెల్లడించారు. కాగా కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలు ప్రజలు కోరుకున్నవేనని మంత్రి ఉత్తమ్ అన్నారు. ఈ రెండు అంశాలపై భారీ బహిరంగసభ ఏర్పాటు చేయాలని, దాని గురించి అధిష్ఠానం పెద్దలతో చర్చించడానికే ఢిల్లీ వచ్చినట్లు వెల్లడించారు.

పడవకు చిల్లు పడితే..

అందరమూ మునుగుతాం

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయాలపై క్యాబినెట్ అనుమతి లేకుండా ఎవరూ అడ్డగోలు ప్రకటనలు చేయవద్దని హెచ్చరించారు. అలాంటి నిర్ణయాలను.. మంత్రివర్గం నిర్దేశించిన వారు మాత్రమే ప్రకటించాలన్నారు. సమగ్ర కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణ చరిత్రాత్మక నిర్ణయాలని.. దేశంలోనే మొదటి సారిగా తెలంగాణ ప్రభుత్వం వాటిని చేపట్టిందని సీఎం ఈ భేటీలో పేర్కొన్నారు. నిధులకు కొరత ఉన్నా.. రైతు రుణ మాఫీ అమలు, సన్న వడ్లకు బోనస్, 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తు, రూ.500కే వంట గ్యాస్, రైతు భరోసా తదితర పథకాలనూ అమలు చేస్తూ వస్తున్నామన్నారు. "ఏడాది పాలనలో మనం సాధించింది తక్కువేం కాదు. అయితే.. చేసింది ప్రజలకు చెప్పుకోలేక పోతున్నాం. చేసింది చెప్పుకోవడానికి మొహమాట పడాల్సిన అవసరం లేదు. దూకుడుగా ముందుకు వెళదాం" అన్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలతో పాటు ఏడాదిలో అమలు చేసిన కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. ఇందుకోసం మండలాలస్థాయిలో అంబేడ్కర్ విగ్రహాల నుంచి పెద్ద ఎత్తున ర్యాలీలు తీయాలని సూచించారు. కొత్త ఎమ్మెల్యేలు మొదటిసారి గెలవడం తేలికేనని, ప్రజలతో మమేకమైతేనే రెండోసారి గెలుస్తారని పేర్కొన్నారు.



సీఎల్పీ సమావేశం సందర్భంగా సీఎం రేవంత్‌కు మొక్కను అందజేస్తున్న విప్ ఆది శ్రీనివాస్. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

సభలు పెట్టి చెబుదాం..

కులగణన, ఎస్సీ వర్గీకరణ నిర్ణయాలపై నెలాఖరులోగా రాష్ట్రంలో రెండు భారీ బహిరంగ సభలను నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. కులగణన సర్వేపై సూర్యాపేటలో లక్షలాది మందితో.. ఎస్సీ వర్గీకరణపై గజ్వేల్ (లేదా) నర్సాపూర్‌లో భారీ బహిరంగ సభలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ సభలకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఆహ్వానించేందుకు ఢిల్లీ వెళుతున్నామన్నారు. దేశంలోనే తొలిసారి కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసిన తీరు గురించి రాహుల్‌కు, ఖర్గేకు వివరించనున్నట్లు వెల్లడించారు. కాగా.. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేల్లో పలువురు.. తీన్మార్ మల్లన్న వ్యవహారశైలిని తప్పుబట్టారు. పార్టీ లైన్ దాటి మాట్లాడిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. ఇక.. రైతు రుణ మాఫీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నా వాటిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేక పోతున్నామని పార్టీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తదితరులు ఆవేదన వెలిబుచ్చారు. స్థానిక ఎన్నికల్లో బలహీన వర్గాలకు 42 శాతం టిక్కెట్లు ఇస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన హర్షణీయమని.. దీనివల్ల ఆ వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం లభిస్తుందని జీవన్‌రెడ్డి అన్నారు. రైతు భరోసా సహా వివిధ కార్యక్రమాలకు, నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు త్వరిత గతిన నిధులు విడుదల చేస్తామని పార్టీ ఎమ్మెల్యేలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో.. సర్కారు చేసిన పనులన్నింటినీ ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. శాస్త్రీయంగా కులగణన సర్వే జరిగిన తీరు గురించి మంత్రి ఉత్తమ్ వివరించగా.. ఎస్సీ వర్గీకరణ జరిగిన తీరు గురించి మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన కొన్ని గంటల్లోనే దాని అమలుకు సంబంధించి శాసనసభలో ప్రకటన చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. వర్గీకరణ అమల్లోకి వచ్చిన తర్వాతనే రిక్రూట్‌మెంట్లు చేపడతామని చెప్పారని గుర్తుచేశారు.

ఆ నలుగురు తప్ప..

స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వాకాటి శ్రీహరి, దొంతి మాధవరెడ్డి వినహా ఈ సమావేశానికి అందరు ఎమ్మెల్యేలూ హాజరయ్యారు. రాని వారు వ్యక్తిగత కారణాలతోనే హాజరు కాలేదని పార్టీ వర్గాలు తెలిపాయి. అలాగే పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు పదిమంది హాజరు కాలేదు. కులగణన సర్వేకు సంబంధించి ప్రభుత్వంపై విమర్శలు చేసిన తీన్మార్ మల్లన్న కూడా రాలేదు. కాగా.. ఈ భేటీ అనంతరం సీఎం రేవంత్ ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఆయనతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ తదితరులూ వెళ్లారు. రాహుల్‌ను, ఖర్గేను కలిసి కులగణన, ఎస్సీ వర్గీకరణ సభలకు రావాలని ఆహ్వానించనున్నారు.

మరో మూడు రోజుల్లో పీసీసీ కార్యవర్గం: మహేశ్‌కుమార్ గౌడ్

మరో మూడు రోజుల్లో టీపీసీసీకి నూతన కార్యవర్గం ఏర్పాటు కానున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. కార్యవర్గం కూర్పునకు సంబంధించి.. గురువారంనాటి సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయాలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించే కార్యాచరణనూ సూచించామన్నారు. కులగణన శాస్త్రీయంగా జరిగినా బీసీ సంఘాలను ప్రతిపక్షం తప్పుదోవ పట్టిస్తోందని.. ఈ నేపథ్యంలో వాస్తవాలను ప్రజలకు వివరించాల్సిందిగా సూచించామని తెలిపారు. కులగణన, ఎస్సీ వర్గీకరణపై అవాస్తవాలను ప్రచారం చేస్తున్న వారి నోళ్లు మూయించేలా ఈ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. బీజేపీతో బీఆర్ఎస్‌కున్న లోపాయికారీ ఒప్పందాన్ని బలోపేతం చేసుకునేందుకే కేటీఆర్ ఢిల్లీకి వెళ్లినట్లు తమకు అనుమానం కలుగుతోందని ఆయన వ్యాఖ్యానించారు.



సభలో బూర ఊదుతున్న పిడమర్తి రవి, ఎమ్మార్పీఎస్, మాదిగ జేఏసీ నాయకులు

మందకృష్ణ బీజేపీ ఏజెంట్

- ఆయనకు వర్గీకరణ ఇష్టం లేదు
- ఉద్యమం పేరుతో రూ.కోట్లు పోగేశారు: పిడమర్తి రవి

ఉప్పల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మందకృష్ణకు ఎస్సీ వర్గీకరణ ఇష్టం లేదని మాదిగ జేఏసీ ఫౌండర్ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని అడ్డం పెట్టుకుని, 30 ఏళ్లుగా రాజకీయ పార్టీలతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకుని రూ.500 కోట్ల ఆస్తులు సంపాదించాడని విమర్శించారు. మందకృష్ణ బీజేపీ ఏజెంట్‌లా పనిచేస్తున్నారని, మాదిగ జాతిని మనువాదం వైపు, రిజర్వేషన్లు అంటేనే గిట్టని బీజేపీ వైపు మళ్లించేందుకు కుట్ర చేస్తున్నాడని మండిపడ్డారు. మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో ఉప్పల్‌లో ఏర్పాటు చేసిన రేవంత్‌రెడ్డి అభినందన సభలో రవి మాట్లాడారు. వర్గీకరణకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదంతో మందకృష్ణకు ఏ పనీ లేకుండా పోయిందన్నారు. అందుకే తన పబ్బ గడుపుకునేందుకు 11 శాతం రిజర్వేషన్లు కావాలంటూ కొత్త రాగం ఎత్తుకున్నాడని ధ్వజమెత్తారు. మోదీని ఒప్పించి, ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో పాస్ చేయిస్తేనే మందకృష్ణను ప్రజలు నమ్ముతారని పేర్కొన్నారు. రేపటి నుంచి మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మండల, జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో మాదిగలు సీఎం రేవంత్‌రెడ్డి అభినందన సభలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

మాదిగలకు 11% రిజర్వేషన్ ఇవ్వాలి

- త్వరలోనే సీఎం రేవంత్‌కు కృతజ్ఞత సభ: మేడి పాపయ్య

పంజాగుట్ట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆమోదం తెలిపినందుకు రాష్ట్ర సర్కారు, సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ అన్నారు. తమ జనాభా దామాషా ప్రకారం 11 శాతం రిజర్వేషన్లు రావాలని, దీనిపై సీఎం పునరాలోచించాలని కోరారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో పాపయ్య మాట్లాడారు. త్వరలోనే ఎల్బీ స్టేడియంలో లక్షల మందితో అభినందన సభ ఏర్పాటు చేసి సీఎం రేవంత్ రెడ్డిని ఘనంగా సన్మానిస్తామని తెలిపారు. వర్గీకరణ చట్టం తెచ్చి, జీవో జారీ చేసి, విద్య, ఉద్యోగ రంగాల్లో వెంటనే అమలు చేయాలని కోరారు.

ప్రజా ప్రతినిధుల సిఫారసు బిల్లులకు ప్రాధాన్యం

- మంత్రుల్లో ఎక్కువ క్లియరైంది జూపల్లివే
- ఉత్తమ్, పొంగులేటి తక్కువ సిఫారసులు
- సీఎల్పీ భేటీలో వెల్లడించిన భట్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫారసు చేసిన ఆర్థిక బిల్లులను క్లియర్ చేయడానికి ప్రాధాన్యమిస్తున్నామని డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్తు శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ప్రజా ప్రతినిధుల బిల్లులను క్లియర్ చేయడం లేదన్న ఆరోపణలు వాస్తవం కాదని, వారు సిఫారసు చేసిన బిల్లులకు ప్రాధాన్యమిస్తున్నామంటూ సీఎల్పీ సమావేశంలో ఆధారాలతో సహా ఆయన వివరించారు. సీఎల్పీ సమావేశంలో బిల్లుల క్లియరెన్స్ అంశం హాట్ టాపిక్‌గా మారింది. వెనక సీట్లలో కూర్చున్న ఓ ఎమ్మెల్యే లేచి తమ బిల్లులను పట్టించుకోవడం లేదని చెప్పారు. దీనికి వెంటనే స్పందించిన భట్టి విక్రమార్క.. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బిల్లుల క్లియరెన్స్ గురించి సోదాహరణంగా వివరించారు. ఏ మంత్రి, ఏ ఎమ్మెల్యే ఎన్నెన్ని సిఫారసులు చేశారు?, ఎన్ని బిల్లులను క్లియర్ చేయడం జరిగింది? వాటికి చెల్లించిన నిధులు ఎన్ని తదితర వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సిఫారసు లేఖలు ప్రజా ప్రతినిధుల లెటర్ హెడ్స్‌పై వచ్చినట్లు చూపించారు. ఆర్థిక శాఖ ద్వారా క్లియర్ చేస్తున్న వివిధ రకాల బిల్లుల విషయంలో ఇప్పటికే ఆరోపణలు వస్తున్నాయి. కమీషన్లు, పర్సంటేజీలు ఇచ్చిన వారి బిల్లులను మాత్రమే క్లియర్ చేస్తున్నారని అటు ప్రతిపక్షాలు, ఇటు ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఆర్థిక శాఖలో సంవత్సరాల తరబడి పాతుకుపోయిన కొంతమంది అధికారులు, ప్రభుత్వ పెద్దల చేతివాటమే ఇందుకు కారణమని విమర్శిస్తున్నారు. ఎమ్మెల్యేలు అలిగి ప్రత్యేకంగా సమావేశాలు పెట్టుకోవడానికి బిల్లులు క్లియర్ కాకపోవడం కూడా ఒక కారణమన్న చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో బిల్లుల క్లియరెన్స్‌పై భట్టి విక్రమార్క స్పష్టతనిచ్చినట్లు తెలిసింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సిఫారసు చేస్తున్న కాంట్రాక్టు పనుల తాలూకు బిల్లులతో పాటు ఉద్యోగుల సప్లిమెంటరీ బిల్లులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు వంటివాటిని క్లియర్ చేస్తున్నామని చెప్పినట్లు సమాచారం. బిల్లులు ఎక్కువగా క్లియర్ చేసుకున్న మంత్రుల్లో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అగ్రస్థానంలో ఉన్నారని తెలిసింది. తక్కువగా క్లియర్ చేయించుకున్న మంత్రుల్లో ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారని సమాచారం. కొంతమంది మంత్రులు నేరుగా సీఎం రేవంత్ ద్వారా క్లియర్ చేయించుకుంటుండడంతో భట్టి ద్వారా తక్కువ మంది వెళ్లినట్లు తేలిందని చర్చ జరుగుతోంది.



వీసీల నియామకాన్ని

గవర్నర్లకు అప్పగించడాన్ని సహించం

- తెలంగాణ విద్యాకమిషన్ సదస్సులో మేధావుల ఆగ్రహం
- యూజీసీ తాజా నిబంధనలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): వర్సిటీలకు వీసీలను నియమించే అధికారాన్ని గవర్నర్లకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు విద్యావేత్తలు, సామాజిక ఉద్యమకారులు ప్రకటించారు. తెలంగాణ విద్యా కమిషన్ ఆధ్వర్యంలో గురువారం బషీర్‌బాగ్‌లోని రాజీవ్ విద్యామిషన్ భవనంలో 'యూజీసీ నిబంధనలు-రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో జోక్యం' అంశంపై సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ యూజీసీ ఒరిజినల్ చట్టంలో వీసీల ప్రస్తావనే లేదన్నారు. గవర్నర్లలాగే వైస్‌ఛాన్సలర్లనూ రాజకీయ పనిముట్లుగా కేంద్రం వాడుకుంటోందని విమర్శించారు. ప్రొ. మురళీ మనోహర్ మాట్లాడుతూ దేశంలో కుల అసమానతలు మరింతగా పెంపొందించడానికే యూజీసీ ఈ నిబంధనలు తీసుకొచ్చిందన్నారు. రామన్ మెగసెసే అవార్డు గ్రహీత ప్రొ. శాంతా సిన్హా మాట్లాడుతూ యూజీసీ నిబంధనలను రాష్ట్ర వర్సిటీలు అమలు చేయకపోతే గుర్తింపు రద్దు లేదా నిధుల నిలుపుదల వంటి కఠిన చర్యలు తీసుకుంటామనడం అన్యాయమని ఆక్షేపించారు. హెచ్‌సీయూ విశ్రాంత ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉన్నత విద్యావ్యవస్థలను హిందుత్వమయం చేయడంలో భాగంగానే నూతన విద్యావిధానం, యూజీసీ తాజా ముసాయిదా రూపకల్పన వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సభాధ్యక్షత వహించిన తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి మాట్లాడుతూ వైస్ ఛాన్సలర్లను నియమించే అధికారాలను కేంద్రం లాక్కునే ప్రయత్నం చేస్తుందని, దీన్ని రాష్ట్రాలపై దాడిగా పరిగణించాలని అన్నారు. యూజీసీ తాజా నిబంధనలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రొ. రమామెల్కోటే మాట్లాడుతూ భిన్న సంస్కృతులు, విభిన్న వైవిధ్యతలు కలిగిన వివిధ రాష్ట్రాల పరిధిలోని విశ్వవిద్యాలయాలన్నింటికీ ఒకే ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామనడం సరికాదని హితవు పలికారు. యూజీసీ కొత్త ముసాయిదాలోని నిబంధనలు పూర్తి అప్రజాస్వామికంగా ఉన్నాయని ప్రొఫెసర్లు హరగోపాల్, డి. నరసింహారెడ్డి, పీఎల్ విశ్వేశ్వరరావు, సత్యనారాయణ, ముత్యం రెడ్డి, పద్మజా షా, తిరుపతి రావు, ఎమ్మెల్సీ కోదండరాం తదితరులు ఆరోపించారు.



బషీర్‌బాగ్‌లో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి



సీఎం రేవంత్‌తో ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సద్గురు జగ్గీ వాసుదేవ్

సీఎం రేవంత్‌ను కలిసిన సద్గురు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సద్గురు జగ్గీ వాసుదేవ్.. గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు కొద్దిసేపు ముచ్చటించుకున్నారు.

మీ ఆలోచనలు అద్భుతం..!

- తెలంగాణ భవిష్యత్తుపై మీ దూరదృష్టి అమోఘం
- సీఎం రేవంత్‌పై డబ్ల్యూఈఎఫ్ అధ్యక్షుడి ప్రశంసలు..

హైదరాబాద్, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి):తెలంగాణ భవిష్యత్తుకు సంబంధించి మీ ఆలోచనలు అద్భుతంగా ఉన్నాయంటూ సీఎం రేవంత్‌ను ప్రపంచ ఆర్థికసదస్సు (డబ్ల్యూఈఎఫ్) అధ్యక్షుడు బోర్గ్ బ్రెండ్ ప్రశంసించారు. రేవంత్ దూరదృష్టిని, సమర్థ ఆలోచన విధానాన్ని, సమాజహితం కోసం చేపడుతున్న కార్యక్రమాల్ని ఆయన కొనియాడారు. గత నెలలో దావోస్‌లో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం పాల్గొని రూ.1.78 లక్షల కోట్ల భారీ పెట్టుబడుల ఒప్పందాలు కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డబ్ల్యూఈఎఫ్ అధ్యక్షుడు గురువారం సీఎంకు లేఖ రాశారు. రేవంత్ నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం విజయవంతం కావడాన్ని ఆయన అభినందించారు. వచ్చే పదేళ్లలో తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేసేందుకు సీఎం రచిస్తున్న ప్రణాళికలు బాగున్నాయని పేర్కొన్నారు. దేశంలోనే తొలి కర్బన ఉద్గార రహిత (నెట్ జీరో కార్బన్ సిటీ) నగరాన్ని హైదరాబాద్ సమీపంలో అభివృద్ధి చేయడం, 2047లోపు తెలంగాణను నెట్ జీరో రాష్ట్రంగా రూపొందించాల న్న లక్ష్యం తనను ఎంతో ఆకట్టుకుందన్నారు. ఏఐ సిటీ ఏర్పాటుతో దేశం లో సాంకేతిక రంగంలో తెలంగాణ తన ప్రత్యేకత చాటుతుందని వెల్లడించారు.

ఇమేజింగ్ టెక్నాలజీతో క్యాన్సర్ చికిత్సలో అనూహ్య మార్పులు

» జాన్ హాప్‌కిన్స్ వర్సిటీ ప్రొఫెసర్ శ్రీధర్ నిమ్మగడ్డ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇమేజింగ్ టెక్నాలజీతో క్యాన్సర్ చికిత్స, ఔషధాల అభివృద్ధిలో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని అమెరికాలోని జాన్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ నిమ్మగడ్డ శ్రీధర్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూ బయోటెక్నాలజీ విభాగంలో 'ఇమేజింగ్ ఫర్ డ్రగ్ డెవలప్‌మెంట్' అంశంపై గురువారం జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇమేజింగ్ టెక్నాలజీ ఆధారంగా ఔషధాల అభివృద్ధి, క్యాన్సర్ చికిత్సను మెరుగుపరిచేందుకు శాస్త్రవేత్తలు అధునాతన వైద్య పద్ధతులను అవలంబిస్తున్నారని ఆయన తెలిపారు. ఆధునిక క్యాన్సర్ చికిత్సలు అత్యంత ఖరీదైనవని, ఒక రోగికి ఏడాదికి రూ.1.20 కోట్ల వరకు ఖర్చవుతోందన్నారు. శరీరంలోని క్యాన్సర్ కణాలను సరైన సమయంలో గుర్తించేందుకు ఇమేజింగ్ టెక్నాలజీ దోహదపడుతుందని, దీని కోసం పాజిట్రాన్ ఎమిషన్ టోమోగ్రఫీ ఇమేజింగ్‌ను శాస్త్రవేత్తలు ఉపయోగిస్తున్నారని తెలిపారు. క్యాన్సర్ చికిత్స ఫలితాలపై ఆహారం, గట్ మైక్రోబయోమ్ ముఖ్యమైన ప్రభావం చూపుతాయని ఇటీవలి అధ్యయనాలు నిరూపించాయని డాక్టర్ శ్రీధర్ తెలిపారు. అధిక మాంసాహారం ప్రతికూల ప్రభావం చూపడంతో క్యాన్సర్ చికిత్స సామర్థ్యం తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు.

జూన్ 1న ఎడ్‌సెట్.. 11న పీఈసెట్

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీఈడీ ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్, వ్యాయామ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే పీఈసెట్ షెడ్యూళ్లు విడుదలయ్యాయి. గురువారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ షెడ్యూళ్లు ఖరారు చేశారు. మార్చి 10న ఎడ్‌సెట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. మార్చి 12 నుంచి మే 13 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి, జూన్ 1 నుంచి రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారు. ఈ దఫా ఎడ్‌సెట్ నిర్వహణ బాధ్యతలను కాకతీయ యూనివర్సిటీ చేపట్టింది. అలాగే మార్చి 12న పీఈసెట్ నోటిఫికేషన్ విడుదల చేసి, మార్చి 15 నుంచి మే 24వరకు దరఖాస్తు స్వీకరిస్తారు.

హెచ్‌సీయూలో డిప్లమో కోర్సులకు నోటిఫికేషన్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి):హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఏడాది డిప్లమో కోర్సుల్లో ప్రవేశాల కోసం సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్(సీడీవీఎల్) అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులు, పట్టభద్రులు, ఉద్యోగుల్లో నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఈ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి గలవారు మార్చి 15లోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు విధానం, ఫీజు, అర్హతల వంటి వివరాల కోసం హెచ్‌సీయూ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని సూచించారు.

నేడు పోలీసు విచారణకు ఆర్జీవీ

ఒంగోలుక్రైం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వివాదాస్పద సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ శుక్రవారం ఒంగోలు రూరల్ పోలీసు స్టేషన్‌లో జరిగే విచారణకు హాజరుకానున్నారు. ఉదయం 7 గంటలకు ఒంగోలు రూరల్ సర్కిల్ కార్యాలయంలో విచారణ జరగనుంది. అందుకు సంబంధించి పోలీసులు పటిష్ఠంగా భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌ల ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో ఆర్జీవీ పోస్టు చేశారు. దీనిపై గతేడాది నవంబరు 10న ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

ప్రైవేటు ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చలేరు


» ఆ అధికారం ప్రభుత్వాధికారులకు లేదు: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22-ఏ పరిధిలోకి రాని ప్రైవేటు ఆస్తులను నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చలేరని హైకోర్టు పేర్కొంది. అన్ని పత్రాలూ ఉన్న ప్రైవేటు ఆస్తుల రిజిస్ట్రేషన్‌ను అడ్డుకునే అధికారం ప్రభుత్వ అధికారులకు లేదని స్పష్టం చేసింది. 'వింజమూరి రాజగోపాలచారి' కేసులో సెక్షన్ 22-ఏకు సంబంధించి అనుసరించాల్సిన మార్గదర్శకాలను ఇదే హైకోర్టు విస్తృత ధర్మాసనం జారీ చేసిందని గుర్తుచేసింది. ఆ సెక్షన్‌కు విరుద్ధంగా అధికారులు తమకు నచ్చినట్లుగా ప్రైవేటు ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చలేరని పేర్కొంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని బాచుపల్లిలో సర్వే నంబరు 132లో ఉన్న 1.26 ఎకరాల భూమి సేల్ డీడ్ సిద్ధం చేసుకొని ధరణి పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత రిజిస్ట్రేషన్ నిలిపేయడం చెల్లదని హైకోర్టులో టి.వెంకటసుబ్బయ్య, ఎన్.ప్రశాంత్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. చట్టప్రకారం అన్ని పత్రాలు ఉంటే రిజిస్ట్రేషన్ చేయాల్సిందేనని, నాలుగు వారాల్లో ఈ ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించింది.

చక్రధర్‌గౌడ్ ఫోన్ ట్యాపింగ్ కేసులో రాధాకిషన్‌రావును అరెస్ట్ చేయొద్దు: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకుడు, వ్యాపారి చక్రధర్‌గౌడ్ ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఏ-2గా ఉన్న మాజీ పోలీసు అధికారి రాధాకిషన్‌రావును ఈ నెల 12 వరకు అరెస్ట్ చేయరాదంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. హరీశ్‌రావు ఆదేశాలతో తన ఫోన్ ట్యాపింగ్ చేయడంతోపాటు చంపుతామని బెదిరించారని చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో హరీశ్‌రావు ఏ1గా, రాధాకిషన్‌రావు ఏ2గా ఉన్నారు. కేసును కొట్టేయాలంటూ హరీశ్‌రావు ఇప్పటికే క్వాష్ పిటిషన్ దాఖలు చేయగా విచారణ ఈ నెల 12కు వాయిదా పడింది. రాధాకిషన్‌రావు కూడా క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది.

నాస్తికోద్యమ నాయకురాలు డాక్టర్ మారు మృతి



విజయవాడ (పటమట), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైద్యురాలు, సామాజిక సేవకురాలు, నాస్తికోద్యమ నాయకురాలు సరస్వతి గోరా 4వ కుమార్తె డాక్టర్ మారు (80) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. ఆమె డాక్టర్ సమరానికి సోదరి. వీరిద్దరూ విజయవాడలో 55 ఏళ్లుగా వాసవ్య నర్సింగ్ హోం ద్వారా సేవలందిస్తున్నారు. డాక్టర్ మారు.. అనేక గ్రామాల్లోను, గిరిజన ప్రాంతాల్లోను సేవలందించడమే కాకుండా మూఢనమ్మకాల నిర్మూలనకు ఎంతో కృషిచేశారు. కొన్ని వేలమంది పోలియో కలిగిన చిన్నారులకు ఉచితంగా శస్త్రచికిత్స చేయించారు. శుక్లాల ఆపరేషన్లు వేలల్లో చేయించడమే కాకుండా, వందలాది మందికి నర్సింగ్ ట్రైనింగ్ అందించడంలోనూ ఆమెది కీలకపాత్ర. నాస్తికోద్యమ కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొన్నారు. ఆమె మృతి విషయం తెలియగానే, అభిమానులు తరలివచ్చి నివాళులర్పించారు. ఆమె నేత్రాలను స్వేచ్ఛ గోరా ఐ బ్యాంక్‌కు దానం చేశారు. ప్రముఖ సంఘ సేవకుడు, ఆమె భర్త శ్రీహరి సుబ్రహ్మణ్యం, కుమారుడు డాక్టర్ ఓలాస్ గోరా, కోడలు డాక్టర్ సుదీప్తి వర్ధన్, మనుమడు సాహస్.. తుది గడియల్లో ఆమె చెంతనే ఉన్నారు. ఆమె అంతిమ యాత్ర శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతుందని నాస్తిక కేంద్రం నిర్వాహకులు తెలిపారు.

రహదారులకు మహర్దశ!

3 దశల్లో 12,000 కిలోమీటర్ల రోడ్ల పనులు

» 96 నియోజకవర్గాల్లో రోడ్ల గుర్తింపు

» 'హ్యామ్' విధానంలో పనులకు ఆర్ అండ్ బీ కసరత్తు



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి జిల్లాకు, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర రాజధాని వరకు రహదారుల నిర్మాణంపై రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ(ఆర్ అండ్ బీ) దృష్టి సారించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 96 నియోజకవర్గాల్లోని 12,000 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం, మరమ్మతు పనులను మూడు దశల్లో పూర్తి చేసేందుకు ఓ రూట్ మ్యాప్‌ను కూడా సిద్ధం చేసింది. నిజానికి, రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, గిరిజన శాఖ పరిధిలో దాదాపు 30వేల కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పంచాయతీ రాజ్ శాఖను నోడల్ ఏజెన్సీగా ఏర్పాటు చేసి ఏ శాఖ పరిధిలోని రహదారులను ఆ శాఖలే పూర్తి చేయాలని ఆదేశించింది. అయితే, హైబ్రీడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్) విధానంలో పనులు చేపట్టాలని సూచించింది. హ్యామ్ విధానంలో రోడ్ల పనులు నిర్వహించేందుకు ముందుకు వచ్చే కంపెనీలకు ప్రభుత్వం 40శాతం నిధులు అందిస్తుంది. విుగిలిన 60 శాతాన్ని బ్యాంకు రుణాలు తీసుకుని పనులు చేపట్టేలా ఒప్పందాలు జరగనున్నాయని సమాచారం. కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ సుమారు 10-15ఏళ్ల పాటు రహదారి నిర్వహణ చూసుకునేలా ఒప్పందం ఉండనుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో అమల్లో ఉన్న కాంప్రహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రామ్ (సీఆర్ఎంపీ) విధానంలోనే ఇది అమలుకానున్నట్టు తెలిసింది. అయితే, ఏదైనా మార్గంలో టోల్ ఏర్పాటు ఉంటుందా? అనే అంశం డీపీఆర్‌లు సిద్ధమైన తర్వాతే తెలుస్తుంది.

ఏప్రిల్‌లో టెండర్లు

ఆర్ అండ్ బీ పరిధిలో 96 నియోజకవర్గాలలోని 12వేల కిలోమీటర్ల మేర చేపట్టాల్సిన పనులను మూడు దశల్లో పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. తొలి దశలో 4,600 కి.మీ, రెండో విడతలో 4,600కి.మీ, మూడో దశలో 2,800 కిలోమీటర్ల చొప్పున పనులు పూర్తి చేయాలని అనుకుంటున్నారు. వీటిల్లో మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రెండు లేన్లు, జిల్లా కేంద్రం నుంచి రాజధాని వరకు రెండు నాలుగు లేన్లను నిర్మించనున్నారు. వీటి అభివృద్ధికి సంబంధించిన డీపీఆర్) తయారీ బాధ్యతను ఇప్పటికే ఓ సంస్థకు అప్పగించారు. తొలి దశలో చేపట్టే పనులకు సంబంధించిన డీపీఆర్‌లను మార్చి చివరి వారం లోగా అందజేయాలని ఆ సంస్థకు సూచించారు. అనంతరం ఏప్రిల్ మొదటి వారంలో పనుల నిర్వహణకు టెండర్లను ఆహ్వానించాలని ఆర్అండ్ బీ లక్ష్యంగా పెట్టుకుంది.

నియోజకవర్గాల వారీగా రోడ్ల గుర్తింపు..

హ్యామ్ విధానంలో నిర్మించబోయే రహదారుల సమగ్ర వివరాలను నియోజకవర్గాల వారీగా అధికారులు సేకరించారు. ప్రాథమిక వివరాల ప్రకారం.. మానుకొండూరు నియోజకవర్గంలో అత్యధికంగా 241.79కి.మీ మేర రహదారి పనులు నిర్వహించాల్సి ఉంది. వీటిలో రహదారి మరమ్మతు పనులే అధికంగా ఉన్నాయి. ఆసిఫాబాద్‌లో 232కి.మీ, ఇల్లందు 212కి.మీ, పెద్దపల్లి 195కి.మీ, మధిర 194.6కి.మీ, సత్తుపల్లిలో 172, పాలేరులో 114, అలంపూర్‌లో 182, మక్తల్‌లో 199కి.మీ, భూపాలపల్లిలో 167, వికారాబాద్ 187, చేవెళ్ల 157 కి.మీ చొప్పున ఉన్నాయి. మిగిలిన నియోజకవర్గాల్లోనూ ఇదే విధంగా ఉన్నా..కిలోమీటర్లలో హెచ్చుతగ్గులున్నాయి.

సమాజం కోసం మనం సైతం!

» రెండు రాష్ట్రాల్లో తలసేమియా సెంటర్లు

» నిధుల సేకరణకే తమన్‌తో 15న మ్యూజికల్ షో: భువనేశ్వరి

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సమాజం గురించి ఆలోచించి... సమాజానికి ఏదో ఒకటి చేయాలని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్, ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. తలసేమియా బాధిత పిల్లల కోసం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మ్యూజికల్ షో గురించి వివరించేందుకు సంగీత దర్శకుడు తమన్‌తో కలిసి గురువారం ఆమె విజయవాడలో మీడియాతో మాటాడ్లారు. "తలసేమియా బాధిత పిల్లలకు రెండు లేదా నాలుగు నెలల్లో రక్తమార్పిడి చేయాల్సి ఉంటుంది. దీనికి ఎంతో రక్తం అవసరం. ప్రతి ఒక్కరూ, కుటుంబ సభ్యులతో సహా రక్తదానం చేయాలి. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తలసేమియా సెంటర్లు ప్రారంభించాలని అనుకున్నాం. ఈ సెంటర్లకు నిధుల సేకరణ కోసమే ఈ మ్యూజికల్ షో ఏర్పాటు చేశాం. దీని గురించి చెప్పగానే తమన్ అంగీకరించారు. మా ట్రస్ట్ చేసే కార్యక్రమాలు చూసిన తర్వాత షో మొత్తం ఫ్రీగా చేస్తానని అంగీకరించారు" అని భువనేశ్వరి తెలిపారు.

తీన్మార్ మల్లన్నకు షోకాజ్ నోటీస్

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశిస్తూ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి షోకాజ్ నోటీసు జారీచేశారు. కుల గణన నివేదికపై బీసీల మనోభావాలకు తూట్లు పొడిచేలా చేసిన వ్యాఖ్యలపై క్రమశిక్షణ కమిటీకి పార్టీ శ్రేణులతో పాటు ఓబీసీ సంఘాల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని నోటీసు జారీ చేస్తున్నట్లు చిన్నారెడ్డి స్పష్టం చేశారు. కులగణన నివేదికపై మంత్రివర్గంలో చర్చించిన తర్వాత 10 శాతం ముస్లిం వర్గాలతో కలిపి రాష్ట్రంలో 56 శాతానికి పైగా బీసీలు ఉన్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో ప్రకటించారన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీగా బాధ్యతలను విస్మరించి, పార్టీ ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా మాట్లాడడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. 12లోగా సరైన వివరణ అందించాలని, లేని పక్షంలో పార్టీ నిబంధనలకు అనుగుణంగా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి వస్తుందని నోటీసులో స్పష్టం చేశారు.

నాయకుడికి క్యారెక్టర్, క్రెడిబిలిటీ ఉండాలి

» ప్రలోభాలకో.. భయపడో కాంప్రమైజ్ అయితే మన గౌరవం ఏంది?

» సాయిరెడ్డికైనా.. ఎవరికైనా ఇదే వర్తిస్తుంది: జగన్



అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజకీయ నాయకుడికి క్యారెక్టర్, క్రెడిబిలిటీ ఉండాలని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. వైసీపీని వీడిన విజయసాయిరెడ్డికి కూడా ఇది వర్తిస్తుందని తెలిపారు. గురువారమిక్కడ తాడేపల్లి ప్యాలెస్‌లో తన అనుకూల మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి వైసీపీని వీడడంపై అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. 'వైసీపీకి 11 మంది రాజ్యసభ సభ్యులు.. వీరిలో పోయినోళ్లు ముగ్గురు. సాయిరెడ్డితో కలిపితే నలుగురు. రాజకీయాల్లో ఉన్నప్పుడు క్యారెక్టర్ ముఖ్యం. క్రెడిబిలిటీ అనే పదానికి అర్థం తెలిసి ఉండాలి. రాజకీయాల్లో ఉన్నప్పుడు.. ఫలానా వాడు నాయకుడని కాలర్ ఎగరేసుకుని చెప్పుకోవాలి. అది ముఖ్యమంత్రి అయినా సరే.. ఎంపీ అయినా సరే.. ఎమ్మెల్యే అయినా సరే.. ఎవరి గురించైనా గొప్పగా చెప్పుకోవాలి. కానీ మనమంతట మనమే ప్రలోభాలకు లొంగో.. భయపడో.. ఏదో కారణం చేత మన వ్యక్తిత్వాన్ని.. క్రెడిబిలిటీని పణంగా పెట్టి.. కాంప్రమైజ్ అయి అటువైపు పోతే మన గౌరవం ఏంది.. మన వాల్యూ ఏంది? మన క్యారెక్టర్ ఏంది? మన క్రెడిబిలిటీ ఏంది.. అనేది ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవాలి. కష్టం ఎల్లకాలం ఉండదు.. డెమోక్రసీ అంటేనే ఐదేళ్లు. అది సాయిరెడ్డికైనా అంతే.. పోయిన ముగ్గురు ఎంపీలకైనా అంతే.. ఒకడో అరో పోతే వారికైనా అంతే' అని జగన్ వ్యాఖ్యానించారు.



విద్యార్థి గురించి అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

విద్యార్థికి కలెక్టర్ 'మేలుకొలుపు'!

» ఉదయం 5:30కే పదో తరగతి విద్యార్థి ఇంటి తలుపు తట్టిన భువనగిరి కలెక్టర్

» విద్యార్థి చదువు, కుటుంబ స్థితిపై ఆరా

» కుర్చీ, రైటింగ్ ప్యాడ్, 5 వేల సాయం

సంస్థాన్ నారాయణపురం ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆయనో జిల్లా కలెక్టర్.. వేకువజామునే ఓ పేద విద్యార్థి ఇంటికి వెళ్లి తలుపు తట్టారు. ఆ విద్యార్థికి నేనున్నానంటూ వెన్ను తట్టారు. కుర్చీ, రైటింగ్ ప్యాడ్, రూ.5 వేల సాయం అందజేశారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలోని బాలుర హాస్టల్‌లో రాత్రి బస చేసిన కలెక్టర్ గురువారం తెల్లవారుజామున 5.30 గంటలకు శేరిగూడెం గ్రామానికి వెళ్లారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి భరత్ చంద్ర ఇంటికి వెళ్లారు. చదువు గురించి భరత్ చంద్రతో, కుటుంబ పరిస్థితి గురించి విద్యార్థి తల్లితో కలెక్టర్ చర్చించారు. భరత్ జీవితంలో స్థిరపడేందుకు తనవంతు సహకారం అందిస్తానని కలెక్టర్ భరోసా ఇచ్చారు. విద్యార్థి చదువుకోవడానికి చైర్, రైటింగ్ ప్యాడ్‌ను కలెక్టర్ విద్యార్థికి అందజేశారు. పరీక్షలు పూర్తయ్యేంత వరకు ప్రతి నెలా రూ.5 వేలు సహాయం అందజేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఫిబ్రవరి నెలకు రూ.5 వేలను విద్యార్థికి అందజేశారు.

కూతుర్ని వేధిస్తున్న వ్యక్తిని చంపిన తండ్రి

చిన్నచింతకుంట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కూతుర్ని వేధిస్తున్న యువకుడిని ఆమె తండ్రి ఇనుప రాడ్డుతో కొట్టి చంపాడు. గురువారం మధ్యాహ్నం మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండలం తిర్మలాపూర్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వనపర్తి జిల్లా ఆత్మకూరుకు చెందిన షేక్ అబ్దుల్ రహమాన్ 20 ఏళ్లుగా భార్య, కూతురితో కలిసి ఏపీలోని నందికొట్కూరులో నివసిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన అలీఖాన్ (33) తరచూ రహమాన్ కూతురిని పెళ్లి చేసుకుంటానని వేధించేవాడు. దీంతో రహమాన్ కుటుంబం తమ బంధువులు ఉన్న తిర్మాలాపూర్ వచ్చింది. అలీఖాన్ కూడా తిర్మలాపూర్ వచ్చి.. రహమాన్ ఉన్న ప్రాంతంలో గురువారం తిరిగాడు. రగిలిపోయిన రహమాన్ ఇనుపరాడ్డుతో అలీఖాన్ తలపై బలంగా కొట్టాడు. బండరాయితో తలపై మోదాడు. దీంతో అలీఖాన్ అక్కడికక్కడే మరణించాడు.

చేతిపై పురుషాంగం మొలిపించి..

» సోమాలియా యువకుడికి అమర్చిన 'మెడికవర్' వైద్యులు

» ఇన్‌ఫెక్షన్‌తో చిన్నప్పుడే పురుషాంగాన్ని కోల్పోవడంతో చికిత్స

» రెండు సర్జరీలతో సాధారణ స్థితికి



సర్జరీ తర్వాత యువకుడితో మెడికవర్ ఆస్పత్రి వైద్యులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6, (ఆంధ్రజ్యోతి): సున్తీ అనంతరం వచ్చిన ఇన్ఫెక్షన్ కారణంగా.. నాలుగేళ్ల వయసులోనే పురుషాంగాన్ని కోల్పోయిన సోమాలియా యువకుడికి మెడికవర్ ఆస్పత్రి వైద్యులు కొత్త జీవితాన్ని ప్రసాదించారు! అతడి ముంజేయి వద్ద కొత్త పురుషాంగాన్ని అభివృద్ధి చేసి.. రెండు శస్త్రచికిత్సలు చేసి అతడికి అమర్చారు. ఈ చికిత్సకు సంబంధించిన పూర్తి వివరాలను.. మెడికవర్ సీనియర్ యూరాలజిస్ట్, ఆండ్రాలజిస్ట్ డాక్టర్ రవికుమార్, రీకన్‌స్ట్రక్టివ్ కాస్మొటిక్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ దాసరి మధు వినయ్‌కుమార్ గురువారం విలేఖరులకు వివరించారు. సోమాలియాకు చెందిన ఆ యువకుడు 15 ఏళ్లుగా ఈ సమస్యతో బాధపడుతున్నాడని.. సామాజికంగా కూడా వేధింపులు హేళనలకు గురవుతున్నాడని తెలిపారు. సోమాలియాలో పలువురు వైద్యులను సంప్రదించినా ఫలితం లేకపోవడంతో ఏడాదిన్నర క్రితం మెడికవర్ ఆస్పత్రికి వచ్చినట్టు చెప్పారు. అన్ని పరీక్షలూ చేసిన డాక్టర్ రవికుమార్, డాక్టర్ మధు వినయ్‌కుమార్.. అతడి పురుషాంగాన్ని పునఃసృష్టించాలని నిర్ణయించారు. అందులో భాగంగా అతడి ముంజేతి వద్ద మైక్రో వాస్క్యులర్ సర్జరీ ద్వారా పురుషాంగాన్ని అభివృద్ధి చేశారు. అతడి శరీరం నుంచే చర్మం, రక్తనాళాలు, కొవ్వును సేకరించి.. కొత్త పురుషాంగాన్ని సర్జరీ ద్వారా నిర్ణీతస్థానంలో అమర్చారు. ఈ తరహా శస్త్రచికిత్స రాష్ట్రంలో ఇదే మొదటిసారి అని.. దీనికి 10 గంటలకు పైగా సమయం పట్టిందని వైద్యులు వెల్లడించారు. సర్జరీ అయిన ఏడాదిలోగా అతడి పురుషాంగానికి పూర్తిగా స్పర్శ వచ్చిందని, సాధారణ పురుషుల్లాగానే నిలబడి మూత్రవిసర్జన చేయగలుగుతున్నాడని చెప్పారు. పూర్తిగా స్పర్శ వచ్చిన నేపథ్యంలో.. మూడు వారాల క్రితం అతడికి మరో సర్జరీ చేసి పురుషాంగంలో 'పినైల్ ఇంప్లాంట్'ని కూడా అమర్చారు. ఆ ఇంప్లాంట్ వల్ల అతడు శృంగారంలో కూడా పాల్గొనవచ్చని.. కాకపోతే, దీని ద్వారా పునరుత్పత్తి సామర్థ్యం ఉండదని వైద్యులు వివరించారు. పిల్లల కోసం ఇతరత్రా వైద్యపరమైన విధానాలను ఆశ్రయించాల్సి ఉంటుందన్నారు. అరుదైన కేసు అయినప్పటికీ ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా చేశామన్నారు. ఇక.. ఇన్నాళ్లుగా తాను ఎంతో మానసిక క్షోభను అనుభవించానని, మెడికవర్ వైద్యులు చేసిన చికిత్స వల్ల ఆనందంగా తన దేశానికి వెళ్తున్నానని సోమాలియా యువకుడు తెలిపాడు.

ఇంట్లో తల్లి, తనయుడికి కత్తిపోట్లు

» ఆస్పత్రికి తరలింపు.. ఇద్దరి పరిస్థితి విషమం

» దుండగులు చొరబడి దాడి చేశారంటున్న బాధితురాలి మరో ఇద్దరు కుమారులు

» మెట్టుగూడలో ఘటన.. తీవ్ర అనుమానాలు



రేణుక, యశ్వంత్ (ఫైల్)

బౌద్ధనగర్, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): ఆమెకు ముగ్గురు కుమారులున్నారు! బుధవారం ఉదయం ఇంట్లో ఆమె, పెద్ద కుమారుడు, మంచంపట్టిన వృద్ధురాలైన అత్త ఇంట్లో ఉన్నారు. మరో ఇద్దరు కుమారులు డ్యూటీకి వెళ్లిపోయారు. ఇంట్లోంచి హాహాకారాలు వినిపించడంతో స్థానికులు వెళ్లి చూడగా.. తల్లి, కుమారుడు కత్తిపోట్ల గాయాలతో రక్తపుమడుగులో పడి ఉన్నారు. మెట్టుగూడలో ఈ ఘటన జరిగింది. ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దాడి గుర్తుతెలియని దుండగుల పనేనని మిగతా ఇద్దరు కుమారులు చెబుతున్నారు. కత్తిపోట్లకు గురైన బాధితులు రేణుక (55), ఆమె పెద్ద కుమారుడు యశ్వంత్ (31). రేణుకకు యశ్‌పాల్, వినయ్ అనే మరో ఇద్దరు కుమారులున్నారు. మెట్టుగూడ నల్లపోచమ్మ ఆలయం సమీపంలో ఈ కుటుంబం నివసిస్తోంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. రేణుక భర్త ఏజీ ఆఫీసులో ఉద్యోగి. మూడేళ్ల క్రితం మృతిచెందాడు. రేణుక అత్త అనసూయ అనారోగ్యంతో మంచంపట్టింది. యశ్వంత్, ఓ రైల్వే కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్నాడు. ఉదయం 11 గంటలకు ఇంట్లోంచి ఆర్తనాదాలు విని.. స్థానికులు వెళ్లగా కత్తిపోట్లతో గాయపడిన స్థితిలో రేణుక, యశ్వంత్ కనిపించారు. ఇద్దరినీ చికిత్స కోసం 108లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరికీ శస్త్రచికిత్స చేసిన వైద్యులు.. వారు కోమాలో ఉన్నారని, పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారు. ఘటనపై రేణుక మరో కుమారుడు వినయ్ మాట్లాడాడు. తాను, రెండో అన్నయ్య అయిన యశ్‌పాల్ ఉదయం పదింటికే బయటకు వెళ్లిపోయామని.. పదకొండు గంటలకు స్థానికులు ఫోన్‌చేసి ఘటనపై సమాచారమివ్వడంతో ఇంటికొచ్చామని చెప్పాడు. సీసీ ఫుటేజీ పరిశీలిస్తే.. ఉదయం 9-11 గంటల మధ్య గుర్తు తెలియని ఆరుగురు వ్యక్తులు కనిపించారని.. నలుగురు లోపలికి చొరబడి తల్లి, అన్నపై దాడి చేశారని చెప్పాడు. అయితే సీసీ ఫుటేజీని పరిశీలిస్తే.. ఎవరైనా ఇంట్లోకి వెళ్లినట్లుగానీ, బయటకు వచ్చినట్లుగానీ కనిపించలేదు. ఘటనాస్థలిలో కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.. కాగా రేణుక ఇద్దరు కుమారులను కూడా పోలీసులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. వినయ్ చెప్పిన అనుమానితులను పోలీసులు ప్రశ్నించగా.. తాము వీధుల్లో తిరుగుతూ బియ్యం కొంటామని, తమకు ఘటనతో సంబంధం లేదని స్పష్టం చేసినట్లు సమాచారం.

సచివాలయంలో మరో నకిలీ అధికారి

» తహసిల్దార్‌నంటూ కారులో ప్రవేశం

» అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పట్టుకున్న భద్రతా సిబ్బంది, కేసు నమోదు



హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో నకిలీ ఉద్యోగుల బెడద పెరుగుతోంది. వారం కిందటే స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్పీఎఫ్) ఓ నకిలీ ఉద్యోగిని పట్టుకోగా.. తాజాగా గురువారం మరో నకిలీ అధికారి పట్టుబడ్డాడు. 'మేడ్చల్-మల్కాజిగిరి తహసిల్దార్, 'ఆన్ గవర్నమెంట్ డ్యూటీ' అని స్టిక్కర్ ఉన్న కారులో సచివాలయంలోకి ప్రవేశించి అనుమానాస్పదంగా సంచరిస్తున్న కొంపల్లి అంజయ్య (56)ను ఎస్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని సైఫాబాద్ పోలీసులకు అప్పగించారు. అతనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అతను గురువారం ఉదయం 11.50 గంటలకు సచివాలయంలోకి ప్రవేశించాడు. మొదటి అంతస్తులో తిరుగుతున్న అతనిపై భద్రతా సిబ్బందికి అనుమానం వచ్చి వివరాలు అడిగారు. తాను సూర్యాపేట జిల్లా తిప్పర్తి మండల రెవెన్యూ అధికారినని అంజయ్య చెప్పాడు. ఇతర వివరాలు అడిగితే అనుమానంగా వ్యవహరించడమే కాకుండా అక్కడి నుంచి వెళ్లిపోయే ప్రయత్నం చేశాడు. దాంతో భద్రతా సిబ్బంది అతన్ని పట్టుకుని చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ వద్దకు తీసుకొచ్చారు. పూర్తి సమాచారాన్ని సేకరించగా... అంజయ్య నకిలీ ఐడీ కార్డు తయారుచేయించుకుని, సచివాలయానికి వస్తున్నట్లు తేలింది. అంజయ్యను, కారును పోలీసులకు అప్పగించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.